అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక


సోమవారం 11-3-2024

సంపుటి : 10 | సంచిక : 70 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



పంజాబ్‌లో పట్టాలెక్కిన అన్నదాతలు

- 62 ప్రాంతాల్లో రైలు రోకో
- హర్యానాలో రైతుల నిర్బంధం 2లో



ప్రభుత్వ ఒత్తిడే కారణం

అరచేతిలో సమాచారం ఉన్నా ఎస్‌బీఐ దాటిపెడుతోంది 3లో

ఎన్నికల సంఘంలో ఏం జరుగుతోంది ?

గోయల్ రాజీనామాపై చర్చోపచర్చలు

బెంగాల్ పర్యటనలో తెరపైకి అభిప్రాయభేధాలు

- నేరుగా రాష్ట్రపతికి రాజీనామా లేఖ
- సీఈసీతో విభేదాలే కారణం?

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి మరి కొద్ది రోజులు మాత్రమే సమయం ఉండగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ)లో రచ్చ చర్చనీయాంశంగా మారింది.ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ తన పదవికి ఆకస్మికంగా, అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం విదితమే. అయితే ఆయన తీసుకున్న నిర్ణయం అనేక మందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు పశ్చిమ బెంగాల్‌లో పర్యటించినప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్‌తో నెలకొన్న విభేదాల కారణంగానే గోయల్ రాజీనామా చేశారని ఎన్నికల కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. ఇంతకీ ఏమిటా విభేదాలు..? ఎన్నికల ముందు ఎందుకీ రచ్చ..? అన్నది చర్చనీయాంశంగా మారింది.



(ఫైల్)

న్యూఢిల్లీ : బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్లను వివరించేందుకు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొనడానికి గోయల్ నిరాకరించారని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో సీఈసీ ఒక్కరే పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఆరోగ్య కారణాలతో గోయల్ ఢిల్లీకి పయనమయ్యారని ఆయన ఆ సందర్భంగా చెప్పారు. అయితే ఈ వాదనను గోయల్ సన్నిహిత వర్గాలు తోసిపుచ్చాయి. ఆయన ఆరోగ్యం భేషుగ్గా ఉన్నదని చెప్పాయి. 'కొన్ని తీవ్రమైన విభేదాల కారణంగానే గోయల్ తన బెంగాల్ పర్యటనను కుదించుకొని ఢిల్లీ చేరుకున్నారు' అని ఆ వర్గాలు స్పష్టం చేశాయి.

ఇంతకీ ఏం జరిగింది..?

ఈసీఐలోని ఈ ఇద్దరు అధికారుల మధ్య ఏం జరిగింది? ఆ విభేదాలు ఏమిటి? ఏయే అంశాలపై అభిప్రాయబేధాలు తలెత్తాయి? అనే విషయాలు తెలియడం లేదు. గోయల్ సన్నిహిత వర్గాలు కానీ, ఈసీ వర్గాలు కానీ దీనిపై పెదవి విప్పడం లేదు. ఈ నెల 7న కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన సమావేశాలకు సీఈసీతో పాటు గోయల్ కూడా హాజరయ్యారు. కానీ ఆ మరునాడు ఎన్నికల ఏర్పాట్లపై ఈసీ అధికారులు, కేంద్ర హోం కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా మధ్య జరిగిన సమావేశానికి ఆయన డుమ్మా కొట్టారు. పైగా సీఈసీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా రాష్ట్రపతికి తన రాజీనామా లేఖను పంపారు.



గోయల్‌కు నచ్చచెప్పేందుకు, సీఈసీతో ఆయనకు ఉన్న విభేదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వైపు నుండి ప్రయత్నాలు జరిగినప్పటికీ ఆయన తన పట్టు వీడలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గోయల్ రాజీనామాను రాష్ట్రపతి శనివారం నాడు ఆమోదించారు. దీనికి సంబంధించి న్యాయ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ వెలువడే వరకూ సీఈసీకి, ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు తప్ప గోయల్ రాజీనామా గురించి ...2లో

గోయల్ రాజీనామా గుట్టు విప్పాలి

- కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలి : సీపీఐ (ఎం) డిమాండ్



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ ఆకస్మికంగా రాజీనామా చేయడంపై సీపీఐ (ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. గోయల్ రాజీనామాకు దారితీసిన కారణాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. రాజ్యాంగబద్ధంగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడంలో ఈసీ కీలక పాత్ర నిర్వహించాల్సి ఉంటుందని, ఆ సంస్థ విశ్వసనీయతలో రాజీ పడరాదని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన త్రిసభ్య ఎన్నికల కమిషన్‌లో ఇప్పుడు సీఈసీ రాజీవ్ కుమార్ మాత్రమే ...2లో


ఉద్యోగ, ఉపాధ్యాయలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

చర్చలే సమస్యలకు పరిష్కారం... నిర్బంధాలు కాదు

ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలకు ఫ్రీ కరెంట్

- శాఖల వారీగా సంఘాలు ఉండాల్సిందే...
- వారితో మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తుంది : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సమస్యల పరిష్కారానికి చర్చలే మార్గమనీ, నిర్బంధాలతో ఏదో సాధిస్తామనుకుంటే పొరపాటేనని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయా శాఖల్లో సంబంధిత అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో చర్చించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టంచేశారు. గత పదేండ్లుగా కేసీఆర్ కుటుంబమే సంఘాలకు గౌరవాధ్యక్షులుగా ఉన్నారనీ, సమస్యలు చెప్పుకునే అవకాశంలేక ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం (ఎమ్‌సీహెచ్‌ఆర్డీ)లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. వారి సమస్యల పరిష్కారాన్ని కోరుతూ తమపార్టీ మ్యానిఫెస్టోలో పెట్టామనీ, అధికారంలోకి వచ్చాక దానికోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచితంగా విద్యుత్ ఇస్తామనీ, కిందిస్థాయి సిబ్బందిని కూడా నియమిస్తామని చెప్పారు. ఉద్యోగుల డిఏ అంశాన్ని మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వివిధ శాఖల్లో దాదాపు 1,100 మంది రిటైర్డ్ ఉద్యోగులు పనిచేస్తున్నారనీ, వారి కొనసాగింపుపై ...2లో


మాట్లాడుతున్న కేటీఆర్

గతం వద్దు..భవిష్యత్తు గురించి ఆలోచిద్దాం

- మూడు తొమ్మిదులు పోయినా రుణమాఫీ కాలే..
- కాంగ్రెస్ మాయమాటలతో ప్రజలు మోసపోయారు
- మార్చి 17తర్వాత ప్రజల్లోకి వెల్దాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రస్తుతం మనం గతం గురించి మాట్లాడుకోవద్దని.. భవిష్యత్తు గురించి ఆలోచిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ జనవరి 9, ఫిబ్రవరి 9, మార్చి 9 మూడు తొమ్మిదులు పోయినా ఇప్పటివరకు రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని ...13లో

బీఆర్ఎస్ సర్కారు ఏకపక్ష నిర్ణయం

నిపుణుల సూచనలు బేఖాతరు | కాళేశ్వరంలో ప్రజాధనం వృధా

- నిష్పక్షపాత ఇంజినీర్లతో కమిటీ వేయాలి
- అఖిలపక్షంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి
- నష్టానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- కేంద్రం ప్రేక్షక పాత్ర తగదు : టీజేఎస్ బహిరంగ చర్చలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ సర్కారు నిపుణుల కమిటీ సూచనలను పక్కన పెట్టి ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో ప్రజాధనం వృధా అయిందని సీపీఐ (ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు - బీఆర్ఎస్ అబద్ధాలు- కాగ్ చెప్పిన వాస్తవాలు అనే అంశంపై నిర్వహించిన బహిరంగ చర్చలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం నిర్మాణంలో వాస్తవాలు ప్రజలకు తెలిసేలా నిష్పక్షపాతంగా ఉండే ఇంజినీర్లతో కమిటీ వేయించి నిర్దిష్ట సమయంలోగా నివేదిక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం తగదని హితవు పలికారు. కాళేశ్వరంపై అధికార, ప్రతిపక్షాలు చెబుతున్న దానిలో సామాన్యులు వాస్తవాన్ని గ్రహించేలా వారికి అర్థమయ్యేలా వివరించే కార్యక్రమాలు చేపట్టాలని మేధావులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, ఇంజినీర్లకు ఆయన సూచించారు. దివంగత ముఖ్యమంత్రి ప్రాణహిత ప్రాజెక్టు ప్రతిపాదించిన సమయంలో తాను శాసనసభలో జరిగిన చర్చలో పాల్గొన్నానని గుర్తుచేశారు. నీళ్ల, ...13లో



క్రెడాయ్ ముగింపు సభలో మంత్రులు భట్టి, ఉత్తమ్

నిర్మాణరంగానికి సర్కారు సహకారం

క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపులో మంత్రులు భట్టి, ఉత్తమ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణరంగానికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు, రియల్టర్ల పాత్ర ప్రధానమైందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు సహా అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ...2లో

రాముడ్ని కూడా ఈడీతో వెంటాడేవారు..

బీజేపీలో చేరాలని ఒత్తిడి చేసేవారు : కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఈ కాలంలో రాముడు ఉండి ఉంటే ఈడీ వంటి దర్యాప్తు సంస్థలతో వేధించి ఆయన్ను కూడా బీజేపీలో చేరాలని ఒత్తిడి చేసేవారని ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కాషాయ పార్టీపై విమర్శలు చేశారు.కాషాయ పార్టీలో చేరాలని, లేకుంటే జైలులో ఉంటారని రాముడినీ ఒత్తిడి చేసేవారని బీజేపీని దుయ్యబట్టారు.కేజ్రీవాల్‌కు ...13లో

బీజేపీని మట్టికరిపించడమే ఇండియా లక్ష్యం : స్టాలిన్

తమిళనాడులో ఖరారైన సీట్ల సర్దుబాటు



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయం.. తమ కూటమి లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 40 లోక్‌సభ నియోజకవర్గాల్లో విజయమే లక్ష్యంగా భావించి ...13లో

రెండున్నర కోట్లమంది రోడ్డున పడ్డారు



- మోడీ సర్కార్ నిర్వాకంతో మూతపడ్డ చిన్న పరిశ్రమలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ పదేండ్ల పాలనలో ఏకంగా 2.5 కోట్ల చిన్న మధ్యతరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈ) మూతపడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఆదివారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 1.3 కోట్ల ఎంఎస్‌ఎంఈలు ...3లో



బిల్ కలెక్టర్లకు గృహజ్యోతి కష్టాలు

- ఉద్యోగాలకే ఎసరు
- వీధులపాలవుతున్న కుటుంబాలు
- ప్రత్యామ్నాయాలు చూపాలి : టీఎస్‌యూఈఈయూ డిమాండ్

13లో

కాసులుంటే చాలు..

అధికారంలో ఎవరున్నా ఓకే.. వాటాలు వెళ్తే అక్రమాలకు అడ్డేలేదు

'అధికారంలో ఏ ప్రభుత్వం ఉందన్నది కాదు.. ఆ ప్రభుత్వంలోని పెద్దలు తమ కనుసన్నల్లో ఉంటే చాలు' అన్న చందంగా రియల్ వ్యాపారుల వ్యవహారం కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో పెద్దల అండతో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా పెట్టిన వారు ఇప్పుడు ఆ భూములను కాపాడుకోవడానికి ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న వారికీ ఎర వేస్తున్నారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి కాపాడుతామన్న అధికార పార్టీలోని కొంత మంది ముఖ్య నేతలను బడాబాబులు కాసులతో కబ్జా చేస్తున్న పరిస్థితి నెలకొంది. కాసులమాయలో పడి వారు ప్రభుత్వాన్నే మాయ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- విలువైన భూములు కైవసం
- కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములపై ఫిర్యాదులు.. స్పందన కరువు
- భూములను కాపాడుతామన్న మాటలు నీటి మూటలేనా..!
- అధికార పార్టీ నేతలకే అంతుచిక్కని ప్రశ్న



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. ఆనాటి ప్రభుత్వ పెద్దల అండతో ప్రభుత్వ భూములు, భూదాన్, వక్ఫ్‌బోర్డు, సిలింగ్, ఫారెస్ట్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పెట్టి వెంచర్లు చేశారు. జిల్లాలో వందల ఎకరాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయి. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను, చెరువు, కుంటల భూములను ...13లో

ఇంటిపోరు ఇంతింతకాదయా

బీజేపీలో ఈటల టార్గెట్‌గా పావులు

- పార్టీకి రాజీనామా చేసిన జిల్లా అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి
- అసహనంలో కూన శ్రీశైలంగౌడ్
- సొంతనేతల నుంచే ఈటలకు ఓటమిగండం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'చెప్పులోన రాయి చెవిలోన జోరీగ.. కంటిలోని నలుసు కాలిముల్లు..ఇంటిలోన పోరు ఇంతింతగాదయ...విశ్వదాభిరామ వినురవేమ' అంటూ ఇంటిపోరులోని బాధను చాలా చక్కగా వివరించారు వేమన. సరిగ్గా ఈటల రాజేందర్ పరిస్థితి ఇప్పుడు ఇలాగే ఉంది. ఆయనకు ...3లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

చర్చలే సమస్యలకు పరిష్కారం...నిర్బంధాలు కాదు

(మొదటిపేజీ తరువాయి)

త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగుల్లో 95శాతం మంది నిజాయితీగా పని చేస్తున్నారని అన్నారు. ఉద్యోగ సంఘాలపై కక్షకట్టి వాటిని రద్దు చేస్తే...ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్నే రద్దు చేశారని తెలిపారు. తెలంగాణ సమాజమంతా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుందనీ, దీనిలో విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, యువజన సంఘాల పాత్ర కీలకమైందని చెప్పారు. ఏ ఒక్క రాజకీయ పార్టీతోనో రాష్ట్రం సిద్ధించిందనుకోవడం అసంబద్ధ వాదన అని తేల్చిచెప్పారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని మాజీ సీఎం కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారనీ, కానిస్టేబుల్ కిష్టయ్య రక్తం చిందించారనీ, శ్రీకాంతాచారి మాంసపుముద్దలా మారారంటూ వారి త్యాగాలను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. తనకు తానే తెలంగాణ బాపుగా కేసీఆర్ చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాపు సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఆదాయం గణనీయంగా పడిపోయిందనీ, ఛిద్రమైన ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకు రోజుకు 18 గంటలు కష్ట పడుతున్నామని తెలిపారు. ఒక్కో చిక్కుముడి విప్పుతూ ఉద్యోగ నియామక ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామనీ, 11వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని వివరించారు. ప్రభుత్వం మూడు నెలలే ఉంటుందని కొందరు ప్రకటనలు చేస్తున్నారనీ, తాము అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదనీ, తమాషాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పదేండ్లు అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్షనేత కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై గౌరవం, విశ్వాసం ఉండాలని హితవు పలికారు. గవర్నర్‌తో మాట్లాడి ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసనమండలికి పంపుతామనీ, ఆయన ఎమ్మెల్సీగా ఉంటే మండలికే గౌరవమని అన్నారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు స్కూల్ యూనిఫారాలు

విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సూచించారు. దీనివల్ల స్కూల్స్ పైన నిరంతర పర్యవేక్షణ ఉండటంతో పాటు మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశానంతరం అక్కడే ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ ప్యానెల్ల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఎన్ఆర్ఐల సహకారం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. వేసవి సెలవులు ముగిసేలోగా పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. స్కిల్ యూనివర్శిటీ కోసం ఐఎస్బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్ పై పూర్తిస్థాయిలో దృష్టిసారించాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకు ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) తీసుకు వచ్చే యోచన చేస్తున్నామని తెలిపారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు (43) తన వ్యవసాయ బావిలో మూడు నెలల క్రితం అప్పులు తెచ్చి మూడు బోర్లు వేసినా నీళ్ల పడలేదు. దాంతో అప్పుల బాధ ఎక్కువై తీవ్ర మనస్తాపం చెంది శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

ఎస్ఐబీలో రికార్డుల ధ్వంసంపై డీఎస్పీ ప్రణీత్‌పై కేసు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో సంచలనం రేపిన ఎస్ఐబీలో రికార్డుల ధ్వంసానికి సంబంధించి డీఎస్పీ ప్రణీత్‌రావుపై నగర పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గతంలో ఎస్ఐబీలో పని చేసి ప్రస్తుతం జగిత్యాల డీసీఆర్బీలో ఉన్న ప్రణీత్‌ను ఇటీవలనే ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం విదితమే. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీలో ఉండగా.. ప్రణీత్‌రావు కొందరు ప్రతిపక్ష నాయకులతో పాటు ప్రభుత్వాధికారుల ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

అనుమానాస్పదంగా ఇద్దరు చిన్నారులు మృతి

- పాలలో విషం కలిపినట్టు అనుమానాలు..?

నవతెలంగాణ-గార్ల

వారిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు.. ఇద్దరు సంతానంతో చక్కగా జీవనం సాగిస్తున్నారు.. ఏమైందో తెలియదు ఒక్కసారిగా ఆ తల్లిదండ్రులు మానవత్వం మంటకలిసింది. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులపై విషప్రయోగం చేసి వారి చావుకు కారణమయ్యారు చిన్నారుల తల్లిదండ్రులు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని అంకన్నగూడెం గ్రామానికి చెందిన కందగట్ల అనిల్,దేవి దంపతులు.. బయ్యారం మండలం నామాలపాడులో తమ ఇద్దరు పిల్లలు లాస్య (3), లోహిత (1) తో కలిసి జీవిస్తున్నారు. వారం క్రితం అనిల్ తమ స్వగ్రామం అంకన్నగూడెంకు కుటుంబంతో కలిసి వచ్చారు. అతడి తండ్రి వెంకన్న స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున షాపునకు వెళ్లిన వెంకన్న తిరిగి 10 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లో చిన్నారులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గమనించిన వెంకన్న.. కొడుకు, కోడలు కనిపించకపోవడంతో స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ తిరుపతి, సీఐ రవి కుమార్, ఎస్ఐ జీనత్ కుమార్ మృతదేహాలను పరిశీలించారు. చిన్నారుల తాత వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులు పరారీలో ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. చిన్నారులు తాగే పాలలో విషం కలిపి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

సమరశీల పోరాటాలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం :సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ముగిసిన టీఎమ్ఎస్ఆర్‌యు 5వ మహాసభలు

నవతెలంగాణ - కరీంనగర్

దేశంలో నెలకొన్న నేటి పరిస్థితుల్లో సమరశీల పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధించుకోవటం సాధ్యమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సీఐటీయూ) 5వ రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు మారుతున్నా ప్రభుత్వ విధానాలు మాత్రం మారటం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలనే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా అమలు చేస్తున్నారని విమర్శించారు.

మెడికల్ రంగంలో పనిచేస్తున్న మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అనేక ఏండ్లుగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వీరిని స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సంస్కరణల పేరుతో 29కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాన్ని రూ.18వేలుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు.

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) అధ్యక్షులు ఆర్.రమేష్ సుందర్ మాట్లాడుతూ.. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ని యథావిధిగా అమలు చేయాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన పని విధానాలు కల్పించాలన్నారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న ఫార్మా యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని తెలిపారు.

అనంతరం అలాగే సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎఫ్ఎంఆర్ఏఐ సహాయ ప్రధాన కార్యదర్శి కె. సునీల్ కుమార్ మాట్లాడారు.

నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక..

మహాసభకు హాజరైన ప్రతినిధులు కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.
రాష్ట్ర అధ్యక్షునిగా చీకోటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.భానుకిరణ్, ఉపాధ్యక్షుడిగా ఐ.రాజుభట్, సహాయ ప్రధాన కార్యదర్శిగా ఎ.నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా దుర్గా ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులుగా కె.ఐలయ్య, జి.విద్యాసాగర్, ఎ.సదానందచారి, సయ్యద్ సిద్దిక్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా గుండా శ్రీనివాస్, ఎ.నరసింహచారి, కె.జగదీశ్వరాచారి, ఎల్.లోకేశ్వర్‌రెడ్డి, ఎంఏక్యూ అఫ్రోజ్, పి.రాజేష్ కుమార్, బి.మల్లికార్జున్, వి.శ్రీనివాస్, ఎం.సతీష్ కుమార్, పి.రాము, కె.సుధాకర్, సోమ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల సంఘంలో ఏం జరుగుతోంది?

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికీ తెలియదు. గోయల్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారని, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటారని అధికారులు చెబుతున్నారు. గోయల్ రాజీనామా ఈసీ స్వతంత్రతపై అనేక ప్రశ్నలు రేకెత్తిస్తోందని వారు అంటున్నారు. ఎన్నికల కమిషనర్‌గా నియామకం కావడానికి ముందు ఆయన ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మరో ఎన్నికల కమిషనర్ అనుప్ చంద్ర పాండే పదవీకాలం గత నెలలోనే ముగిసినందున ఇప్పుడు కమిషన్‌లో ఒక్క రాజీవ్ కుమార్ మాత్రమే ఉన్నారు. కాగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

గోయల్ రాజీనామా గుట్టు విప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

మిగిలారు. అనూప్ పాండే గత నెలలోనే పదవీ విరమణ చేయగా, ఇప్పుడు తాజాగా గోయల్ రాజీనామా చేశారు. అనూప్ పదవీ విరమణతో ఖాళీ అయిన పోస్టును ఇప్పటికీ భర్తీ చేయలేదు. మరోవైపు ఎన్నికల తేదీలను మరి కొద్ది రోజుల్లో ప్రకటించబోతున్నారు.

ఈ నేపథ్యంలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో ఓ ప్రకటన విడుదల చేసింది. 'లోక్‌సభ ఎన్నికల కోసం పెద్ద ఎత్తున కసరత్తు జరగాల్సి ఉంది. అయితే దీనికి ముందే ఎన్నికల కమిషన్‌లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇది అనిశ్చిత వాతావరణాన్ని కల్పిస్తోంది. ఈ పరిస్థితికి దారితీసిన పరిణామాలపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది' అని ఆ ప్రకటనలో పొలిట్‌బ్యూరో సూచించింది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై వచ్చిన నూతన చట్టం కారణంగా కమిషన్ కూర్పు పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ కిందికి వచ్చిందని గుర్తు చేసింది. ఇలాంటి పరిస్థితులలో ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగలదా అనే ఆందోళన రేకెత్తుతోందని తెలిపింది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. సీఈసీ, ఈసీల నియామకంపై నరేంద్ర మోడీ ప్రభుత్వం గత సంవత్సరం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని ప్రతిపక్ష పార్టీలన్నీ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. నూతన చట్టం ప్రకారం నియామకాల కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చేశారు. ప్రధాని నేతృత్వంలోని నియామకాల కమిటీలో ఆయన నియమించే ఓ కేంద్ర మంత్రితో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత కానీ లేదా సభలో అతిపెద్ద పార్టీ నాయకుడు కానీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఎంపిక చేసిన పేర్లను ధృవీకరణ కోసం రాష్ట్రపతికి పంపుతారు. సీఈసీ, ఈసీల ఎంపిక కోసం ఏర్పాటు చేసే కమిటీలో ప్రధాని, ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేత లేదా అతి పెద్ద పార్టీ నేత సభ్యులుగా ఉండాలని సుప్రీంకోర్టు గత సంవత్సరం మార్చిలో తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే కేంద్రం ఈ తీర్పును బేఖాతరు చేస్తూ చట్టాన్ని తీసుకొచ్చింది.

'డబుల్' ఇండ్ల లబ్దిదారులకు
మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కరెంట్, మంచినీరు, లిఫ్ట్ సౌకర్యాలు లేక ఇబ్బందులు :

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారులకు కరెంటు, మంచినీరు, లిఫ్ట్.. తదితర సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పొందిన లబ్దిదారులకు ప్రభుత్వం ఈరోజుకీ ఇండ్లను అప్పగించలేదని తెలిపారు. కారణం ఆ ఇండ్లకు కరెంటు, వాటర్ కనెక్షన్లు ఇవ్వకపోవడమేనన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డబుల్ బెడ్‌రూమ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరమ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ వి.విజయ్ కుమార్ అధ్యక్షత జరిగిన లబ్దిదారుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు కనీస సౌకర్యాలు కల్పించకుండా లాటరీ తీసి లబ్దిదారులను ప్రకటించారని, వారికి సర్టిఫికెట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కరెంటు, మంచినీరు, లిఫ్ట్ సౌకర్యాలు లేకుండా గృహప్రవేశాలు ఎలా సాధ్యపడతాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకొని వేలాది మంది పేదలను వారికి కేటాయించిన ఇండ్లలోకి గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ చొరవ తీసుకొని సౌకర్యాలు కల్పనకు అవసరమైన అనుమతులు బడ్జెట్ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో ఈ సమస్యలపై తాను ముఖ్యమంత్రికి, సంబంధిత మంత్రులను కలిసి డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల సమస్యలపై విన్నవిస్తానని, వెంటనే లేఖ రాస్తానని అన్నారు. రవాణా శాఖ మంత్రి వెంటనే చొరవ తీసుకొని ఈ గృహ సముదాయాలకు బస్సు సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్ సిటిజెన్స్ ఫోరం అధ్యక్షులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కరెంటు, మంచినీళ్ల కనెక్షన్లు లాంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పొందామన్న ఆనందం లబ్దిదారుల్లో లేకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం మేము అనేక దఫాలుగా జీహెచ్ఎంసీ అధికారులను కలిశామని, కనీస వసతులు కల్పించమని కోరామని అన్నారు. నూతన ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారని చెప్పారు. ఈ సౌకర్యాల కల్పనలో ఆలస్యం అయ్యే కొద్ది లబ్దిదారులకు కిరాయి భారాలు పెరుగుతూనే ఉంటాయని, ఎంత త్వరగా ఇండ్లు అప్పగిస్తే అంత త్వరగా కిరాయి బారి నుంచి బయటపడతారని అన్నారు. రాబోయే వేసవి నాటికి ఇండ్లను అప్పగించాలని, పిల్లల స్కూల్స్ గురించి కూడా ఆలోచించుకోవాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణరంగానికి సర్కారు సహకారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నిర్మాణరంగ ప్రముఖులు ప్రభుత్వంతో కలిసి నడవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన మూడ్రోజుల క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణరంగ సమస్యల్ని తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నీటిని రీసైకిల్ చేసే ఆధునిక సాంకేతికతను బిల్డర్లు అందిపుచ్చుకోవాలనీ, దీనివల్ల అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయనీ, పారిశ్రామికంగా అనేక పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్‌పార్టీ వేసిన ముద్ర చెరిగిపోనిదనీ, ముందు చూపుతో అనేక ప్రాజెక్టులను ఏర్పాటు చేసిందంటూ పలు సంస్థల పేర్లను ఉటంకించారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన కోసం పెద్ద ఎత్తున బడ్జెట్లో నిధులు కేటాయిస్తామనీ, తద్వారా అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు వీ రాజశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ ఎన్ జైదీప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్‌లో పట్టాలెక్కిన అన్నదాతలు

- 62 ప్రాంతాల్లో రైలు రోకో
- హర్యానాలో రైతుల నిర్బంధం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో తమ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, రైతులందరికీ రుణమాఫీ అమల్జేయాలని కోరుతూ అన్నదాతలు ఆందోళనలను ఉధృతంగా కొనసాగిస్తున్నారు. పంజాబ్‌లో 62 ప్రాంతాల్లో రైతులు రైలు రోకో నిర్వహించారు. రైల్వే స్టేషన్లలోకి దూసుకెళ్లి పట్టాలపై కూర్చొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మరోవైపు హర్యానాలోనూ వివిధ రూపాల్లో ఆందోళనలకు సిద్ధమైన అన్నదాతలను అక్కడి బీజేపీ ప్రభుత్వం నిర్బంధించింది. పలుచోట్ల 144 సెక్షన్ విధించి అణచివేతకు పాల్పడింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు రైలురోకో నిర్వహించారు. ఈ ఆందోళనల్లో వేలాది మంది పాల్గొన్నారు. పంజాబ్‌లో 62 ప్రాంతాల్లో రైలు రోకో చేపట్టగా 49 రైలు సర్వీసులు రద్దు అయ్యాయి. ఇంటర్ సిటీ లైన్లతో పాటు ప్రధాన లైన్లు కూడా రైలు రోకో ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి. హర్యానా, రాజస్థాన్ తదితర



రాష్ట్రాల్లో వందలాది మంది రైతులను అక్కడి ప్రభుత్వాలు నిర్బంధించాయి. హర్యానాలోని దబ్వాలి, ఎల్లెనాబాద్‌లో అనేక మంది రైతులు ఆందోళన ప్రదేశాలకు వెళుతుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌లోని దౌసాలో కూడా ఇదే విధమైన పరిస్థితి నెలకొంది. హర్యానా బిజెపి ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతిఘటించి అన్నదాతలు మూడు చోట్ల రైలు రోకో చేపట్టారు. అంబాలాలోని మోహదా రైల్వే క్రాసింగ్, పంచకులలోని మనక్‌పూర్, అంబాలాలోని సర్సిని రైల్ రోకో జరిగింది.

కిసాన్ మజ్దూర్ మంచ్ (కేఎంఎం) సమన్వయకర్త సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ రాజస్థాన్‌లోని పిలిబంగ, తమిళనాడులోని తంజావూరు, మధ్యప్రదేశ్‌లోని ఝబువాతో పాటు అనేక ఇతర ప్రాంతాల్లో కూడా రైతులు రైలు రోకో నిర్వహించారని తెలిపారు. రైళ్లను అడ్డుకోవడం తమకే సంతోషకరమైన విషయం కాదని, అయితే కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలియజేసేందుకు మరో మార్గం లేకపోయిందని ఆయన అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) సమన్వయకర్త జగ్జిత్ సింగ్ దల్లెవాల్ మాట్లాడుతూ రైతుల సమస్యలు ఆలకించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం సాహసించలేకపోతోందని, రైతుల ఆందోళనను చూసి అది పారిపోతోందని విమర్శించారు. బీజేయూ షహీద్ భగత్ సింగ్ ప్రతినిధి తేజ్వీర్ సింగ్ మాట్లాడుతూ హర్యానాలో రైతులపై బీజేపీ ప్రభుత్వ నిర్బంధ చర్యలను ఖండించారు.

మరోవైపు శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో కొనసాగుతున్న ధర్నాలు యథావిధిగా కొనసాగాయి. సమీప గ్రామాల నుంచి చాలా మంది నిరసనకారులు సమీపంలో ఉన్న శంభు రైల్వే స్టేషన్‌కు వెళ్లి నాలుగు గంటల పాటు పట్టాలపై కూర్చొని ఆందోళన చేపట్టారు.

నీట్ 2024 కు రికార్డు స్థాయిలో దరఖాస్తులు

- 25 లక్షలకు పైగానే అప్లికేషన్లు
- గతేడాదితో పోలిస్తే 4.2 లక్షలు అధికం
- గడువు తేదీ ఈనెల 16 వరకు పొడిగింపు



న్యూఢిల్లీ : దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ప్రతి యేటా నిర్వహించే నీట్ పరీక్షకు దరఖాస్తులు ఈసారి వెల్లువలా వచ్చిపడుతున్నాయి. 25 లక్షలకు పైగా అప్లికేషన్లు వచ్చి చేరాయి. ఇది గతేడాదితో పోలిస్తే 4.2 లక్షలు అధికం కావటం గమనార్హం. నీట్ యూజీ 2024 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మార్చ్ 16 వరకూ పొడిగిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయం తీసుకున్నది. దీంతో ఇప్పటి వరకు నీట్ 2024కు దరఖాస్తు చేయలేనివారికి మరో అద్భుత అవకాశం లభించినట్టయ్యింది. షెడ్యూల్ ప్రకారం గడువు ఈనెల 9తోనే ముగియాల్సి ఉన్నది. అయితే, దేశవ్యాప్తంగా వచ్చిన అభ్యర్థనల మేరకు మరో వారం దరఖాస్తులకు గడువును పొడిగించారు.ఎన్‌టీఏ ప్రతియేటా నీట్ పరీక్ష నిర్వహిస్తుంది. నీట్ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశం ఉంటుంది. దేశవ్యాప్తంగా మే 5వ తేదీన నీట్ యూజీ 2024 పరీక్ష జరగనున్నది. ఈ పరీక్షపై ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నీట్ పరీక్ష మొత్తం 13 భాషల్లో నిర్వహిస్తున్నారు. నీట్ పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలో జరిగే పరీక్ష. మే 5 వతేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ పరీక్ష ఉంటుంది. ఫలితాలు జూన్ 14న వెల్లడిస్తారు. అభ్యర్థుల వయస్సు 17 ఏండ్లు మించి ఉండాలి. గరిష్టంగా ఎంతైనా ఉండవచ్చు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ, బయో టెక్నాలజీ సైన్స్‌లో ఇంటర్ లేదా సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి.

ఉద్యోగ నియామకాల్లో మహిళలకు పెద్దపీట

- మూడు నెలల్లో 28,942 ఉద్యోగాలు
- మహిళలకు దక్కినవి 13,571
- మొత్తంలో 47 శాతం వాటా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో మహిళలు ప్రభంజనం సృష్టించారు. మూడు నెలల్లో పోలీస్, సోషల్ వెల్ఫేర్, స్టాఫ్ నర్స్ నుంచి మొదలుకుని టీఎస్‌పీఎస్సీ వరకు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 28,942 ఉద్యోగాలను భర్తీ చేశారు. 47 శాతం సగటుతో 13,571 ఉద్యోగాలను మహిళలు సొంతం చేసుకున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చట్టబద్దంగా రావాల్సిన 33 శాతం కంటె అధికంగా 13 శాతం వాటాను దక్కించుకున్నారు.

బీఆర్ఎస్ సర్కార్ హయాంలో చిన్న చిన్న కారణాలతో ఆగిపోయిన దాదాపు 28 వేలకు పైగా ఉద్యోగాలు మూడు నెలల్లో పట్టాలెక్కాయి. సాంకేతిక, న్యాయ, ఇతర చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం చూపెట్టి కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. విభాగాల వారీగా ఉద్యోగ నియామక పత్రాలను మూకుమ్మడిగా అందించి కొత్త సాంప్రదాయానికి తెరతీసింది. జీవో నెంబర్ 3 ప్రకారం ఇప్పటి వరకు జరిగిన నియామకాల్లో మహిళలకు అన్యాయం జరుగుతోందనే వాదనను పటాపంచలు చేస్తూ కోటాకు మించి వారికి అవకాశాలు దక్కాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చట్టబద్దంగా రావాల్సిన 33 శాతం కంటె అధికంగా 13 శాతం వాటాను సొంతం చేసుకున్నారు. మొత్తం నియామకాల్లో 53 శాతం ఉద్యోగాలకు పురుషులు


(ఫైల్)

ఎంపికైతే, 47 శాతం ఉద్యోగాలను మహిళలు దక్కించుకున్నారు.

గతంలో ఎన్నడూ లేని విదంగా ప్రభుత్వ ఉద్యోగాలకు మహిళలు ఎంపికయ్యారు. నియామకాల్లో రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలో హైకోర్టు, సుప్రింకోర్టు సూచనల మేరకు గత ప్రభుత్వం 2022లో 7,593 మెమో జారీ చేసింది. అందులో ఉన్న నిబంధనలతోనే కొత్త ప్రభుత్వం జీవో నెం.3 జారీ చేసింది. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలో రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలో ఉన్నగందరగోళానికి తెరపడింది. ఓవరాల్‌గా జరిగిన ఎంపికలను చూస్తే మహిళలకు అన్యాయం జరగలేదని నియామక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

నియామకాలు వేగవంతం

గత ప్రభుత్వ హయాంలో పేపర్ల లీకేజీలు, రిజర్వేషన్ల వివాదాలు, ఫలితాల నిలిపివేతలు, కోర్టు కేసులు నిరుద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. కొత్త ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు నియామక ప్రక్రియను పరుగులు పెట్టించింది. నిరుద్యోగుల నమ్మకం కోల్పోయిన టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసింది.

గత పాలకవర్గాన్ని తప్పించి కొత్త ఛైర్మన్‌ను, బోర్డు సభ్యులను నియమించింది. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి యూపీఎస్‌సీ ఛైర్మన్‌ను కలిసి జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. వాటి విధి విధానాలకు అనుగుణంగానే భవిష్యత్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టనున్నట్టు సమచారం. ఉద్యోగ నియామకాలతో పాటు జాబ్ క్యాలెండర్లు అమలు చేసేందుకు సర్కార్ ప్రయత్నాలు మొదలు పెట్టింది.

కేటగిరీల వారిగా నియామకాలు

సీ.నెం	కేటగిరి	పురుషులు	మహిళలు	మొత్తం
1).	పోలీస్ కానిస్టేబుళ్లు	10,875	2,569	13,444
2).	స్టాఫ్ నర్సులు	823	6,133	6,956
3).	సోషల్ వెల్ఫేర్, జేఎల్ఎస్	808	1,189	1,997
4).	టీఎస్‌పీఎస్సీ	2,865	3,680	6,545
	మొత్తం	15,371	13,571	28,942

ప్రభుత్వ ఒత్తిడే కారణం



●అరచేతిలో సమాచారం ఉన్నా దాచిపెడుతోంది ●అబద్ధాలతో తప్పుదారి పట్టిస్తోంది

●ఈబీ వివరాల వెల్లడిపై ఎస్‌బీఐ కుంటిసాకులు ●నేడు సుప్రీంకోర్టులో విచారణ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని అతి పెద్ద బ్యాంక్ అయిన ఎస్‌బీఐలో ఇప్పుడు కార్యకలాపాలన్నీ డిజిటల్ పద్ధతిలోనే జరిగిపోతున్నాయి. మీకు ఏదైనా రికార్డో లేదా సమాచారమో కావాలంటే కేవలం ఒకే ఒక 'క్లిక్'తో అది మీ సొంతం అవుతుంది. అంటే సమాచారమంతా అరచేతిలోనే ఉంటుందన్న మాట. డిజిటలీకరణ యుగంలో ఇది సర్వసాధారణమే. ఇదంతా ప్రజలకు తెలిసిన విషయమే. కానీ న్యాయస్థానాన్ని, ప్రజలను పచ్చి అబద్ధాలతో ఎస్‌బీఐ మోసం చేస్తోంది. తాను విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించేందుకు మీనమేషాలు లెక్కిస్తోంది. అందుకు చాలా సమయం పడుతుందంటూ నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ఎవరి ఒత్తిడి కారణంగా ఎస్‌బీఐ ఇలా అబద్ధాలు చెబుతోంది అనేదే ఇక్కడ ప్రశ్న. ఈ వ్యవహారమంతా చూస్తుంటే 'ప్రధానమంత్రి విరాళాలను గోప్యంగా ఉంచే పథకం'లా ఎస్‌బీఐ పని చేస్తున్నట్లు కన్పిస్తోంది. ఎన్నికల బాండ్లను ఎవరు కొనుగోలు చేశారు? ఏ రాజకీయ పార్టీకి దానిని విరాళంగా అందజేశారు? అనే విషయాలను తెలుసుకోవాలని జాతి యావత్తూ ఎదురు చూస్తోంది. అయితే ఈ సమాచారం పొందడం అంత సులభమేమీ కాదని ఎస్‌బీఐ చెబుతోంది. అందుకు చాలా సమయం పడుతుందని కూడా అంటోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాతే ఆ సమాచారాన్ని బహిర్గతం చేయాలని ఆ బ్యాంక్ నిర్ణయించుకున్నట్లు కన్పిస్తోంది.

నేడు విచారణ

ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించేందుకు మరింత గడువు కావాలని కోరుతూ ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో దరఖాస్తు సమర్పించింది. దీనిని వ్యతిరేకిస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), కామన్‌కాజ్ అనే సంస్థలు న్యాయస్థానంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. ఎస్‌బీఐ దరఖాస్తు, కోర్టు ధిక్కరణ పిటిషన్ సోమవారం సుప్రీంలో విచారణకు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఎన్నికల బాండ్ పైన ఓ యూనిక్ సీరియల్ నెంబరు ఉంటుందని, దాని సాయంతో సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చునని ఏడీఆర్, కామన్‌కాజ్ చెబుతున్నాయి. ఎన్నికల బాండును ఎవరు కొనుగోలు చేశారు ? దానిని ఏ రాజకీయ పార్టీ సొమ్ము రూపంలో మార్చుకుంది ? అనే విషయాలను తెలుసుకోవడం చాలా తేలికైన పని అని ఈ సంస్థలు వాదిస్తున్నాయి. ఎస్‌బీఐ అధికారులు చేయాల్సిందల్లా బ్యాంక్ డేటాబేస్ నుండి అవసరమైన సమాచారాన్ని తీసుకోవడమే. కానీ బ్యాంక్ ఉన్నతోద్యోగులు మాత్రం అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారు. దీని వెనుక ఎవరి ఒత్తిడి ఉన్నదో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అది బహిరంగ రహస్యమే.

సుప్రీంకోర్టు ఏమంది?

ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎన్నికల బాండ్ల పథకాన్ని ముక్తకంఠంతో తిరస్కరించింది. దానిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. రాజకీయ పార్టీలకు ఎక్కడి నుండి నిధులు అందుతున్నాయో తెలుసుకునే హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు ఉన్నదని స్పష్టం చేసింది. 'రాజకీయ పార్టీలకు ఎవరు విరాళాలు అందిస్తున్నారో వెల్లడించాల్సిన అవసరం లేదని ఈ పథకం చెబుతోంది. ఇది సమాచారాన్ని తెలుసుకునేందుకు ఓటర్లకు ఉన్న ప్రాథమిక హక్కుపై దాడి చేయడమే అవుతుంది. ఏ తేదీన ఎవరు ఎన్నికల బాండ్ కొనుగోలు చేశారు? ఎంత మొత్తంలో కొనుగోలు చేశారు? ఏ రాజకీయ పార్టీకి ఏ తేదీన దానిని అందజేశారు? దానిని ఆ పార్టీ ఎప్పుడు నగదుగా మార్చుకుంది? వంటి వివరాలు తెలిసే వరకూ సుప్రీంకోర్టు నిర్ణయం పూర్తిగా అమలు జరిగినట్లు కాదు' అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల జారీని నిలిపి వేయాలని ఫిబ్రవరి 15న ఇచ్చిన తీర్పులో ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మూడు వారాల్లో తెలియజేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

సాఫ్ట్‌వేర్ వ్యవస్థ ఉన్నా...

ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమంటే కేంద్ర ప్రభుత్వం 2019లో సుప్రీంకోర్టులో ఓ అఫిడవిట్ దాఖలు చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం చాలా తేలిక అని అందులో తెలిపింది. ఎన్నికల బాండ్ల నిర్వహణ కోసం ఐటీ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి ఎస్‌బీఐ సుమారు రూ.60 లక్షలు ఖర్చు చేసింది. దాని నిర్వహణ కోసం మరో రూ.89 లక్షల వరకూ వెచ్చించింది. ఎన్నికల బాండ్ల సమాచారం కోసం బ్యాంక్ వద్ద మంచి సాఫ్ట్‌వేర్ వ్యవస్థ ఉన్నదన్న విషయం దీనిని బట్టి తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న డాటాబేస్ నుండి అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవడం చాలా చాలా సులభం.

గడువు ముగిసినా...

ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఈ నెల 6వ తేదీతో ముగిసింది. అయితే దానిని రెండు రోజుల ముందే ఎస్‌బీఐ చేతులెత్తేసింది. ఎన్నికల బాండ్ల సమాచారాన్ని గడువు లోగా అందజేయడం కష్టమని, మరో మూడు నెలల సమయం కావాలని కోరుతూ న్యాయస్థానంలో ఓ అఫిడవిట్ దాఖలు చేసింది. అంటే జూన్ 30 వరకూ సమయం కోరింది. అప్పటికి దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయిపోతుంది.

ప్రభుత్వ ఆదేశాల ఫలితమే

నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆదేశాల కారణంగానే ఎస్‌బీఐ పనిచేస్తోందన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఎన్నికల బాండ్ల ద్వారా తనకు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేసిన వారి వివరాలు ప్రజలకు తెలియకూడదని ఆ పార్టీ భావిస్తోంది. రహస్య విరాళం ఇచ్చిన వ్యక్తి అందుకు ప్రతిఫలంగా ఏం పొందాడో ప్రజలు తెలుసుకోవడం కూడా కమలదళానికి ఇష్టం లేదు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయంపై చర్చ జరగడం బీజేపీకి సుతరామూ నచ్చడం లేదు. అందుకే ఆ పార్టీ ఎస్‌బీఐపై ఒత్తిడి తెచ్చి కాలయాపనకు ప్రయత్నిస్తోంది.

బ్యాంక్ వాదన పేలవం

ఎన్నికల బాండ్ కొనుగోలుదారుకు సంబంధించిన సమాచారం బ్యాంక్ వద్ద ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుందని, ఏ ప్రభుత్వ సంస్థ అయినా ఆ సమాచారాన్ని కోరితే దానిని వెంటనే అందజేస్తుందని ఎన్నికల బాండ్ల మాన్యువల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. వివరాలు బహిర్గతం చేయకుండా అడ్డుకోవడానికి ఎస్‌బీఐ చూపుతున్న కారణాలు చాలా పేలవంగా ఉన్నాయని ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ చెప్పారు. ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టినప్పుడు ఆయన ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా పనిచేశారు. ఏదేమైనా ఒక విషయం మాత్రం నిజం. తన పార్టీకి విరాళాలు అందించిన కార్పొరేట్ దాతల గురించి ప్రజలకు తెలియజేయడానికి ప్రధాని మోడీ భయపడుతున్నారు.

ఏడీఆర్, కామన్‌కాజ్ వాదన ఏమిటి?

ఎస్‌బీఐపై ఏడీఆర్, కామన్‌కాజ్ సంస్థలు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో పలు అంశాలను లేవనెత్తాయి. ఎన్నికల బాండ్ కొనుగోలు చేసిన ప్రతి వ్యక్తికి సంబంధించిన కేవైసీ బ్యాంక్ వద్ద ఉంటుంది. అంటే బాండ్లను కొనుగోలు చేసిన వారి సమాచారం బ్యాంక్‌కు అందుబాటులోనే ఉంటుంది. అదీకాక ప్రతి బాండ్‌పై యూనిక్ సీరియల్ నెంబర్ ఉంటుంది. బాండును ఎవరు కొనుగోలు చేశారు? ఏ రాజకీయ పార్టీ నగదుగా మార్చుకున్నది? అనే సమాచారం ఈ నెంబరు ద్వారా ఇట్టే తెలిసిపోతుంది. సీరియల్ నెంబర్లను సరిపోల్చుకుంటే చాలు. ఎన్నికల బాండును ఎవరు కొన్నారు? ఎంత మొత్తంలో కొన్నారు? ఏ పార్టీ కోసం కొనుగోలు చేశారు? అనే విషయాలు తేలికగా తెలుస్తాయి.

'రిపోర్టర్స్ కలెక్టివ్' ఏం చెప్పిందంటే...

ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం కోరినప్పుడు ఎస్‌బీఐ దానిని 48 గంటల్లోనే అందజేసిందని, దీనిని రుజువు చేసేందుకు అనేక ఆధారాలు ఉన్నాయని 'రిపోర్టర్స్ కలెక్టివ్' సంస్థ తెలిపింది. ఎన్నికల బాండ్లను సొమ్ము చేసుకునే గడువు పూర్తయిన వెంటనే ఎస్‌బీఐ అత్యంత 'విశ్వాసం'తో ఆ వివరాలను ఆర్థిక మంత్రిత్వ శాఖకు సమర్పించింది. ఎన్నికల బాండ్ల విక్రయం, వాటిని రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకోవడంపై ఎస్‌బీఐ ఆడిట్ ట్రయల్ కూడా నిర్వహించిందని 'రిపోర్టర్స్ కలెక్టివ్' తెలిపింది.

ఎస్‌బీఐ వాదన ఇలా...

ఇక ఎస్‌బీఐ వాదన మరోలా ఉంది. గోప్యత పాటించడానికి ఎన్నికల బాండ్ల అమ్మకాలు, వాటి విత్‌డ్రాయల్స్ సమాచా రాన్ని విడివిడిగా నిర్వహించా మని బ్యాంక్ తెలిపింది. 2019 నుండి 22,217 బాండ్లను జారీ చేశామని, వాటిలో కొన్నింటిని రాజకీయ పార్టీలు నగదు రూపంలో మార్చుకున్నాయని అంటూ ఎవరు కొనుగోలు చేశారు? ఏ పార్టీ నగదుగా మార్చుకుంది? అనే విషయాలను సరిపోల్చడానికి అనేక నెలల సమయం పడుతుందని అంటోంది. అయితే నగదుగా మార్చుకోవడానికి ఎన్నికల బాండును బ్యాంకులో సమర్పించగానే ఆ బాండును ఎవరు, ఏ పార్టీ కోసం కొనుగోలు చేశారో ఎస్‌బీఐకి తెలిసిపోతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గతంలోనే చెప్పింది.

తన గౌరవం కాపాడుకోవడం సుప్రీంకోర్టు బాధ్యత

●ఎవరినో రక్షించడానికి ఎస్‌బీఐ తాపత్రయం :

ఎన్నికల బాండ్ల వివాదంపై కపిల్ సిబాల్

న్యూఢిల్లీ : తన గౌరవం కాపాడుకోవడం సుప్రీంకోర్టు బాధ్యత అనిప్రముఖ న్యాయవాది, రాజ్యసభ సభ్యులు కపిల్ సిబాల్ పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించానికి జూన్ 30 వరకూ గడువు పొడిగించాలని సుప్రీంకోర్టులో ఎస్‌బీఐ పిటీషన్‌పై ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ సిబాల్ మాట్లాడుతూ ఎస్‌బీఐ అభ్యర్థనను అంగీకరించడం 'అంత సులభం కాదు' అని అన్నారు. మోడీ గొప్పగా చేప్పే డిజిటల్ కాలంలో కూడా ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించడానికి అనేక వారాల గడువు కోరడం వెనుక 'ఎవరినో రక్షించే ఉద్దేశ్యం ఎస్‌బిఐకి స్పష్టంగా ఉంది' అని కపిల్ సిబాల్ విమర్శించారు. ఇలాంటి ఉద్దేశం లేకపోతే ఏప్రిల్, మేలో ఎన్నికలు జరగనున్నప్పుడు ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించానికి జూన్ 30 వరకూ ఎస్‌బీఐ సమయం కోరదని అన్నారు. ఏప్రిల్-మేలో ఎన్నికలు జరుగుతాయనే విషయం ఎస్‌బీఐకి తెలుసునని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలోనే ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేస్తే.. ఈ అంశమే రాబోయే ఎన్నికల్లో పెద్ద చర్చ అవుతుందనే విషయం కూడా ఎస్‌బీఐకి తెలుసునని కపిల్‌సిబాల్ అన్నారు. 'లోక్‌సభ ఎన్నికలు ముగిసేలోపు ఎన్నికల బాండ్ల వివరాలను బహిరంగ పర్చకూడదని ప్రసుత్తం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కోరుకుంటుంది. ఎస్‌బీఐ పిటీషన్ వేయడానికి కూడా అదే కారణం' అని కపిల్ సిబాల్ విమర్శించారు. కోర్టు ధిక్కారణ విషయాన్ని కోర్టులకే వదలివేయాలన్నారు. 'ఇది కోర్టు గౌరవంపై ప్రభావం చూపుతుంది. కోర్టు గౌరవాన్ని రక్షించుకోవాల్సిన బాధత్య కోర్టులకే ఉంది. ఎస్‌బీఐ ఇచ్చిన విచిత్రమైన వివరణను సుప్రీంకోర్టు అంగీకరిస్తే అది నవ్వులపాలవుతుంది. కాబట్టి తన గౌరవాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత సుప్రీంకోర్టుకే ఉంది' అని కపిల్ సిబాల్ తెలిపారు.

ఢిల్లీ ఘటనకు లిబరేషన్ ఖండన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఢిల్లీలోని ఇందర్‌లోక్ ప్రాంతంలో శుక్రవారం నమాజ్ చేస్తున్న ముస్లిం యువకులను పోలీసు అధికారి కాలితో తన్నటం అత్యంత హేయమైన చర్య అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దురహంకారంగా ప్రవర్తించిన పోలిస్ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మసీదు బయట నమాజ్ చేయడం సాధారణ విషయమేనని తెలిపారు. ఈ కారణంతో ముస్లిం యువకులను ఓ పోలీసు అధికారి కాలితో తన్ని లేపి అవమానకరంగా వ్యవహరించాడని పేర్కొన్నారు. మతోన్మాద బీజేపీ పాలనలో పోలిస్ యంత్రాంగంలో నిండిన విద్వేషానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఏ మతానికి చెందిన వారైనా పండుగలు, ఉత్సవాలు, ప్రత్యేక సందర్భాల్లో రోడ్లపై గుమిగూడటం సహజమని పేర్కొన్నారు. కనీస మానవత్వం ఉన్న వారు ఎవరూ అలా చేయరని తెలిపారు. విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకునే దుర్బుద్ధి ఇలాంటి చర్యలకు ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు.

ఇంటిపోరు ఇంతింతకాదయా



(మొదటి పేజీ తరువాయి)

బయటిపోరు కంటే ఇంటిపోరే ఎక్కువైంది. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీశ్‌రెడ్డి ఏకంగా బీజేపీకి ఆదివారం రాజీనామా చేశాడు. ఆయన అసంతృప్తిని పసిగట్టిన రాష్ట్ర నాయకత్వం సంప్రదింపులు జరిపేందుకు యత్నించగా ఆయన వారికి అందుబాటులో లేకుండా పోయారు. చివరకు పార్టీకే రాజీనామా చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశాడు. కూన కుతకుతలాడుతున్నాడు. ఆయన గనుక పార్టీని వీడితే బీజేపీ ఓటుబ్యాంకుకు భారీ గండి పడే అవకాశాలున్నాయి. దీనినిబట్టే తెలంగాణ ఉద్యమ సమయంలో డక్కీలుమొక్కీలు తిని నేతగా ఎదిగిన ఈటల రాజేందర్‌కు బీజేపీలో చేరిన తర్వాత ఏదీ కలిసిరావడం లేదని అర్థమవుతున్నది. బయటి పార్టీల వాళ్ల కంటే సొంత పార్టీలోని నేతలకే ఆయన ఎక్కువగా టార్గెట్ అవుతున్నారు. బీఆర్ఎస్ తాజా ఎంపీ రంజిత్‌రెడ్డి అదే పార్టీ నుంచి మొదట మల్కాజిగిరి నుంచి పోటీచేయాలని భావించారు. కానీ, అక్కడ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ బరిలో దిగటంతో ఆయన వెనక్కి తగ్గారు. పొలిటిరంగంలోని స్నేహబంధంతో ఈటల కోసం రంజిత్‌రెడ్డి సీటును త్యాగం చేశారనే చర్చ రాజకీయాల్లో జోరుగా నడుస్తున్నది. ఇలా బయటి పార్టీ వాళ్లు ఏదోరకంగా సహకరిస్తుంటే బీజేపీలోని కీలక నేతలే ఈటల ఓటమి కోసం పావులు కదుపుతున్నట్టు, ఆ నేతల నుంచే ఈటలకు మరోమారు ఓటమి గండం ఉండనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. సీటు ఆశించి భంగపడిన నేతలంతా ఒక్కటై ఈటలకు వ్యతిరేకంగా గ్రూపుకట్టారు. ఆయన ఓటమి కోసం కొందరు ముఖ్యనేతలు తెరవెనుక పావులు కదుపుతుండగా...తెర ముందు కూనం శ్రీశైలంగౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్ ముఖ్యంగా కనిపిస్తున్నారు.

మురళీధర్‌రావు వెనుకుండి చక్రం తిప్పుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈటల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షలు పన్నాల హరీశ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, తదితరులున్నారు. వీరంతా ఈటలకు సహకరించే పరిస్థితి లేదు. ఈటల మాత్రం పార్టీ హార్డ్‌కోర్ శ్రేణులను నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు లక్షలకుపైగా ఉన్న ఉత్తర భారతదేశం ఓటర్లు తనకు అండగా నిలుస్తారనే ధీమాతో ఉన్నారు. ఇది ఎంత వరకు సాధ్యం అవుతుందనే దాన్ని వేచిచూడాల్సిందే.



సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-సూర్యాపేట

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఏడవ వార్డులో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ కరువైందని, వారి స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడాలని తెలిపారు. రోజురోజుకు మహిళలు, విద్యార్థులపై లైంగికవేధింపులు, హత్యలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1908 న్యూయార్క్ నగర వీధుల్లో తమ హక్కుల సాధన కోసం వేలాదిమంది మహిళలు చేసిన వీరోచిత పోరాట ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్గురి జ్యోతి, నారాయనమ్మ, సృజన పద్మ రుద్రమ్మ గంగమ్మ సుజాత, రోజమ్మ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర కోట్లమంది రోడ్డున పడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగితే మోడీ హయాంలో మూసివేతలు చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ చెబుతున్న మాటలెలా ఉన్నా ఎంఎస్ఎంఈకి బీజేపీ సరికొత్త నిర్వచనం ఇచ్చిందని ఎద్దేవా చేశారు. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్‌కు మినిమం సపోర్ట్ అని కాషాయ పాలకులు ఎంఎస్ఎంఈని నిర్వచిస్తున్నారని ఎద్దేవా చేశారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం నోట్ల ఉపసంహరణ, లోపభూయిష్ట జీఎస్టీ, లాక్ డౌన్ కారణంగా చిన్న పరిశ్రములు చితికిపోయిన మాట వాస్తవం కాదా..? అని మల్లికార్జున్ ఖర్గే నిలదీశారు.

ఎంఎస్ఎంఈల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య ఈ పదేండ్లలో ఎందుకు మారలేదని ప్రశ్నించారు. 2013-14 కాంగ్రెస్ హయాంలో ఎంఎస్ఎంఈల్లో 11.14 కోట్ల మంది ఉద్యోగులు ఉపాధి పొందగా 2022-23 (మోడీ ప్రభుత్వ హయాం)లో ఉద్యోగుల సంఖ్య 11.1 కోట్లుగా ఉందని గుర్తు చేశారు. 2020 మే 12న ప్రధాని నరేంద్ర మోడీ రూ. 20 లక్షల కోట్లతో ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఆ ప్యాకేజీ అతీగతీ లేదని మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. సబార్డినేట్ రుణానికి (జూన్ 2020-మార్చి 2022) క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ కోసం రూ. 20,000 కోట్లు కేటాయిస్తే, కేవలం రూ.239.19 కోట్లు మాత్రమే విడుదల చేయడం సరైనదా? 1.2 శాతం కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ప్రచారం చేసిన ప్యాకేజీ ఉపయోగించలేదని విమర్శించారు. సెల్ఫ్ రిలయన్స్ ఇండియా (ఎస్ఆర్ఐ) ఫండ్ తో ఎంఎస్ఎంఈల కోసం రూ.50,000 కోట్ల ఈక్విటీ ఇన్ఫ్యూషన్‌లో కేవలం 140 ఎంఎస్ఎంఈల కోసం రూ.3,002.57 కోట్లు మాత్రమే ఉపయోగించారనేది నిజం కాదా? మిగిలిన నిధులు ఏమయ్యాయి?" అని ప్రశ్నించారు.

"ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి ముద్ర పథకం గురించి మోడీ ప్రభుత్వం సుత్తి మాట్లాడుతోంది. గరిష్ట పరిమితి రూ.10 లక్షలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సొంత అంచనాల ప్రకారం పీఎం ముద్ర కింద రుణాల సగటు పరిమాణం కేవలం రూ. 52 వేల మాత్రమేనన్నది వాస్తవం కాదా? మోడీ ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో పనిచేస్తున్న కోట్లాది మంది ప్రజల కలలు, ఆకాంక్షలను నాశనం చేయడానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ఎందుకంటే వారు పెద్ద కుటిల సంస్థలకు లొంగిపోతారు" అని విమర్శించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికై సీఎం స్పష్టమైన విధానం ప్రకటించాలి

హామీలు ఇవ్వడం కాదు.. నిధులు కేటాయించి, అభివృద్ధి పరచాలి

●ఆచరణాత్మక విధానం కావాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికై గత ముఖ్యమంత్రులు చేసిందేమీ లేదని, రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా అభివృద్ధికి స్పష్టమైన విధానం ప్రకటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఉద్ఘాటించారు. నిధులు కేటాయించి, అభివృద్ధి పరచాలని, హామీలు ఇవ్వడం కాదు.. ఆచరణాత్మక విధానం కావాలని స్పష్టంచేశారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాంలో పోతినేని మాట్లాడారు. జిల్లాకు మొదటి సారిగా వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీగా స్వాగతం చెబుతున్నామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీలు ఇవ్వాలని, ఆచరణాత్మకమైన పాత్ర పోషించేలా నిధులు కేటాయించాలన్నారు. భద్రాచలం అభివృద్ధికి గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలులో నిర్లక్ష్యం వహించారని ఒక్క రూపాయి కూడా వెచ్చించింది లేదని, అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసే పనులే చెప్పాలని, చెప్పినవి కచ్చితంగా అమలు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినప్పటికీ, సరైన సౌకర్యాలు, సిబ్బంది, సంబంధిత వైద్య పరికరాలు లేవని, దాంతో సామాన్య ప్రజలు అనేక సమస్యలు గురవుతున్నారన్నారు.

వైద్య పరికరాలు, డాక్టర్ల సంఖ్యను పెంచి, సిబ్బందిని కూడా సమకూర్చి అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూల్లో పరిశ్రమల్లో కనీస వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉందని, షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న ఉద్యోగులకు, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, విలేకరులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని నేటికి కేటాయించలేదని వెంటనే విలేకరులకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు.

ఏపీలో కలిపిన 5 పంచాయతీలను భద్రాచంలో కలపాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐఏఎం ఏర్పాటు కోసం కృషి చేయాలని అన్నారు. జిల్లాకు ప్రాజెక్టుల పేరుతో పెద్దఎత్తున నష్టం జరిగిందని, తగిన నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు అభివృద్ధి పరచాలని అన్నారు. జిల్లాలో ఉన్న 84 వేల మంది పొడు సాగుదారులు.. రెండు లక్షల 90 వేల పైచిలుకు ఎకరాలకు దరఖాస్తు చేసుకోగా, 50వేల మందికి ఒక లక్ష యాభై వేల ఎకరాలు భూమికి పట్టాలు ఇచ్చారని మిగతా వాటికి హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. తునికాకు సేకరణలో రాష్ట్ర మొత్తం 119 కేంద్రాలు ఉంటే కేవలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 27 కేంద్రాలు ఉన్నాయని, తునికాకు సేకరణ పనులు



ప్రారంభించాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు కలిపే బైపాస్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, ప్రజల ప్రాణాలని కాపాడాలని అన్నారు. సీతారాం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి రైతులందరికీ నీరు అందేలా చేయాలని కోరారు. హామీలు అమలు నిర్దిష్ట సమయంలో అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల పార్టీ అధ్వర్యంలో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు.

సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి, లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

ఒక జీవిత కాలపు యుద్ధానికి..



అడవిలో పూచిన
మోదుగు పూవు లాంటి అతను
కలల పొరలలోని చేదు వాస్తవాలను
ఆకళించుచుకున్న వైదుష్యం లాంటి అతను
నెత్తురు సంతకం చేసిన
కళను తను ఎత్తి పట్టిన కత్తితో
ఆవాహన చేసుకున్న అతను
అదిగో ఒక నిశిరాత్రి
ఆ మూల మలుపు దగ్గరే
ఆ అరణ్యం కొండచిలువ
నోటిలోకే అతిసామాన్యంగా దూరిపోయాడు.
ఆ క్షణం అతని మొహంలో
మెరిసిన ఉదయాలను నేనసలు మరచి పోలేను
అట్లా ఎర్రటి సంధ్యనంతా
దేహంనిండా పులుముకొన్న అతను
తిరిగివస్తాడని పొగడపూల
దారినిండా అలంకరణ చేశాను
చెల్లా చెదురై గాలిలో ఎగురుతున్న అక్షరాలను
పిల్లంగ్రోవిలో ఊదుతున్నాను
అదృశ్యంగా జ్వలించే అగ్నిని
కల కన్నుతో ఆవాహన
చేసుకున్నాను ఆకాశాన్ని భూమిని
కలిపే గాలితరంగాన్నై
నేనొక స్వాగతం కల కంటున్నాను.
కానీ క్రమంగా నా కర్థం అయింది
ఇది తెల్లారని రాత్రి
ఇది ఉపశమించని దుఃఖం
అతని పునరాగమనం నాకో సుదీర్ఘ స్వప్నం
ఎడ తెరిపి లేని ఈ జీవిత కాలపు
యుద్ధానికి నన్ను
నేను సంకేతం చేసుకుంటాను.

డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు,
9676096614

అతడు అనితరుడే

"శ్రీ శ్రీ కవితారాధనలో మాగి, మార్క్సిస్టు భావావేశంతో సాగి, అలుపెరుగని అధ్యయనం, అద్వితీయమైన అవగాహన, అమోఘమైన లోకానుభవ సారాన్ని అక్షరాలుగా ఆవిష్కరించిన కవి మువ్వా శ్రీనివాసరావు. ప్రగతిశీల భావావేశం మానవీయతకు మకుటాయమానంగా ఓ తాత్త్విక దృక్పథంతో కాలం కదిపిన కవి క్రాంతి శ్రీనివాసరావు" అని తేల్చి చెప్పారు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి. వ్యక్తిగతంగా మువ్వా గారితో పరిచయం ఉన్న వారెవరూ కాదనలేని వాస్తవం ఇది. అదే విషయాన్ని చెబుతూ డా॥ రాధేయ "మార్క్సిజం వెలుగులో సమాజాన్ని చూడటం నేర్చుకున్న కవిగా, వర్తమాన కవిత్వ లాంతరు"గా పేర్కొన్నారు.

"రెండు విసుర్రాళ్ళ మధ్య
పెసర గింజల్లా పగిలిపోతుంటాం
విధిలేక కిందరాయి పక్కనే వొరిగిపోతుంటాం
కాదంటే పిండి పిండిగా రాలిపోతుంటాం" అని మధ్యతరగతి జీవితాల గురించి రాయగలగాలంటే అది మార్క్సిస్టు దృక్కోణంతో చూసి అర్థం చేసుకున్నప్పుడే సాధ్యమవుతుంది. కనుకనే పై పంక్తులను ఈ గ్రంథంలో ఎక్కువ మంది ఉటంకించారు.

మువ్వా శ్రీనివాసరావు నిజంగా అనితరుడు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆధునిక వచన కవి కవిత్వంపై ఇన్ని వ్యాసాలు రాయలేదు. మువ్వా శ్రీనివాసరావు కవిత్వాన్ని 366 మంది 366 కోణాల్లో విశ్లేషించారు. అసాధ్యమైన బృహద్వ్యాస సంకలనాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తిగా క్రాంతి శ్రీనివాసరావు అనితరుడే. వజ్రాయుధం కవి డా.ఆవంత్స సోమసుందర్‌కు అంకితం ఇచ్చిన ఈ గ్రంథంలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సినారె, తన గురువు పూర్ణచంద్రరావుల అక్షరాశీరదాలతో ప్రారంభమై ఎందరో ప్రముఖ సాహితీవేత్తలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులు, నవయువకులు తమ విశ్లేషణలతో మువ్వా శ్రీనివాసరావు అంతరంగాన్ని పట్టి చూపారు.

ఈ గ్రంథాన్ని ఒక కవితాంతరంగ విశ్లేషణలుగా చూడటం ఒక అంశం. దాదాపు తెలుగు నేలంతా ఒక మూడు, నాలుగు నెలలపాటు మువ్వా సాహిత్యాన్ని చదివి అవపోసన పట్టింది. ఆ సాహిత్యాన్ని విశ్లేషిస్తూ ఒక పరంపరగా వ్యాసాలు వెలుగులోకి వచ్చాయి. ఇంత వరకు చూస్తే ఇది కేవలం మువ్వా శ్రీనివాసరావు వ్యక్తిగత ఇమేజ్ పెంచేదిగానే కనబడుతుంది.

అంతర్లీనంగా ఉన్న మరో అంశాన్ని గురించి ఆలోచిస్తే ఈ గ్రంథం ఆయనకు ఎంత ఉపయోగపడిందో కొత్త విమర్శకులు తయారు కావడానికి అంతే ఉపయోగపడింది. అధ్యయనానుభవం ... సృజనానుభవం.. పరిశీలనానుభవం... పరిశోధనానుభవం గల సాహితీవేత్తల మొదలు కొత్తగా రాస్తున్న వారు సైతం చక్కని విశ్లేషణ చేశారు. అలా 366 మంది సాహిత్య విమర్శా వ్యాసాలతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. కాబట్టి ఇది 'unorganised critics workshop'. ఎందుకంటే అనితరుడులో విశ్లేషణలు రాసిన 366 మందిలోనూ వీరికి ప్రత్యక్ష పరిచయం ఉన్న వారు కొద్దిమందే ఉండి ఉంటారు. కానీ, "కవిత్వం ద్వారా ఆ కవిని దర్శించ గలగాలి" అన్నట్టు వారంతా సమాంతర ఛాయల్లో, సిక్స్ ఎలిమెంట్ లోనో, వాక్యాంతంలోనో, వైరాయణంలోనో ఈ కవి కవితాత్మను దర్శించారు. అందుకే మువ్వా కవిత్వాన్ని వందకు మిక్కిలి కోణాల్లో విశ్లేషించారు. ప్రతి విమర్శకుడి దగ్గరా, ప్రతి గ్రంథాలయంలోనూ ఉండాల్సిన గ్రంథం అనితరుడు.

మహాకవి శ్రీశ్రీ కవిత్వాన్ని అమితంగా ఆరాధించే శ్రీనివాసరావు ఆయన శతజయంతి సందర్భంగా మార్క్సిజం అజేయమని గొంతు విప్పాడు. శ్రీశ్రీ విగ్రహాన్ని ప్రతిష్ఠించటంతోపాటుగా తనను తాను సాహిత్య రంగంలో ప్రతిష్ఠించుకున్నాడు. అన్ని వాదాలను, ధోరణులను, దృక్పథాలను సమన్వయ పరచడం అవసరమని భావించాడు. కనుకనే శ్రీశ్రీ విగ్రహ స్థాపనకు ముందు ఖమ్మం జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాలలో శ్రీశ్రీ సాహిత్య సభలను విద్యార్థులతో నిర్వహించాడు. వేలాదిమంది విద్యార్థులు సభలో భాగమయ్యేట్లు చేశాడు. సభల నిర్వహణకు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులైన సాహితీమూర్తులను ఆహ్వానించి, వాటిని దిగ్విజయంగా జరిపాడు. అనేకమందిని కలిశాడు, అనేకమందితో తానూ కలిసిపోయాడు. నిత్యం చలనంలో ఉండాలన్న గతితార్కిక సూత్రాన్ని తనకే కాదు.. తన కవిత్వానికి అన్వయించాడు. కాబట్టే తాను పుస్తకాలు వేసి ఊరుకోకుండా వాటిని పాఠకుల దగ్గరకు చేర్చేందుకు విభిన్నంగా ప్రయత్నించాడు. అంతే కాదు తల్లిదండ్రులైన మువ్వా పద్మావతి రంగయ్యల పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సాహితీ మూర్తులకు జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తున్నాడు. అంతే కాదు గతేడాది నుంచి తాను అమితంగా ఇష్టపడే ఆవంత్స సోమసుందర్ పేర కూడా పురస్కారాన్ని ప్రకటిస్తున్నారు.

సాక్షాత్తూ అభ్యుదయ సాహిత్య ఉద్యమ రథసారథుల్లో ఒకరైన డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సమాంతర ఛాయలు, సిక్స్ ఎలిమెంట్ చదివి ముగ్ధుడై 'కవితా విపంచి - క్రాంతి గీతాలు' శీర్షికతో ఒక విమర్శా గ్రంథాన్ని అందించారంటే సామాన్యమైన విషయం కాదు. 'భ్రమల్లేని భావుకుడు' శీర్షికలతో సౌభాగ్య 'దృశ్యం @ 576 మెగా పిక్సల్' శీర్షికతో కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, 'అదృశ్య రూపగ్రాహి' శీర్షికతో పులికొండ సుబ్బాచారి విమర్శా గ్రంథాలు రాశారంటే వారికేదో ఊబుసుపోక చేసిన పని కాదు. మంచి కవిత్వం వచ్చినప్పుడు అది విమర్శకులకు పని పెడుతుంది.

మువ్వా సమాంతర ఛాయలు కవితలను కొడవటిగంటి కుటుంబరావుగారి కుమార్తె, ప్రముఖ అనువాదకురాలు ఆర్. శాంతసుందరి 'సమాంతర్ ఛాయే' శీర్షికతో హిందీలోకి అనువదించారు. రామతీర్థ ఆంగ్లంలోకి, ప్రొఫెసర్ సత్యవాణి తమిళంలోకి అనువదించారు. లక్ష్మార్ ఆనంద సమాంతర ఛాయలు, సిక్స్ ఎలిమెంట్లను కన్నడంలోకి తర్జుమా చేశారు.

కవిగా, ఒక బాధ్యత ఎరిగిన బుద్ధిజీవిగా సమకాలీన ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా సాంస్కృతిక రంగంలో పని చేసుకుంటూ ముందుకు వెళ్తున్న కవి ఈ క్రాంతి.


ఈ కవిలో 'చిమ్నీలేని దీపపు వెలుగులు' కనిపిస్తాయి. పేదరికాన్ని, దారిద్ర్యాన్ని చూపబోతాయి. ఈ కవి నేల పడవ మీద నడిచే బతుకులను చూపడం కోసం ప్రయత్నిస్తాడు. ఈ కవి ఎదురుచూపు తూర్పు వెలుతురు కోసం, అదొక ఎడతెగని నిరీక్షణ. కాల యవనిక నిండా ఇతనికి కన్నీటి మరకలు కనిపించాయి. ఆ మరకలను కడిగేందుకు ఏదైనా దొరుకుతుందేమోనని వెతుకుతాడు.

ఇతని కవిత్వంలో గాలి కుంచె అవుతుంది. రవి రంగులేసే కుర్రాడవుతాడు. వెలుగు చీకట్లను కలిపి కుట్టే సంధ్యలు వీరి కవితలు అంటారు కవి, విమర్శలు ఆర్. సీతారాం.

నిజమే కదా కర్ఫ్యూ నీడలో రాజ్యహింసకు బలైన ఎందరో మహాయోధులను నిర్మించుకుంటూనే, తన నాయనమ్మ, అమ్మమ్మల జ్ఞాపకాల నేమరివేతలను, భార్యాభర్తల మధ్య పోటీలో ఎప్పుడూ ఓడిపోయిన వారే గెలుపు ఆనందాన్ని పొందుతారని తీర్మానం చేస్తూనే సమాజంలోని అనేక రుగ్మతలను తన కవిత్వంతో ఎత్తి చూపుతారు. అందుకే ఆయన కవిత్వం చేయని అంశం లేదంటే అతిశయోక్తి కాదు.

ఒక సమస్యను లేదా అంశాన్ని మార్క్సిస్టు దృక్కోణంతో ఎలా చూడవచ్చో అర్థం చేసుకోవాలంటే మువ్వా శ్రీనివాసరావు కవిత్వం కచ్చితంగా చదవాల్సిందే. అదే విషయాన్ని విశ్వవిద్యాలయ ఆచార్యులు తెలిపారు. వారి మార్గనిర్దేశనంలో పరిశోధన చేస్తున్న పరిశోధనలు అదే నిర్ధారించారు. అందుకే "మువ్వా కవిత్వం - సమకాలీన సాహిత్య మేనిఫెస్టో" అన్న డా॥మాటూరి శ్రీనివాస్ చెప్పిన విషయం అక్షరసత్యం.

> అంతర్లీనంగా ఉన్న మరో అంశాన్ని గురించి ఆలోచిస్తే ఈ గ్రంథం ఆయనకు ఎంత ఉపయోగపడిందో విమర్శకులు తయారు కావడానికి అంతే ఉపయోగపడింది. అధ్యయనానుభవం... సృజనానుభవం.. పరిశీలనానుభవం... పరిశోధనానుభవం గల సాహితీవేత్తల మొదలు కొత్తగా రాస్తున్న వారు సైతం చక్కని విశ్లేషణ చేశారు. అలా 366 మంది సాహిత్య విమర్శా వ్యాసాలతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది.





- అనంతోజు మోహన్‌కృష్ణ,
8897765417

ఆలీబాబా అనేక దొంగలు - దేశరాజు కథలు

కథలు ఊహాజనీకం అంటారు కానీ ఈ కథలు ఊహ కాదు నిజం. సమాజాన్ని ప్రశ్నిస్తున్నట్టు, సమాజంలో ఉంటూనే ఎటు పోతున్నావ్? ఒక్కసారి చూసుకో అని చెబుతూనే పక్కదారి పట్టకుండా, వేలు పట్టుకుని నడిపే కథలు. మనకు పాఠాలు నేర్పిన గురువులను ఎంత మంది గుర్తు పెట్టుకున్నాం? ఎంత మంది వారిని గౌరవించుకున్నాం? ఎన్ని మంచి మాటలు చెప్పి ఉంటారు? వాటిని ఎంత మంది పాటించాం? ఇలా ఒక్కటి కాదు చెప్పుకుంటూ పోతే ఎన్నో? దేశరాజు గారు రాసిన కథల గురించి ఇప్పుడు చూద్దాం.


ఇందులోని పదమూడు కథల పెద్దల మాట కూడా పదమూడు భావోద్వేగాలంటే భలే ఉంటుందేమో! చిన్న పిల్లలకు మంచి మార్గనిర్దేశం. కానీ ఈ కాలం పిల్లలది దుందుడుకు వైఖరి, ఒక్క పట్టాన ఏదీ ఒప్పుకోరు?

'కుదుపు' కథలో అందరూ అందరి పిల్లలకు అన్ని ఇస్తున్నారు కానీ మనమే మన పిల్లలకు ఏదీ ఇవ్వడం లేదు? అని బాధపడే తల్లిదండ్రుల కథ. పిల్లలకు సెల్ ఫోన్స్ ఇస్తే ఏం జరుగుతుందో? కళ్ళకి కట్టినట్టు చూపిన కథ. జీవితం సెట్ కావాలంటే ఏదో ఒక "కుదుపు" రావాలని చెప్పిన కథ. కళ్ళ ద్వారా అక్షరాలను చదివి, మెదడు ద్వారా ఆలోచన రేకెత్తి, ఇది నిజమే కదా ఎంతలా మనం ఒక పనిలో కూరుకుపోయామో మనల్ని మనకే గుర్తు చేసిన కథ.

'ఎయిర్ జామ్' కథలో దేశానికి ఎప్పుడైనా కష్టం వస్తే ముందుండేది కమాండోలు. అలాంటి కమాండోలకు సవాలుగా మారిన ఒక హైజాక్ కథ ఇది. కానీ నాకనిపించింది ఏంటంటే? సమస్య వస్తే సిద్ధంగా ఎవరైనా ఉంటారు. కానీ ఆ సమస్య రాకముందే అప్రమత్తంగా ఎందుకు ఉండరో? అర్థం కాదు. కొంత మంది బిగ్ ఆఫీసర్స్ ఏదైనా ఒక నిర్ణయం తీసుకోవడానికి ఎంతో ఆలోచించి కానీ తీసుకోరు. అలాంటి వారికి ఇక్కడ వచ్చిన సమస్యని ఎలా తిప్పికొట్టారు? అనేది చూస్తే ప్రతీ ఒక్కరు ఇంతటి ధైర్య సాహసాలతో ఉండాలని చెప్పిన కథ.

'అంతా మీ కోసం' లో బాగా చదువుకుని, మంచి జాబ్ చేస్తూ ఉన్న సమయంలో వచ్చిన ఆలోచన అతని జీవితాన్ని మార్చేసింది. దానికి తోడు తల్లిదండ్రుల అండ ఉండేసరికి ఇంకా రెచ్చిపోయాడు కానీ పెళ్లంటే మాత్రం చిన్న మెలిక పెట్టాడు. ఎన్ని సంబంధాలు చూపించినా వంకలు పెట్టాడు. చివరకు చేసేది లేక అతని కోరిక తల్లిదండ్రులు ఎలా తీర్చారు అనేది అస్సలు కథ. అదేంటి అనేది మీరు చదివే తెలుసుకోవాలి.

'కాసేపు మనిషి'లో ఎత్తుకు ఎదగడానికి మనం ఎన్నో చేస్తుంటాం. మొదట్లో నీతి, నిజాయితీ అన్న మనమే, ఆ నీతి, నిజాయితీ ఎక్కడా కనపడకపోయేసరికి, మనం వెళ్లే దారి మార్చుకుని చేరాల్సిన చోటికి చేరుకుంటాం. అలా ఎన్నో అడ్డదారులు తొక్కి ఎదిగిన ఒక్కడి కథే ఈ కాసేపు మనిషి. మనం చేసిన తప్పుల నుండి ప్రాయశ్చిత్తము పొందే వాడి కథే ఇది. మన లోంచి మనం మళ్లీ మనిషిగా పుట్టిన క్షణం కొత్తగా ఉండే ఆలోచనలే ఈ కథ.



'అవాంచితం' : ఈ పరుగు లాంటి జీవితంలో పడి మనలోని భావోద్వేగాలను ఎప్పుడో మరచిపోయాం? అలా మర్చిపోయిన భర్తకి భార్య చెప్పే సమాధానమే ఈ కథ. అస్సలు భార్య చెప్పిన సమాధానం ఏంటి? దాని తర్వాత వచ్చిన ఆ పర్యవసానం ఏంటి? అనేది మిగిలిన కథ.

'కవి దుర్భేద్య'లో ఎన్నో ఏళ్ల సుదీర్ఘ కాలం పని చేసి రిటైర్ అయిన తర్వాత, మన ఇంట్లో మన నాన్నకో, అమ్మకో దిక్కు తోచదు ఎందుకంటే? వారు అప్పటి దాకా గడిపిన జీవితం ఒకటి. రిటైర్ అయ్యాక గడిపే జీవితం మరొకటి. వారి జీవితం ఒక రొటీన్ కి ఫిక్స్ అయిపోయి ఉంటుంది. అన్నేళ్ల తర్వాత అంతా తీరిక దొరికేసరికి పక్కా వారిలో లోపాలు కనిపిస్తాయి. ఆ కనిపించిన లోపాలకి వీళ్ళు ప్రతిస్పందిస్తారు. ఇంకా ఎంత సేపు? లేచి టీ ఇవ్వు, లేచి టిఫిన్ చెయ్యి అయ్యి అని అక్కడ ఉన్న వాళ్ళను ఊపిరి సలపకుండా చేస్తారు. అలా మన ఇళ్లలో పెద్ద వారి కథే ఈ కవి దుర్భేద్య

'సహజాసహజం'లో మూడు తరాలు కలిసి జీవించే కథ. అమ్మమ్మ, అమ్మ, కూతురు. మనం సాగించే జీవితంలో మనుషులు తప్ప ఎవ్వరూ ఉండరు. ఒక పక్షి కానీ, జంతువు కానీ, వాటి జీవనం కానీ ఎలా ఉంటాయో? వాటితో సంబంధం లేని వారికి ఏమీ తెలియదు. అలా గడుస్తున్న జీవితాలలోకి అనుకోకుండా వచ్చిన ఒక సంఘటన వారి మనసులను దోచుకుంటుంది. కానీ అక్కడ వారికి వచ్చిన ఒక సమస్యకి వారి మనసులు ఎంత భావోద్వేగానికి ఎలా లోనయ్యాయి? అస్సలు ఆ కథేంటి తెలుసుకోవాలంటే ఈ కథ చదవాల్సిందే.

'ఆలీబాబా అనేక దొంగలు' కథలో అస్సలు పుస్తకం కవర్ పేజీపై ఈ శీర్షిక ఎందుకు పెట్టారో? అప్పుడు అర్థం కాలేదు. కానీ కథ చదివిన తరువాత ఈ పుస్తకానికి ఈ పేరే సరైనది అని అర్థం అయ్యింది. ఎన్నో ఒడిదుడుకులు దాటి వచ్చిన తర్వాత సుఖవంతమైన జీవితం గడపాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. పక్క పక్కన ఉండే ఇరుగుపొరుగు వాళ్ళు కూడా అలానే కలిసిపోయారు. కానీ, కులం పెట్టిన చిచ్చు అప్పటిదాకా ఉన్న సంబంధాలను, వారి మధ్య ఉన్న ఆ సాన్నిహిత్యాన్ని అక్కడ జరిగిన ఒక్క సంఘటన వేరు చేసింది. ఏంటా సంఘటన? అని తెలుసుకోవాలంటే ఈ కథ తప్పకుండా తెలుసుకోవాల్సిందే.

'కథ తల్లి, కూతురు, మధ్యలో ఆమె'లో ప్రతీ ఇంట్లో ఆడపిల్ల కథ, ప్రతీ ఇంట్లో ఉండే అమ్మ కథ, ప్రతీ ఇంట్లో ఉండే అమ్మమ్మ కథ. కాస్త ఓపెన్ గా ఉన్నా కూడా ఇదే నిజం అని మనతో అనిపించే కథ. ఎంత సేపు ఉన్నా ఆడపిల్లలనే అనుకువగా ఉండమని చెప్తారు కానీ వారి కొడుకులు బయట చేసే చిల్లర పనులు వారి కంటికి అస్సలు కనిపించవు. అలా వారి ఇళ్లల్లో, బయట సమాజంలో వారు పోరాడి, పోరాడి విసిగి వేసారిన ప్రతీ అమ్మాయి కథే ఈ కథ.

'బహురూపి'లో ప్రతీ ఒక్కరిలో వారికి తెలియకుండానే ఇంకో మనిషి దాగి ఉంటారు. ఎందుకంటే? వారికి ఉన్న సిగ్గు వల్ల కావచ్చు, వారిలో ఉన్న ఇంసెక్యూరిటీ వల్ల కావచ్చు, వారి కుటుంబం బాగోగుల వల్ల కావచ్చు, లోపలున్న మనిషిని ఎప్పటికి బయటకు రానీకుండా ఉన్న జీవితం అలా గడిపేస్తూ ఉంటారు. అలా తనలోని మనిషిని తనకు పరిచయం చేసే కథే ఈ బహురూపి.

చివరి కథ 'రిక్షావోడు' : రోడ్డు ఎలా ఉన్నా కూడా పిక్కలు అరిగేలా తిరగాల్సింది రిక్షావోడు మాత్రమే. వెళ్లే దారి రాళ్ళదారి అయినా, ఏటవాలుగా ఉన్నా బండిని రథం లాగినట్టు ఒక్కడే లాగాలి కానీ బండిలో ఉన్న వారు కిందకి దిగి సహాయం చేయరు. అలా కష్టపడే కడుపుకి మనం సహాయం చేయకపోతే వచ్చే కోపమే ఈ రిక్షావోడు.

ఇంకా ఇందులో చిలుక, అబద్ధం కథలు ఉన్నాయి. ఈ కథలన్ని ఊహ నుండి పుట్టినవి కాదు మన పక్కింట్లో, మన ఇంట్లో, మన ఇల్లు ఉన్న సమాజం నుండి పుట్టి, మనల్ని ఆలోచింపజేసే కథలే కదిలి మన దగ్గరకు చేర్చారు దేశరాజు. తప్పకుండా చదవండి మనలో ఉన్న ఆలోచనలు కచ్చితంగా మనల్ని ప్రశ్నించి మళ్లీ మనల్ని మనమే కలుసుకోవడం గ్యారంటీ.

- ఆరుద్ర ఈశ్వర్

గానుగ యంత్రం

ఇరుగు పొరుగు

గానుగ యంత్రం గార గరలాడుతూ పని చేస్తుంది
ఎద్దు దాని వెనకాలే క్రమం తప్పకుండా స్థిరంగా నడుస్తుంది
గుండ్రంగా నెలలూ ఏడాదులూ లెక్కించకుండా
జీవితకాల ప్రయాణాన్ని కొనసాగిస్తుంది
మెడలో గంటలు గణగణ మంటాయి
కంభాన్ని లాగుతూ విత్తనాల్ని నలగ్గొట్టుతూ నూనె తీస్తుంది
కొరడా ని గట్టిగా ఝులిపించినప్పుడు
దేహం గాయాల పాలవుతుంది, కాంతి రెప్పలు మూతబడతాయి
మెదడు మొద్దుబారిపోతుంది
అయినా అది అన్ని కాలాల్లోనూ నడుస్తుంది
వేగాన్ని పెంచమంటూ చిన్నాపెద్దా
తిట్టే తిట్లను భరించడం తప్ప
నిస్సహాయ చక్రానికి బంధీ అయిన దానికి వేరే దారి లేదు
వెలకొద్ది మైళ్ళు నడుస్తుంది అయినా వున్నచోటే వుంటుంది
వ్యాపారి నూనెను అంగట్లో అమ్ముకుంటాడు
ఎద్దుకు ఆ వ్యవహారంలో ఎలాంటి పాత్రా లేదు
ఒకరు రాత్రీ పగలూ కష్టపడితే మరొకరు ఆనందం పొందుతాడు
ఒకరు చెమటోడిస్తే మరొకడు లబ్ది పొందుతాడు
అంతే కదా, ఒకరిది దు:ఖమయితే నూనె మరొకరిది
ఈ ప్రపంచమే ఒక గానుగ యంత్రం
అది అట్లాగే నడుస్తుంది
మనిషిని ఎద్దులా మార్చేసి మట్టి పొరల్లో కొర్చేశారు



ఆంగ్లానువాదం: కేహ్రీ సింగ్ మధుకర్ (డోగ్రీ కవిత)
తెలుగు: **వారాల ఆనంద్**

సాహితీ వార్తలు

17 న వర్తన రెండవ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులు పాదు కొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటయిన వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో రెండవ సమావేశం ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుది. ఈ సమావేశంలో 'కవిత్వ వాస్తవికత' అంశంపై కవి సిద్ధార్థ ప్రసంగిస్తారు. డా॥ రూప్ కుమార్ డబ్బీకార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ పాల్గొంటారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

ఉగాది కవితల కదంబం

అఖల భారతీయ భాషా సాహిత్య సమ్మెళన్ (భూపాల్) తెలంగాన శాఖ, హైదాబాదు ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర 'ఉగాది' సందర్భంగా కవి సమ్మేళనం, కవితా కదంబం గ్రంథావిష్కరణ సభ నిర్వహిస్తారు. ఇందుకోసం కవులు, కవయిత్రులు, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన సభ్యులు తమ కవితలను (20 లైన్లలో) ముందుగా ఈ క్రింది చిరునామాకు పంపగలరు. ఈ కవితలను కవితా కదంబంగా ముద్రణ చేస్తాము. కవులు తమ కవితలను మార్చి 20వ తేదీలోపు ఆచార్య కడారి సత్యమూర్తి, అధ్యక్షులు, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ ఇ. నెం. 13-20-21, శ్రీ కోదండరామ్ నగర్, గడ్డిఅన్నారం, హైదరాబాద్-60, సెల్: 9849320610 చిరునామాకు పంపాలి. ఎంపికయిన కవితలను కవులు, కవయిత్రులు ఉగాది కవి సమ్మేళనంలో చదవొచ్చు. చదివిన వారికి ప్రశంసాపత్రం, సత్కారం, ఉగాది కవితల సంచిక ప్రధానం వుంటుంది.

సర్దుబాటు జీవితాలు

గంపెడు ఆశలు, ఆకాశానంటే ధరలు
వద్దని అనుకోలేము
కొనకుండా ఉండలేము.
దినం దినం కొత్తదనం రోజుకు ఒక గండం.
ధరలు పెరిగినట్టు జీతం పెరగదాయే.
తరగతి తర్వాత తరగతి ఉంటుంది
మా మధ్యతరగతికే
జీవితం మొత్తం తరగని మధ్యతరగతే.
పండుగా పబ్బాలకు కొదువేలేదు
పలకరించని చుట్టం లేదు
సంతోషాలను కొనలేము
కష్టాలను అమ్మనూలేము.
కలల సౌధాలకు అంతులేదు
కష్టాల కన్నీళ్లకు తిరుగులేదు
పేదరికానికి దగ్గరకాలేము
ధనికులుగా మారే ధైర్యము చేయలేము .
మధ్యతరగతి అనే సంసారనావలో
కోపం, ఆవేశం. అనురాగం,
ఆప్యాయత, అనుబంధాలను కలగలిపి
సర్దుబాటు చేస్తూ జీవితాలను
సాగిస్తూ ఉంటాం.

- గాజోజు శ్రీనివాస్
9948483560



ప్రతి హామీని చిత్తశుద్ధితో నెరవేరుస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కాశిబుగ్గ/హనుమకొండ చౌరస్తా

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తామని వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండ, వరంగల్ పట్టణాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 11 అభివృద్ధి పనులను రూ.68 కోట్లతో పనులు ప్రారంభించారు. కె-హబ్, భారత రత్న పీవీ నరసింహారావు నాలెడ్జ్ సెంటర్, మెన్స్ హాస్టల్, సమ్మక్క, సారలమ్మ ఉమెన్స్ హాస్టల్స్, అకాడమిక్, అకాడమిక్ బ్లాక్ 3, ఎంబీఏ బిల్డింగ్, మెన్ డైనింగ్ హాల్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ రెండో ఫ్లోర్, కాంపౌండ్ హాల్, తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం పూర్తయిన భవనాలను పరిశీలించారు. హన్మకొండలోని సమ్మయ్యనగర్‌లో సమగ్ర వరద నీటి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన, బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్క్ ఆధునీకరణ పనులకు సంబంధించిన శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. వికలాంగులకు వెహికల్స్, లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని కాదని రెండు పర్యాయాలు కేసీఆర్‌కు అవకాశం ఇస్తే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని, ఇవ్వకుండా మోశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ హామీలో భాగంగా అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లో 31వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. 75 రోజుల్లో 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. గత ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్ లీకేజీకి పాల్పడితే తాము అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన అవినీతి అధికారులను తొలగించి నిజాయితీపరులైన అధికారులు నియమించినట్టు తెలిపారు. ప్రజా పాలన ద్వారా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలు తెలుసుకున్నారని, తాము ప్రజల అవసరాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు 15తేదీ వరకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, తాము అధికారంలోకి వచ్చాక 1 నుండి 3వ తేదీ లోపు జీతాలు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యా వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి కాంపౌండ్ లేదని, యూనివర్సిటీ భూములు కబ్జా కాకుండా సర్వే చేసి కాంపౌండ్ వాల్ నిర్మించనున్నట్టు తెలిపారు. 11వ తేదీన భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, భూక్య మురళీనాయక్ కార్పొరేటర్లు, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రమేష్ తదితరులు ఉన్నారు.

యాసంగికి సాగునీరందించాలి



- రైతులను తక్షణమే ఆదుకోవాలి : మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా వెంటనే సాగు నీరందించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాశారు. సిద్దిపేట పట్టణంలో ఆదివారం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో సాగు చేస్తున్న యాసంగి పంటలు చేతికి రావాలంటే వెంటనే సాగు నీరందించాలని కోరారు. గడిచిన నాలుగేండ్లలో ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిపడా సాగునీటిని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అలసత్వం వహిస్తున్నట్టుగా అర్ధమవుతుందన్నారు. సాగునీరు లేక తమ కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నా కాపాడుకోలేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, అన్నపూర్ణ (అనంతగిరి) రిజర్వాయర్‌లోకి 1 టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు. రాజకీయాలు కాకుండా రైతుల ప్రయోజనాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు తగిన పరిష్కారం చూపించకుంటే రైతులకు అండగా త్వరలోనే పోరాటాలకు సైతం సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

కంటివెలుగును కంటిన్యూ చేయాలి

- ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు
- గ్లూకోమా వారోత్సవాలు షురూ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్వహించిన కంటి వెలుగు లాంటి ప్రయోజనకర కార్యక్రమాలను కొనసాగించాలని ఎమ్మెల్సీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో గ్లూకోమా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణలో సరోజినీ దేవి కంటి ఆస్పత్రి కీలక పాత్ర పోషిస్తున్నదని అభినందించారు. కంటికి సంబంధించిన వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. గ్లూకోమా కేసులు పెరుగుతున్నాయనీ, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా వాటి నుంచి బయటపడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.రాజలింగం నేతృత్వంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ ఆఫీసర్లు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్ల కార్డులు, బ్యానర్లు చేతబూని కరపత్రాలను పంచుతూ ప్రజల్లో అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించే పని కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యవిద్య సంచాలకురాలు డాక్టర్ వాణి, ఆస్పత్రి వివిధ విభాగాల అధిపతులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

పాక్ అధ్యక్షుడిగా అసిఫ్ అలీ జర్దారీ ప్రమాణస్వీకారం

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ 14వ అధ్యక్షుడిగా అసిఫ్ అలీ జర్దారీ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. 68 ఏళ్ల జర్దారీ చేత పాక్ అధ్యక్ష భవనం ఐవాన్-ఎ-సదర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి ఖాజీ ఫేజ్ ఇసా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, త్రివిధ దళాధిపతులు, సీనియర్ అధికారులు, దౌత్యవేత్తలు హాజరయ్యారు. శనివారం జరిగిన ఎన్నికల్లో పిటిఐ మద్దతుగల సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ (ఎస్ఐసి) అభ్యర్థి మహమూద్ ఖాన్ అచక్జైపై పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) కో-చైర్మన్, అధికార కూటమి ఉమ్మడి అభ్యర్థి జర్దారీ ఘన విజయం సాధించారు. జర్దారీకి 411 ఎలక్టోరల్ ఓట్లు రాగా, మహమూద్ ఖాన్‌కు కేవలం 181 ఓట్లు మాత్రమే వచ్చాయి. పాక్ అధ్యక్షుడిగా జర్దారీ ఎన్నిక కావడం ఇది రెండోసారి. గతంలో 2008 నుంచి 2013 వరకూ అధ్యక్షుడిగా బాధ్యతలు వహించారు. పాక్ మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో భర్తే జర్దారీ.

'అరణ్య' రోదన కారాదు..!

- కాంగ్రెస్ హయాంలోనైనా భద్రాద్రికి పూర్వవైభవం వచ్చేనా..?
- భద్రాచలం అభివృద్ధిని పట్టించుకోని కేంద్రం.. గత రాష్ట్ర ప్రభుత్వం
- కరకట్టకు నిధులు ఇవ్వాలి.. ముంపు ముప్పు తప్పించాలి..
- అటవీప్రాంతంలో తాగునీటి ఇక్కట్లు.. సాగని తునికాకు సేకరణ
- నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనపై కోటి ఆశలతో ఏజెన్సీ





అయోధ్య రాముడే తప్ప భద్రాద్రి బాగోగులు పట్టని కేంద్రం.. యాదాద్రికి ఇచ్చిన ప్రాధాన్యత భద్రాద్రికి ఇవ్వని గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. పవిత్ర భద్రాచలం నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నా, అడవి బిడ్డల బాధలు అరణ్యరోదనలుగా మిగులుతున్నా, పాలకులు పట్టించుకోలేదు. పాలన 'చేయి' మారిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనపై భద్రాద్రి జిల్లా ఏజెన్సీ కోటి ఆశలతో ఉంది.

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు గత బీఆర్ఎస్ పాలనలో భద్రాద్రి జిల్లా నిర్లక్ష్యానికి గురైంది. దాదాపు పదేండ్లలో ఈ ప్రాంతాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రామనామ స్మరణతో రాజకీయాలు చేస్తున్న పాలకులు రాముడు మురికి కూపంలో ఉన్నా.. పోలవరం ముంపు భయం ఏజెన్సీని వెంటాడుతున్నా.. ఐదు పంచాయతీలు ఆంధ్రాలోకి పోయినా.. కనీసం చెత్త పోసుకునే స్థలం లేక పవిత్ర స్థలం దుర్గంధం బారిన పడినా ఏనాటూ పట్టించుకోలేదు. గత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వరదల సమయంలో భద్రాచలానికి వచ్చి రూ.వెయ్యి కోట్ల హామీ ఇచ్చి వెళ్లినా ఆచరణలో పెట్టలేదు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పాలకుల నిర్లక్ష్యం కారణంగా భద్రాద్రి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలంలో పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుతో నెలల తరబడి భద్రాద్రి, పినపాక నియోజకవర్గ పరిసరాలు నీళ్లలో నానుతున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం, ఎత్తు పెంచడంతో పాటు పొడగించాలనే డిమాండ్‌లు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో తాగునీటి సమస్య ఏజెన్సీని వెంటాడుతోంది. అడవిబిడ్డల ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన తునికాకు సేకరణపైనా ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టడంలేదు. ఈ ఏడాది కూడా అదను తప్పుతున్న నేపథ్యంలో ప్రూనింగ్ పనులు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. సోమవారం భద్రాద్రి, పినపాక నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్న సందర్భంగా ఏజెన్సీ సమస్యలపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

భద్రాద్రి అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కావాలి..

భద్రాద్రి రామాలయంతో పాటు పట్టణాభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని అఖిలపక్ష రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపట్టాలని, భద్రాచలం నుంచి నెల్లిపాక, భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు పొడగించాలని, స్లూయిస్‌లు లీక్ కాకుండా నిరంతరం నిర్వహణ ఉండాలని కోరుతున్నాయి. పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై సమగ్ర సర్వే చేపట్టి, నిర్దిష్ట నివేదిక ఇవ్వాలని, ఆంధ్రాలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలోకి తేవాలని, భద్రాచలం గ్రామపంచాయతీనా...? మున్సిపాలిటీనా?? అనే విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. భద్రాచలంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటికైనా ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేసి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. భద్రాచలం రామాలయ ట్రస్టు బోర్డు, పాలకమండలి ఏర్పాటు కూడా జరగడం లేదు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేలైన్ మంజూరుకు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. భద్రాచలంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు డిమాండ్ కూడా ఉంది. వీటి పరిష్కారంపై ముఖ్యమంత్రి స్పందన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

వేసవి పంటపైనా నిర్లక్ష్యం..

అటవీప్రాంతంలో వేసవి పంటగా పిలిచే తునికాకు సేకరణపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇప్పటి వరకు ప్రూనింగ్ పనులు కూడా ప్రారంభం కాలేదు. జిల్లాలోని ఆరు డివిజన్‌లలో 54 తునికాకు యూనిట్లు ఉన్నాయి. వీటిలో 60,400 స్టాండర్డ్ బ్యాగ్‌ల ఆకు సేకరించే అవకాశం ఉన్నా సకాలంలో ప్రూనింగ్ చేపట్టకపోవడంతో గతేడాది 22వేల స్టాండర్డ్ బ్యాగ్‌లే సేకరించారు. ఈ ఏడాది ఇప్పటికే రెండు దశల్లో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అటవీ ఉత్పత్తులపై పాలకుల వైపు నుంచి నిర్లక్ష్యం సాగుతోంది. కాంగ్రెస్ హయాంలోనైనా దీన్ని అధిగమించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పొంచివున్న నీటిఎద్దడి..

వేసవి వచ్చేసిన దృష్ట్యా ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సమస్య నెలకొంది. అటవీ ప్రాంతాల్లోని అనేక గూడేల్లో నీటి కోసం జనం అల్లాడుతున్నారు. సుమారు 200కు పైగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బోర్ల మరమ్మతులు, అద్దె బోర్లు, పైపులైన్‌ల ఏర్పాటు పనులు ముమ్మరం చేసి తాగునీటి ఎద్దడి నుంచి ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉంది.

ఇందిరమ్మ ఇండ్లపై ఆశలు..

గత ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ప్రజల ఆకాంక్షను నెరవేర్చలేదు. భద్రాచలం సహా అనేక చోట్ల నిర్మించినా పంపిణీ చేపట్టకపోవడంతో వృథాగా ఉంటున్నాయి. సొంత జాగలో ఇల్లు కట్టుకోవాలనే ఆకాంక్షను నెరవేర్చే ఇందిరమ్మ ఇంటిపథకానికి భద్రాచలం నుంచి శ్రీకారం చుడుతుండటం శుభపరిణామమే. అర్హులందరికీ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చినప్పుడే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 8,21,541 కాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 6,49,271 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భద్రాద్రిలో 2,79,638, ఖమ్మంలో 3,69,633 దరఖాస్తులున్నాయి. నేడు ప్రజాదీవెన సభలో భాగంగా మణుగూరు, భద్రాచలంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రజల ఆకాంక్షను నెరవేర్చేదిశగా హామీలు ఇవ్వాలని.. వాటిని ఆచరణలో నూటికి నూరుశాతం పెట్టాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలి

- 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి
- పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలి
- కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానం రద్దుపై ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలి : టీఎస్‌యూటీఎఫ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోర్టు ఆటంకాలను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 317 జీవో వల్ల ఇబ్బందులకు గురైన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా కె.జంగయ్య మాట్లాడుతూ..కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మల్టీజోన్-2 జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ప్రమోషన్లు ఆగాయనీ, కోర్టు కేసు కారణంగా రంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు స్కూల్ అసిస్టెంట్లు బదిలీలను ఆపడం కోసం సీనియారిటీ జాబితాపై కేసు వేశారని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీ నర్సిరెడ్డి జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి, సీఎం సలహాదారు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించిన ఫలితంగా కేసులో కొంత పురోగతి వచ్చిందన్నారు. ఒకటెండ్రు రోజుల్లో డైరెక్షన్ వచ్చిన వెంటనే ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం ఈ బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు స్వల్పంగానైనా పెంచడం అభినందనీయమన్నారు. చావరవి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్)రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 317జీవో అమలుతో ఏర్పడిన సమస్యలపై అధ్యయనం కోసం చైర్మెన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ్మ, సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో వేసిన మంత్రివర్గ ఉపసంఘం వీలైనంత తొందరగా నివేదిక ఇవ్వాలని కోరారు. దానివల్ల క్యాడర్ సీనియారిటీ కారణంగా స్థానికత కోల్పోయిన వారికి, జీ.ఓ. 317 కారణంగా వేరు చేయబడి బ్లాక్ చేయబడిన 13 జిల్లాల్లో బదిలీల కోసం ఎదురుచూస్తున్న స్పౌజ్‌కు న్యాయం జరుగుతుందని ఆశించారు. పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో జూనియర్, రికార్డ్ అసిస్టెంట్లను నియమించాలనీ, పాఠశాల శుభ్రత కోసం పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే వర్తింప చేసి ఉద్యోగులతో సమానంగా అన్ని సెలవులు వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకొవాలని సూచించారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలనీ, గురుకుల, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో విద్యా రంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్. రాములు, చావ దుర్గా భవాని, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, పత్రిక సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, కుటుంబ సంక్షేమ నిధి, రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కే. సోమశేఖర్, ఎం వెంకటి, వి.శాంతికుమారి, ఈ గాలయ్య, ఎస్ మల్లారెడ్డి, డి సత్యానంద్, జి నాగమణి, కె రవికుమార్, ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ఎ సింహాచలం, వై జ్ఞానమంజరి, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహబూబ్‌అలీ, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

- ప్రొఫెసర్ నందినీ సుందర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ సంపదపై కార్పొరేట్లు కన్నేశారనీ, ఆ సంపదను వారికి కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు అడవి బిడ్డలపై యుద్ధం చేస్తున్నారని ఆదివాసీ చట్టాలు - సాయుధీకరణ అంశంపై ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నందినీ సుందర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సంభలో ఆమె మాట్లాడారు. ఈశాన్యాన ప్రకృతి అందాలకు నెలవైన మణిపూర్ ఇటీవల భగ్గుమనటం కలకలం రేపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతాలపై పోలీసు ప్రహరా కొనసాగుతుందన్నారు.

సుప్రీం కోర్టు తీర్పులను కూడా లెక్క చేయకుండా రూపం మార్చి గిరిజనులపై ప్రభుత్వం దాడులు కొనసాగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేటీకరణ - కార్మిక హక్కుల విధ్వంసం అనే అంశంపై ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షులు పి. ప్రసాద్ మాట్లాడుతూ వందల ఏండ్లుగా ఆధ్యాత్మికంగా ప్రజల గుండెల్లో కొలువుదీరిన రాముడు, రాజకీయానికి ప్రధాన ఆయుధంగా మారాడని చెప్పారు. ఆ రామున్ని కొలిచే కార్మికులను రాజకీయ రాముడిని కూడా పూజించే కార్మికులుగా మార్చేందుకు జరుగుతున్న ప్రక్రియ దేశానికి చాలా ప్రమా దకరమని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని చైతన్యయుతంగా కార్మిక వర్గం అడ్డుకోవాల్సిన అవసరముందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాల రద్దు కారణంగా చికాగోలో సాధించుకున్న 8 గంటల పని విధానం.. 12 గంటల పనిదినంగా మారుతోందని చెప్పారు. ఇది కార్మికుల సామాజిక జీవనంపై దాడిగా చూడాలన్నారు. కార్మిక పోరాటాలను ఆర్థిక కోణంలో కాకుండా, సమగ్ర హక్కుల సాధనగా ఆలోచించాలని సూచించారు. అయోధ్య సమస్య ప్రజల అంశంగా మారడం బాధాకరమన్నారు. సదస్సులో పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ రావు, కన్నెగంటి రవి, శ్రీమన్నారాయణ, ఆంజనేయులు, మాధురి తదితరులు మాట్లాడారు.

గోయల్ రాజీనామాపై సందేహాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామా వ్యవహారం లోక్‌సభ ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణపై సందేహాలకు బలం చేకూరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వారం రోజుల్లో వస్తుందనే వార్తల నేపథ్యంలో గోయల్ అనూహ్య రాజీనామా విస్మయం కలిగించిందన్నారు. రాజీనామా వెనుక కారణాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముగ్గురు సభ్యులు ఉండే కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ప్రస్తుతం రెండు ఖాళీలు ఉండడం, ఆ ఖాళీలు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కనుసన్నల్లోనే జరగనుండడం ఆందోళన కలిగిస్తోం దన్నారు.

గతంలో కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండేవారని కానీ ఇప్పుడు నూతన చట్ట సవరణ ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తికి బదులుగా ఒక కేంద్రమంత్రి ఉంటారని తెలిపారు. కాబట్టి ఎన్నికల కమిషనర్‌ల ఎంపిక ప్రక్రియలో నిష్పాక్షికత సందేహమేనని తెలిపారు. ఇప్పటికే ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం అధికార పార్టీకి అనుకూలంగా ఉందనేది తేలిపోయిందన్నారు. ఆ బాండ్ల వ్యవహారం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పుని చ్చినప్పటికీ బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, సంస్థల పేర్లు బయట పెట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరాకరిస్తుండడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నదన్నారు. అలాగే ఈవీఎంల వ్యవహారంలో ఎప్పటినుండో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని గుర్తు చేశారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయండి

- సీఎంకు రెవెన్యూ ఉద్యోగ సంఘాల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాములు నేతృత్వంలో ఆదివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, భూ వివాదాలు మొదలగు సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలంటే గతంలో మాదిరిగా గ్రామ, మండల స్థాయిల్లో ఉద్యోగుల సంఖ్యను పెంచాలని సీఎంను కోరారు. రూరల్, సెమీ రూరల్, అర్బన్‌గా మూడు స్థాయిలుగా విభజిస్తే ప్రజలకు సేవలు మరింత, వేగంగా అందుతాయన్నారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న 5,576 మంది పూర్వ వీఆర్వోల గత సర్వీసును పరిగనంలోకి తీసుకొని ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన జిల్లాలు, మండలాల ప్రాతిపదికన రెవెన్యూ ఉద్యోగుల సంఖ్యను పెంచాలని కోరారు. సమస్యల పట్ల సీఎం సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు కె.రామకష్ణ, ఎస్.ఆర్ సరిత, రమేష్ పాక, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా భావజాలం

- కుంభమేళా పేరుతో బీజేపీ కొత్త రాజ్యాంగ సభ
- ఆర్ఎస్ఎస్ ప్రత్యామ్నాయ రాజ్యాంగం సిద్ధం : ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారత రాజ్యాంగానికి విరుద్ధంగా భావజాలం విస్తరిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలు, ప్రమాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. బీజేపీ సర్కారు కుంభమేళా పేరుతో కొత్త రాజ్యాంగ సభను ఏర్పాటు చేసిందన్నారు.ఇప్పటికే ఆర్ఎస్ఎస్ ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని సిద్ధం చేసిందని తెలిపారు. అంటరానితనం, అణచివేత, అసమానతలకు మూల కారణమైన మనువాదాన్ని తెరపైకి తీసుకరాబోతున్నదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆలిండియా ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి, అభివృద్ధికి సంబంధం లేకుండాపోయిందని విమర్శించారు. అసమానతలు పెరుగుతున్నాయన్నారు. మనుషులను గౌరవించే సమిష్టితత్వం, సమానత్వ స్వప్నం కావాలన్నారు. దేశానికి స్వతంత్ర్యం వస్తే నా ప్రజలకు స్వతంత్ర్యం వచ్చినట్టేనా? అంటూ గాంధీని అంబేద్కర్ ప్రశ్నించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలో పౌర హక్కులు కూడా అంబేద్కర్ చొరవతోనే వచ్చాయన్నారు. ప్రస్తుతం పౌర హక్కులకు ప్రాధాన్యత లేదనీ, ప్రతి పౌరుడు తన బాధ్యతను నెరవేరుస్తే చాలు అన్న సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారని విమర్శించారు. కొన్నేండ్ల తర్వాత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను ప్రగతి నిరోధక శక్తులు ప్రశ్నిస్తాయని అంబేద్కర్ అనుమానం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. బీజేపీ హయంలో అదే జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో హిందూ మతం స్థానంలో బౌద్ధ మతం ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని చెప్పారు. జపాన్, చైనా వంటి అగ్రదేశాలు బౌద్ధమత ప్రభావంతో అభివృద్ధి చెందాయన్నారు. బ్రాహ్మణీయ భావజాలం ఆ మతాన్ని లేకుండా చేసిందన్నారు. ఉత్పత్తి సాధనాలు కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం కాకూడదనే రాజ్యాంగ సూత్రానికి విరుద్ధంగా అభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం మురళీధర్‌రావు, డాక్టర్ పట్నాల సుధాకర్, అసమానతలు పెరుగుతున్నాయని విమర్శించారు.

భారత జాగృతి కమిటీలు రద్దు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత జాగతి కమిటీలు రద్దయ్యాయి. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ మేరకు ఆదేశించారు. ఆమె ఆదేశాలతో విదేశీ, జాతీయ , రాష్ట్ర, జిల్లా, మండల , గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేసినట్టు జాగృతి కార్యాలయంలో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రద్దు వెంటనే అమలులోకి వస్తుందని వెల్లడించింది.

కోరలు తీసిన పాము

పళ్లు లేని పులి

- ఎన్నికల్లో ప్రభావం చూపని నోటా
- ఐదేండ్లలో ఓటేసింది 1.29 కోట్ల మందే
- మరోవైపు చట్టసభల్లో పెరుగుతున్న నేర చరితులు



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)పై 'నోటా' బటన్‌కు అవకాశం కల్పించి పది సంవత్సరాలు దాటింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈవీఎంలో నోటాను చేర్చారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చక పోతే ఓటరు నోటాను ఎంచుకోవచ్చు. అయితే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్న ఓటర్ల సంఖ్య మాత్రం బాగా తక్కువగా ఉంటోంది.ఫలితాలపై దాని ప్రభావం ఏ మాత్రం లేకపోవడంతో పలువురు నిపుణులు నోటాను 'పళ్ల లేని పులి', 'కోరలు తీసిన పాము'గా అభివర్ణిస్తున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2013లో నోటాను ప్రవేశపెట్టారు. కళంకిత అభ్యర్థులను బరిలో నిలపకుండా రాజకీయ పార్టీలను నిరుత్సాహపరచేందుకే ఈ ఆప్షన్‌ను తీసుకొచ్చారు. రంగంలో ఉన్న ఏ అభ్యర్థికీ ఓటు వేయరాదని ఓటరు నిర్ణయించుకున్నప్పుడు అతనికి ఉన్న ఏకైక అవకాశం నోటా. బ్యాలెట్ పత్రాలు, ఈవీఎంలలో నోటా ఆప్షన్‌ను ప్రవేశపెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు అప్పట్లో ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. దీంతో ఈవీఎంలు, బ్యాలెట్ పత్రాలలో ఇందుకోసం ప్రత్యేకంగా ఓ గుర్తును కేటాయించారు. ఈవీఎంలో అభ్యర్థుల పేర్ల చివర నోటా బటన్ ఉంటుంది.

పెరుగుతున్న కళంకితులు

సుప్రీంకోర్టు ఆదేశాలకు ముందు ఏ అభ్యర్థికీ ఓటు వేయడం ఇష్టం లేని ఓటరు ఫామ్ 490ని పూర్తి చేయాల్సి వచ్చేది. అయితే ఎన్నికల నిర్వహణ నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రంలో ఈ పత్రాన్ని నింపడం ఓటరు గోప్యత హక్కుకు భంగకరంగా ఉండేది. కాగా గత ఐదు సంవత్సరాల కాలంలో వివిధ రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో 1.29 కోట్ల మందికి పైగా ఓటర్లు నోటాను ఉపయోగించుకున్నారు. అదే సమయంలో నేర చరిత్ర కలిగిన అభ్యర్థుల సంఖ్య కూడా బాగా పెరిగింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం గత దశాబ్ద కాలంలో క్రిమినల్ కేసులున్న ఎంపీల సంఖ్య బాగా పెరిగింది. 2009లో ఎన్నికైన ఎంపీల్లో 30% మంది నేరచరితులే. ఆ సంఖ్య తర్వాత బాగా పెరిగింది.

2009 ఎన్నికల్లో విజయం సాధించిన 543 మంది అభ్యర్థుల చరిత్రను ఏడీఆర్ విశ్లేషించింది. వీరిలో 162 మంది (30 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రకటించారు. వారిలోనూ 76 మందిపై (14 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2019 ఎన్నికల నాటికి క్రిమినల్, తీవ్రమైన క్రిమినల్ కేసులున్న ఎంపీల సంఖ్య వరుసగా 43 శాతం, 29 శాతానికి పెరిగింది. నేర చరితులను అడ్డుకునే విషయంలో నోటా వల్ల ప్రయోజనమేమీ కలగలేదని, వాస్తవానికి క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న అభ్యర్థుల సంఖ్య పెరిగిందని ఏడీఆర్ అధిపతి రిటైర్డ్ మేజర్ జనరల్ అనిల్ వర్మ తెలిపారు.

రిజర్వ్‌డ్ స్థానాల్లో మెరుగు

ఓటరు తన అసమ్మతిని, రాజకీయ పార్టీల పట్ల తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి నోటా అనేది ఓ వేదిక అని, అంతకంటే దానికి ప్రాధాన్యత ఏమీ లేదని వర్మ చెప్పారు. జనరల్ స్థానాలతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో నోటాకు కొంచె ఎక్కువ ఓట్లు వచ్చాయని ఆయన తెలిపారు. ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే మహారాష్ట్రలోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన లాతూర్ రూరల్‌లో అత్యధికంగా నోటాకు 27,500 ఓట్లు పడ్డాయి. మొత్తం పోలైన ఓట్లలో ఇది 13 శాతం కంటే ఎక్కువే. కాంగ్రెస్ అభ్యర్థి ధీరజ్ దేశ్‌ముఖ్‌కు 67 శాతం ఓట్లు రాగా రెండో స్థానం నోటాదే.

నేరచరితులు పోటీ పడిన స్థానాల్లోనూ అంతంతే

ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నేరచరితులు పోటీ చేసిన నియోజకవర్గాలకు సంబంధించి 2018 నుండి వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో నోటాకు 26,77,616 ఓట్లు పోలయ్యాయి. బీహార్‌లో అలాంటి 217 స్థానాల్లో నోటాకు 1.63 శాతం ఓట్లు లభించగా ఢిల్లీలో 0.43 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన గోపాల్‌గంజ్‌లో నోటాకు అత్యధికంగా 51,660 ఓట్లు పడ్డాయి. పోలైన ఓట్లలో ఇది 5.03 శాతం.

ఓట్ల శాతం తక్కువే

'కళంకిత మంత్రులను పోటీకి దింపకుండా రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చేందుకే నోటాను ప్రవేశపెట్టారు. అయితే అలా జరగలేదు' అని అనిల్ వర్మ చెప్పారు. రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు 0.5 శాతం నుంచి 1.5 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు 1.06 శాతం ఓట్లు వచ్చాయి.

2018లో ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో నోటాకు అత్యధికంగా 1.98 శాతం ఓట్లు లభించాయి. నోటాకు పడిన అతి తక్కువ ఓట్ల విషయానికి వస్తే లక్షద్వీప్ లోక్‌సభ స్థానంలో 100 ఓట్లు మాత్రమే పడ్డాయి. 2020లో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లోనూ, 2018లో జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లోనూ నోటాకు దక్కింది కేవలం 0.46 శాతం ఓట్లే.

నిపుణులు ఏమంటున్నారు?

నోటా ఆప్షన్‌కు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని యాక్సిస్ ఇండియా ఛైర్మెన్ ప్రదీప్ గుప్తా సూచించారు. నోటాపై పోటీ పడి ఓడిన వారు తిరిగి పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన అన్నారు. అప్పుడే ఎక్కువ మంది ఓటర్లు నోటాను కోరుకుంటారని చెప్పారు. '2014లో 1.08 శాతం, 2019లో 1.06 శాతం ఓటర్లు నోటాను ఎంచుకు న్నారు. ఇది మంచి సంఖ్యే. అయితే తిరస్కరణకు గురైన అభ్యర్థులు తిరిగి పోటీ చేయకూడదన్న నిబంధన తీసుకొస్తే నోటాను ఎంచుకునే వారి సంఖ్య పెరుగుతుంది' అని తెలిపారు. అయితే ఇందుకు రాజకీయ పార్టీలు అంగీకరించ వని, కాబట్టి నోటా కోరలు తీసిన పాము వంటిదని వ్యాఖ్యా నించారు. కాగా నోటాను రద్దు చేయాలని కోరుకుంటున్న నేతలూ ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ గత సంవత్సరం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో మాత్రం నోటాకు అవకాశం లేదని 2018లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రెండు రోజుల్లో నల్లగొండ, భువనగిరి అభ్యర్థుల ప్రకటన

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు రోజుల్లో నల్లగొండ, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ మూడు నెలల పాలనలో రాష్ట్రంలో మార్పు తిరోగమనంలో వస్తున్నదని ఎద్దేవా చేశారు. ప్రజలు నీళ్ల ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తుంటే, రైతులు సాగునీటి కోసం అల్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సాగునీటిరంగంపై సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఏం భరోసా ఇస్తారో చెప్పాలని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన మానుకుని కరువు పర్యటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శాశ్వత కమిషన్ అవసరం

- భారత కోస్ట్‌గార్డ్‌లో మహిళా అధికారులకు దానిని మంజూరు చేయాలి
- కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం భేష్ : విశ్లేషకులు, నిపుణులు

కొచ్చి: భారత కోస్ట్‌గార్డ్‌లో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్(పీసీ)ను మంజూరు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేయటంపై నిపుణులు, విశ్లేషకులు స్పందించారు. ఈ నిర్ణయం సరైనదేనని వ్యాఖ్యానించారు. ఎంతోకాలంగా ఉన్న డిమాండ్‌ను న్యాయస్థానం అర్థం చేసుకున్నదని తెలిపారు. ఇది లింగ వివక్షను ఏ రూపంలోనైనా సహించేది లేదన్న కోర్టు అభిప్రాయానికి అనుగుణంగా ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. గత నెల 26న ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారి ప్రియాంక త్యాగి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు గట్టి సందేశం ఇచ్చింది. ప్రభుత్వం చేయకపోతే అందుకు అనుకూలమైన ఉత్తర్వు న్యాయస్థానం జారీ చేస్తుందని హెచ్చరించింది. మహిళలకు శాశ్వత కమిషన్లు మంజూరు చేయటంలో "ఫంక్షనల్, ఆపరేషనల్ ఇబ్బందులు" ఉన్నాయని అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఇచ్చిన వివరణను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. అలాంటి సాకులను ఇకపై ఉపేక్షించబోమని వివరించింది. సాయుధ బలగాలకు చెందిన మహిళా అధికారులకు వారి పురుష సహచరులతో సమానంగా పీసీని మంజూరు చేయాలని గతంలో నుంచే అనేక డిమాండ్లు ఉన్నాయి. లింగ-తటస్థ విధానాలను అమలు చేయటానికి అధికారులు విముఖత చూపటం, సంప్రదాయాల వెనుక దాగి ఉంటటం, మహిళలు కొన్ని పాత్రలకు తగినది కాదని చాలా కాలంగా ఉన్న నమ్మకాలను కోర్టు గుర్తించింది.

చారిత్రాత్మకంగా, సాయుధ దళాలు తమ ర్యాంకుల్లో మహిళలను నియమించుకోవటంలో నిదానంగా ఉన్నాయి. ఒకవేళ నియమితులైనవారు ఉన్నత ర్యాంక్‌లకు ప్రమోషన్, ఉద్యోగ భద్రత విషయంలో వివక్షను ఎదుర్కొన్నారు. సైన్యం, నావికాదళం, వైమానిక దళాన్ని నియంత్రించే చట్టాలు మహిళలను కొన్ని పాత్రల నుంచి దూరంగా ఉంచడానికి స్పష్టమైన నిబంధనలను కలిగి ఉన్నాయి. వాటిని అధిగమించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నది. అయితే 1990ల ప్రారంభంలో మాత్రమే చేతన ప్రయత్నాలు జరిగాయని నిపుణులు, విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

వడ్డేపల్లికి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యునిగా నియమితులైన వడ్డేపల్లి రాంచందర్ కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజల కోసం పాటుపడే రాంచందర్ సభ్యునిగా నియమితులు కావడం ఆ వర్గాలకు మరింత మేలు చేస్తుందని ఈఎస్ఐసీ ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అడిషనల్ సెక్రెటరీ జనరల్ ప్రకాశ్ బాబు తెలిపారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలకు న్యాయం అందించటంలో రాంచందర్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర అటవీ అధికారుల సంఘం ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి.వెంకటేశ్వర్లు, డి.సుధాకర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అటవీ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా డి.సుధాకర్‌రెడ్డి ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారితో పాటు ఉపాధ్యక్షులుగా వినయ్‌కుమార్ సాహూ, సంయుక్త కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, కోశాధికారిగా మాధవరావు ఎన్నికయ్యారు. కొత్త కమిటీ తరపున త్వరలోనే అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ఉన్నతాధికారులను కలుస్తామని తెలిపారు.

పాఠశాలలు, కళాశాలలకు ఉచితవిద్యుత్‌పై టీఎస్‌యూటీఎఫ్ హర్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామనీ, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సీఎం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థుల ఉద్యోగాలపై 12న జరిగే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామనీ, జీవో 317 సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీనే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తుందని సీఎం చెప్పటాన్ని స్వాగతిస్తున్నామని వారు చెప్పారు. సంఘాలుండాల్సిందేననీ, వాటితో మంత్రి వర్గ ఉపసంఘం చర్చించి అన్ని సమస్యలు పరిష్కరించుకుందామని సీఎం భరోసా ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. సంఘాల గుర్తింపుపైనా నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు.

మాయావతి అనుమతితోనే బీఆర్ఎస్‌తో పొత్తు

- ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి అనుమతి ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని ప్రకటించారు. బీఎస్పీ-బీఆర్ఎస్ పార్టీల కూటమి చర్చలపై రాష్ట్రంలో ఏర్పడిన సందిగ్ధానికి మాయావతి తెరదించారని ఆయన వివరించారు.

రాష్ట్రంలోని బీఆర్ఎస్ ఎన్డీయే, ఇండియా కూటమిలో లేనందున ఆ పార్టీతో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేయటానికి పార్టీ అదిష్టానం అనుమతించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్టు వివరించారు.

మా కుటుంబాలను కష్టాల పాలు చేశారు

న్యాయం చేయండి: మంత్రి దామోదరకు 317 జీవో బాధితుల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా 317 జీవోను తీసుకొచ్చిందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ జీవో కారణంగా తమ కుటుంబాలు కష్టాలను ఎదుర్కొంటున్నాయని వాపోయారు. బాధిత కుటుంబాలను ఆ కష్టాల నుంచి గట్టెక్కించాలని వారు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించుకున్నారు.

ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన బాధితులు వినతిపత్రాన్ని సమర్పించారు. 317 జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై ఏర్పాటు అయిన క్యాబినెట్ సబ్ కమిటీ ఛైర్మెన్‌గా దామోదర రాజనర్సింహను నియమించినందుకు బాధితులు తమకు న్యాయం జరుగుతుందని

ఈ సందర్భంగా బాధితులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ కమిటీ తీసుకునే నిర్ణయాలతో రాష్ట్రంలోని ఉద్యోగులు, వారి కుటుంబాలతో పాటు తమ స్థానికత, పదోన్నతులు, బదిలీలు, స్పౌజ్ కేసుల సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రికి వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పునర్ సమీక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో బాధితులు రాపోలు శేఖర్, నిరీక్షణ, దీపిక, అనిత, గుగులోత్ మధు, రాథోడ్ కిరణ్, ఆలూరు మంజుల, పల్లవి లతోపాటు పలువురు బాధితులు ఉన్నారు.

రేపు భూ సదస్సు

- రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం భూ(ధరణి) సదస్సు నిర్వహిస్తున్నామని తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వెల్లడించాయి. ఈమేరకు ఆదివారం ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి. సాగర్, ఆర్ వెంకట్రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధరణి లోపాలను సరిచేయడానికి మార్చి 1 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం నిర్ణయించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి పూనుకున్నదని తెలిపారు. సమగ్ర భూసర్వే జరగకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇంకా అనేక భూ సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. వీటిపై సమగ్రంగా చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కౌలు రైతులు, అసైన్మెంట్ భూములు సాగు చేసుకుంటున్న రైతులు, అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు రానివారు ఇలా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు సదస్సులో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

ఆస్ట్రేలియాలో హైదరాబాద్ యువతి దారుణహత్య

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియాలో దారుణ ఘటన జరిగింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం బక్‌లేలో హైదరాబాద్ ఏఎస్‌రావునగర్‌కు చెందిన వివాహిత చైతన్య మదగాని అలియాస్ శ్వేతను గత శనివారం దుండగులు హత్య చేశారు. చైతన్యను చంపిన దుండుగులు ఆమె మతదేహాన్ని రోడ్డు పక్కన చెత్త డబ్బాలో పారేశారు. హత్యకు సంబంధించి సెకండ్ క్రైమ్ సీన్‌ను పాయింట్ కుక్‌లోని మిర్కా వేలో ఉన్న చైతన్య ఇంట్లో పోలీసులు రీ క్రియేట్ చేశారు. అయితే హత్య చేసిన వాళ్లు చైతన్యకు తెలిసిన వాళ్లేనని పోలీసులు చెబుతున్నారు. ఆమెను చంపిన తర్వాత దుండగులు వేరే దేశానికి పారిపోయారని తెలిపారు.

అధికారంలోకి వస్తే కులగణన

ఇది విధాన రూపకల్పనలో సహాయపడుతుంది : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : తాము అధికారంలోకి వస్తే కుల గణనను నిర్వహించాలనే తన పార్టీ సంకల్పాన్ని రాహుల్ గాంధీ నొక్కిచెప్పారు. ఈ సరైన అడుగుతో ఆర్థిక మ్యాపింగ్‌తో పాటు రిజర్వేషన్‌పై 50 శాతం పరిమితిని తొలగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నినాదం "గణన" అనీ, ఎందుకంటే అది న్యాయం వైపు మొదటి అడుగు అని రాహుల్ చెప్పారు. "ఎవరు పేదవారు అని మనం ఎప్పుడైనా ఆలోచించామా? పేదలు ఎందరు, వారు ఏ స్థితిలో ఉన్నారు? ఇవన్నీ లెక్కించాల్సిన అవసరం లేదా?" అని రాహుల్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

బీహార్‌లో నిర్వహించిన కుల గణనలో 88 శాతం మంది పేదలు దళిత, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాల నుంచి వచ్చినట్టు తేలిందని గాంధీ చెప్పారు. "బీహార్ నుంచి వచ్చిన గణాంకాలు దేశ వాస్తవ చిత్రణ చిన్న సంగ్రహావ లోకనం మాత్రమే. దేశంలోని పేద జనాభా ఏ స్థితిలో జీవిస్తున్నారనే దానిపై మనకు ఆలోచన కూడా లేదు" అని ఆయన అన్నారు. అందుకే కుల గణన, ఎకనామిక్ మ్యాపింగ్ అనే రెండు చారిత్రాత్మక చర్యలు తీసుకోబోతున్నామనీ, వాటి ఆధారంగా 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేస్తామని స్పష్టం చేశారు.ఈ చర్య దేశాన్ని "ఎక్స్-రే" చేస్తుందనీ, ప్రతి ఒక్కరికీ సరైన రిజర్వేషన్లు, హక్కులు, భాగస్వామ్యాన్ని అందిస్తుందని రాహుల్ గాంధీ చెప్పారు. "ఇది పేదల కోసం సరైన విధానాలు, ప్రణాళికలను రూపొందించటంలో సహాయ పడటమే కాకుండా విద్య, సంపాదన, ఔషధాల పోరాటం నుంచి వారిని రక్షించటంలో, అభివృద్ధి ప్రధాన స్రవంతిలో వారిని కనెక్ట్ చేయడంలో కూడా సహాయపడుతుంది. కాబట్టి, మేల్కోండి.. మీ గళాన్ని పెంచండి.. కుల గణన మీ హక్కు. ఇది మిమ్మల్ని కష్టాల చీకటి నుంచి వెలుగు వైపు తీసుకెళ్తుంది" అని ఆయన అన్నారు. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలను ప్రభుత్వం అర్థం చేసుకోవటానికి సమగ్ర సామాజిక-ఆర్థిక కుల గణన దోహదపడుతుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జీ జనరల్ సెక్రెటరీ జైరాం రమేష్ అన్నారు.

కారు దిగి కమలం గూటికి..

- బీజేపీలో చేరిన బీఆర్ఎస్ మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌కు మార్గం సుగుమం అవుతుందని బీజేపీ పార్లమెంటరీ పార్టీ బోర్డు మెంబర్, ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఆ దిశలో చాలా రాజకీయ పరిస్థితులు మారనున్నట్టు చెప్పారు. ఆదివారం నాడిక్కడ బీజేపీ ప్రధాన కార్యాలయంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీలు గోడెం నగేష్, సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, జలగం వెంకట్రావ్, కాంగ్రెస్ నేత గోమసే శ్రీనివాస్ లు బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ తరుణ్ చుగ్, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ సీనియర్ నేత పొంగులేటి వీరికి పార్టీ సభ్యత్వ రశీదు ఇచ్చి, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తరుణ్ చుగ్ మాట్లాడుతూ... దేశ వారసత్వ, అవినీతి రాజకీయ పార్టీలను చూసి ఆందోళనలో ఉందన్నారు. కేసీఆర్ తన పార్టీని బీఆర్ఎస్ కాకుండా... బాబా, బేటా, బేటీ(బీబీబీ) గా మార్చుకుంటే సరిపోయేదని ఎద్దేవా చేశారు. బీబీబీ పార్టీ పూర్తిగా అవినీతి పాలన చేసిందని విమర్శించారు. అందుకే ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారన్నారు.

పీఎస్‌యూ బ్యాంకు ఉద్యోగులకు వారంలో ఐదు రోజులే పని

ఆమోదం తెలిపిన డీఎఫ్ఎస్

న్యూఢిల్లీ: ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ), బ్యాంక్ ఎంప్లాయీ యూనియన్లు.. పీఎస్‌యూ బ్యాంకు ఉద్యోగులందరికీ వారంలో ఐదు రోజుల పనికి అంగీకరించాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఇందుకు తన ఆమోదం తెలిపినట్టు సమాచారం. దీనికి సంబంధించి ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నది.

అలాగే, 2022, నవంబర్ 01 నుంచి అమలులోకి వచ్చే వార్షిక వేతన పెంపులో 17 శాతం పెంపుపై ఐబీఏ, బ్యాంకుల యూనియన్లు రెండూ ఏకాభిప్రాయాన్ని కలిగి ఉన్నాయి.

ఈ మేరకు ఐబీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ మెహతా ఒక ట్వీట్‌లో తెలిపారు.



రూ.8284 కోట్ల భారం.. 8 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం

కొత్త ఐదు రోజుల పనివారం నిర్ణయంతో ప్రభుత్వ రంగ బ్యాంకులకు దాదాపు రూ.8,284 కోట్ల వార్షిక వ్యయమవుతుందని అంచనా. 2022, నవంబర్ నుంచి అమలులోకి వచ్చే ఈ వేతన పెంపు సుమారు 800,000 మంది బ్యాంక్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిసింది. సవరించిన వేతన పరిష్కారంలో, మహిళా ఉద్యోగులకు మెడికల్ సర్టిఫికేట్ అవసరం లేకుండా నెలకు ఒక అనారోగ్య సెలవు రోజు మంజూరు చేయబడింది.

అదనంగా, పదవీ విరమణ తర్వాత లేదా సేవ సమయంలో ఉద్యోగి మరణించిన సందర్భంలో సేకరించబడిన ప్రివిలేజ్ లీవ్‌ను 255 రోజుల వరకు మానిటైజ్ చేయవచ్చు.

రిటైర్డ్ వ్యక్తులు ఎస్బీఐతో సహా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పెన్షన్ లేదా కుటుంబ పెన్షన్‌తో పాటు నెలవారీ ఎక్స్‌గ్రేషియా చెల్లింపును అందుకుంటారు. 2022, అక్టోబర్ 31లోపు పెన్షన్ పొందే అర్హత ఉన్న పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లకు, ఆ నిర్దిష్ట తేదీన పదవీ విరమణ చేసిన వారితో సహా ఇది వర్తిస్తుంది. ఈ అంశంపై ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయనున్నది.

'వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'



నవతెలంగాణ- నాగోల్

ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు వినియోగించు కోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌నాథ్ యాదవ్ సూచించారు. నాగోలు డివిజన్‌లోని మధురానగర్ రోడ్ నెంబర్ 6లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కార్పొరేటర్ హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్, మధుర నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ - బడంగ్‌పేట్

యువతి అదృశ్యమైన ఘటన పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు ఆదివారం చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం..కేతేపల్లి గ్రామం నాంపల్లి మండలం, నల్గొండ జిల్లాకు చెందిన పోలేటి యాదమ్మ భర్త చనిపోయాడు. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్ద కూతురు పోలేటి విజయలక్ష్మి తుక్కుగూడలోని వ్యాబ్ సిటీలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తన స్నేహితురాలుతో కలిసి ఉంటుంది. ఈ నెల 7న ఉదయం తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడింది. తర్వాత నుండి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. ఆమె ఆచూకీ కోసం బంధువులను, స్నేహితులను సంప్రదించగా సమాచారం అందకపోవడంతో తల్లి యాదమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ - నాగోల్

ఆకలితో అలమటిస్తున్న వారికి పట్టెడన్నం పెట్టి, వారి ఆకలిని తీర్చడం కోసం అన్నదానాలు చేయడం ఎంతో పుణ్యకార్యమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని ఆయా ప్రాంతాలలో ఆదివారం ఏర్పాటు చేసిన అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని శ్రీనివాస్ గుప్త ప్రారంభించారు. తర్వాత అంతర్జాతీయ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ రామంతాపూర్ లో, మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలలో శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమావాస్య అన్నదానాలలో ప్రతి నెల దాదాపు 500 మందికి భోజనాలు పెట్టడం ఆనవాయితీగా కొనసాగుతుంది అన్నారు. అనంతరం అన్నదాన నిర్వాకులు శ్రీనివాస గుప్తను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు పాండయ్య గుప్త, జనరల్ సెక్రటరీ, ట్రెసరర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ బోనగిరి శ్రీనివాసులు గుప్త, ఐవీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్, మేడిపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీధర్ గుప్త, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





నవతెలంగాణ - మీర్ పేట్

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నందిహిల్స్ కాలనీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో నందిహిల్స్ చౌరస్తాలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ.. రాజకీయ రంగంలో కూడా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, ఐద్వా బుగ్గవీటి సరళ, రచయిత కమలాత్రిపుర, విజయ, డాక్టర్ సైదా, రామిడి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని వెలికితీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు



నవతెలంగాణ - బడంగ్‌పేట్

విద్యార్థుల విజ్ఞానాన్ని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలోని క్యూబా కాలనీలో ఉన్న షైన్ మాడల్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. బాగా చదువుకొని తల్లీదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారికోసం ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, షైన్ మోడల్ స్కూల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడే అవిశ్వాస తీర్మానం.. నెగ్గేనా..? వీడేనా..?



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై గత నెలలో కలెక్టర్ కు అవిశ్వాసం నోటీస్ అందజేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్పొరేటర్లు 31మంది సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌ను బీఆర్ఎస్ పార్టీకి చెందిన మేయర్ దుర్గా దీప్ లాల్ పై అవిశ్వాస తీర్మానం పెట్టిన సంగతి తెలిసిందే. ఈరోజు ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరగనుంది. ప్రిసైడింగ్ అధికారిగా కందుకూరు ఆర్డీఓ వ్యవరించనున్నారు. అయితే అవిశ్వాస తీర్మానంపై సంతకాలు పెట్టిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు వెనెక్కి తగ్గినట్లు సమాచారం. సంతకాలు చేసిన 30మందితో పాటు అవిశ్వాస తీర్మానం పత్రాలలో సంతకాలు చేయని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో నలుగురు కార్పొరేటర్లు మేయర్ పై ఉన్న అసమ్మతితో సమావేశంలో అవిశ్వాసానికి మద్దతు తెలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. చూడాలి మరి సమావేశంలో అవిశ్వాసం నెగ్గుతుందో.. వీగుతుందో... కొన్ని గంటల్లో తెలిసిపోతుంది.

కాంగ్రెస్‌లో చేరిన బ్రహ్మయ్య, వినయ్ కుమార్



నవతెలంగాణ - నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దవురే బ్రహ్మయ్య, బీసీ సంక్షేమ సంఘం మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి మద్దెల వినయ్ కుమార్‌లు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మధుయాష్కీగౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెద్దవురే బ్రహ్మయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలు, నాయకులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొన్నారు.

గనుల పర్యావరణ, ఖనిజ సంరక్షణ వారోత్సవాల ముగింపు వేడుకలు



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ 29వ గనుల పర్యావరణ, ఖనిజ సంరక్షణ వారోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం ఇంజాపూర్‌లో వి ఎమ్ ఆర్ గార్డెన్‌లో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ హైదరాబాద్ రీజియన్, పరాశక్తి సిమెంట్ సంయుక్త ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చీఫ్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ పి ఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గనుల క్రమబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలపై అంచనా వేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మైనింగ్ పరిశ్రమలకు చెందిన ఎక్సిక్యూటివ్‌లతో కూడిన బృందాలు 104 గనులను సందర్శించాయని తెలిపారు. అడవుల పెంపకం, వ్యర్థాల డంప్ నిర్వహణ, టాప్ మట్టి నిర్వహణ పునరుద్ధరణ, పునరావాసం, సబ్ గ్రేడ్ ఖనిజాల నిర్వాహణ, సంస్థాపన, దాతు శుద్ధీకరణ, పర్యవేక్షణ, స్థిరత్వం వాటి పనితీరు ఆధారంగా తనిఖీ బృందాలు వివిధ గనులను విశ్లేషించాయన్నారు. అనంతరం పర్యావరణ నిర్వహణ, ఖనిజ సంరక్షణ రంగంలో విశేష కృషి చేసిన ఉద్యోగులకు పర్యావరణ బంధు, మినరల్ కన్జర్వేషన్ బంధు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొడక్షన్ నాల్ కో బి కె దాస్, ఐబిఎమ్ ఈస్ట్ జోన్ మైన్స్ కంట్రోలర్ వై జి కాలే, ఐబిఎమ్ మైన్స్ ప్రాంతీయ కంట్రోలర్ బి ఎల్ గుర్జార్ తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌ను ప్రారంభించిన దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్‌లో అక్బర్, అసిఫ్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ ఫిట్నెస్ ఫ్రీక్ జిమ్ సెంటర్‌ను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ యువతీ యువకుల శరీర ధృఢత్వం కోసం జిమ్‌లు చాలా అవసరం అని అన్నారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన నూతన జిమ్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్ గౌడ్, యూసుఫ్‌ఖాద్రి, ఇమ్రాన్ అలీ, కల్యాణ్ యాదవ్, సైదులు, ఇస్మాయిల్, ఫాసిల్ ఖాద్రి, పింటు, సలీం, సత్తి, సలీం, అరిఫ్, శ్రీకాంత్ రెడ్డి, నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ - సంతోషనగర్

మలక్‌పేట్ ఏ బ్లాక్ అధ్యక్షులు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఓల్డ్ మలక్‌పేట్‌లోని పోచమ్మ దేవాలయం చౌరస్తాలో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి నెల 35 కోట్లు చొప్పున ఏట 420 కోట్లు అదనంగా చెల్లింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో పీఆర్సీ నోచుకోలేదని విమర్శించారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రేడర్ కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్, మలక్‌పేట్ రేవంత్ రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షులు మొహమ్మద్ సేవా గౌస్, మలక్‌పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ఆకుల రాజు, మలక్‌పేట్ ఏబ్లాక్ కార్యదర్శి రామకృష్ణ, సోమయ్య గౌడ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్క్ నిర్వహణ పట్టించుకోరా..?



పార్కుకు ఎవరో తాళం వేశారు

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ అల్కపురి రోడ్ నెంబర్ -14లో గల పార్క్ నిర్వహణ లేకపోవడంతో దాని ముందు చెత్త వేస్తున్నారు. దీంతో పార్కు అధ్వానంగా మారి దోమలకు నిలయంగా మారింది. పార్కుకు ఎవరో తాళం వేయడంతో కాలనీవాసులు పార్కుకు వెళ్లలేకపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కును అభివృద్ధిలోకి తీసుకురావాలని స్థానికులు కోరారు.

ఎల్బీనగర్
ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో హత్య



నవతెలంగాణ - హయత్ నగర్

ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓ మహిళ హత్యకు గురైన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ట్రాఫిక్ చిల్డ్రెన్స్ పార్క్ ఆవరణలో సుమా రు 30-35 సంవత్సరాల వయ స్సు కలిగిన ఓ మహిళను గొంతు కోసి హత్య చేశారు. ఈ సమా చారం అందుకున్న ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ ఇంచార్జిగా విధులు నిర్వహిస్తున్న సాతు శ్రీరాములు ఘటనాస్థలానికి చేరుకున్నారు. హత్యకు గురైన మహిళను పరిశీలించగా..ఆమె అదే ప్రాంతంలో యాచకురాలిగా ఉంటూ జీవనం సాగిస్తున్నది. ఆమెతో పాటుగా మరో మగ వ్యక్తి యాచకుడిగా కలిసి ఉండేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ విచ్చేసి అక్కడే కొంత దూరంలో పడి ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి ఫూలే వర్ధంతి



నవతెలంగాణ -నాగోల్

భారతదేశ మొట్టమొదటి మహిళా పంతులమ్మగా సావిత్రిబాయి ఫూలేను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించాలని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక యూనియన్ జిల్లా కోశాధికారి గోకమల్ల చైతన్య, సరూర్నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. సావిత్రిబాయి ఫూలే వర్ధంతిని న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో డి రవి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక న్యూ నాగోల్ సీఐటీయూ కమిటీ సభ్యులు ఎండి లతీఫ్, ఎల్ శంకర్, కే చంద్రయ్య, వి సైదులు, ఎం జానకి రాములు, ఎడ్ల రాములు, ఏ శ్రీనివాస్ గౌడ్, అంజి, వెంకటేష, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దు : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - నాగోల్

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నాగోల్ డివిజన్‌లో రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులకు సూచించారు. నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ నుంచి తాజా టిఫిన్స్ వరకు రోడ్లకు ఇరువైపులా వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులకు బండ్లగూడ రామాలయం ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రోడ్డు వెడల్పు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మీకు ఉన్న స్థలంతో పాటుగా అదనంగా మరో 10-15 ఫీట్ల మేర రోడ్డు ఆక్రమించి రేకుల షెడ్డులు వేసుకోవడం వలన నాగోల్ నుండి ఓఆర్ఆర్‌కెళ్లే రోడ్డులో వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని వివరించారు. అందుకే మీరే మీ ఆధీనంలో ఉన్న షెడ్లను తొలగించుకోవాలని కోరారు. రోడ్డును ఆక్రమించుకొని ఉన్న చెట్లను తొలగించడం వలన ప్రజలకు ట్రాఫిక్ నుంచి విముక్తి కలుగుతుందన్నారు. గతంలో ఎన్నికల సమయంలో జీహెచ్ఎంసీ సిబ్బంది రోడ్డు పక్కన వేసుకొని ఉన్న షెడ్లను తొలగిస్తామని ముందుకు వచ్చారని..నేనే వద్దని వారిని సముదాయించినట్టు తెలిపారు. మీరే స్వతహాగా ఆ షెడ్లను తొలగించి, ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, చెరుకు ప్రశాంత్ గౌడ్, సుర్వీ రాజు గౌడ్, సతీశ్, కవిత, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో గల సహభావన టౌన్షిప్ సి బ్లాక్‌లో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలిగే నిరంతర జీవనాధార అవకాశాలను స్వయంగా నిర్మించుకోగలిగే ఉన్నత స్థితికి చేరుకోవాలని, స్త్రీ శక్తి ఏంటో ప్రపంచానికి చాటిచెప్పాలని అన్నారు. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ.. మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్, సహభావన టౌన్ షిప్ సి బ్లాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్ 1, 2, 3 పోస్టులు పెంచాలని నిరసన



నవతెలంగాణ - చైతన్యపురి

జీవో 46ను రద్దుచేసి, గ్రూప్ 1, 2, 3 పోస్టులు పెంచాలని కోరుతూ నిరుద్యోగులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఖాళీలు ఉన్నా కానీ ప్రభుత్వం తక్కువ పోస్టులను భర్తీ చేస్తుందని ఆరోపించారు. వెంటనే ఎక్కువ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. డీఎస్సీ పోస్టులను పెంచాలని, గురుకుల రిక్రూట్మెంట్‌ను అవరోహణ క్రమంలో చేయాలన్నారు. నిరసనలో పాల్గొన్న అశోక్‌ను అరెస్టు చేశారని, వెంటనే ఆయనను రిలీజ్ చేయాలని అన్నారు. మొన్న రిలీజ్ అయిన నోటిఫికేషన్‌లో 1600 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉంటే..కేవలం 182 పోస్టులు చూపించడం ఎంతవరకు కరెక్టు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పరిశీలించి, పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు.

జమ్మిగడ్డలో 93వ వారం జ్ఞానమాల కార్యక్రమం

- జ్ఞానమాల సమర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ ఆదివారంతో జ్ఞానమాల కార్యక్రమం 93వ వారానికి చేరింది. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు రహీం, నర్సింహ్మాచారి నరేందర్ రావు , నాగేష్ , మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షు, కార్యదర్శులు కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి మహిళా అధ్యక్షురాలు శిరీషారెడ్డి, ఆనంద్ చారి, శేఖర్, బాలరాజు ఉన్నారు.

మహిళలకు ఉచితంగా సరుకులు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ పండగను పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ నాయకులు బద్రుద్దీన్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కలర్స్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మహ్మద్ అలీ, ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డిలు హాజరై నిరుపేద మహిళలకు ఉచితంగా సరకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, తదితరులున్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు అవసరం



- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

సీనియర్ సిటిజన్స్ సేవలు నగరానికి ఎంతో అవసరమని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంటకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలలో సీనియర్ సిటీజన్స్ ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ మద్ది యుగేందర్‌రెడ్డి, అంతరా ్జతీయ క్యారమ్స్ క్రీడాకారుడు కే.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటీజన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించడం చాలా గొప్ప కార్యక్రమం అన్నారు. ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. ఇలాంటి పోటీలు మరెన్నో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి.నర్సిరెడ్డి, జనరల్ సెక్రటరీ పి.రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సధానంద్, సావిత్రి, నాయకులు ఏనుగు మనోరంజన్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-కాప్రా

మహాశివరాత్రి సందర్భంగా మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. రెండు రోజులుగా చాందిని (సర్కిల్) మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో 36 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో శాంతి యూత్ క్లబ్ జట్టు, కల్యాణ్ బాయ్స్ జట్టు తలపడగా కల్యాణ్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. వారికి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నెమలి అనీల్ ట్రోఫీతో పాటు రూ.15వేల నగదు అందజేశారు. రన్నర్ జట్టు శాంతి యూత్ క్లబ్‌కు రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి యూత్ క్లబ్ సలహాదారులు పైళ్ల ప్రవీణ్, నాగరాజు, నిర్వాహకులు కోయలకొండ రాజేష్, మెండ రఘు, శశి, మెహ్రాజ్, కిశోర్, మహేందర్, శ్రీశైలం, పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో సావిత్రిబాయి ఫూలే వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలా నగర్ ఆఫీసులో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మహిళా ఉద్యమ నాయకురాలు శారద, సైన్స్ ఉద్యమ నాయకురాలు జెన్నీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రముఖ విద్యావేత్త కర్రె మల్లేశం మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే సంఘసంస్కర్త, అణగారిన వర్గాల పిల్లలకు, అందులోనూ ఆడపిల్లలకు చదువు చెప్పారని తెలిపారు. నాడు ఆడపిల్లలకు చదువు చెప్పితే అనాచారంగా భావించే దశలో తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో ఇంగ్లీష్ విద్య నేర్చుకొని బాలికల కోసం అనేక పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వితంతువులైన మహిళలకు ఆసరాగా నిలిచి వారి పిల్లలకు చదువులు చెప్పించే విధంగా సమాజ సేవ చేశారని పేర్కొన్నారు. ఆమె మరణించి 127 ఏండ్లు అయినప్పటికీ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భర్తను అనుసరిస్తూ సామాజిక సేవలో ముందున్నారని తెలిపారు. ప్రముఖ విద్యావేత్త జయప్రకాష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చేసిన కృషి నేటి సమాజంలో చైతన్యం తెచ్చిందన్నారు. అనంతరం సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు, సైన్స్ ఉద్యమ నాయకులు రామ్మోహన్ రావు, ప్రముఖ విద్యావేత్త నాగయ్య సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు, శివన్నారాయణ, శివప్రసాద్, శారద జెన్నీ, దుర్గాచారి, నరసింహారావు తదితరులు ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ సుబ్బారావు, అండాలి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, లక్ష్మయ్య, ప్రసాద్ బాబు, జయరాజ్, జయప్రకాష్, శివన్నారాయణ, నాగయ్య, నరసింహారావు, దుర్గా చారి,నరసింహ, శంకరయ్య పాల్గొన్నారు.

న్యూ నర్సింహా నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని న్యూ నర్సింహానగర్ కాలనీలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రయినేజీ ఓవర్ ఫ్లో, మంచినీటి సరఫరా సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో నెలకొన్న డ్రయినేజీ ఓవర్ ఫ్లో సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, కాలనీ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, రమేష్ గౌడ్, సంతోష్, రాము తదితరులున్నారు.

కమ్యూనిటీ హాల్ షెడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని జీఆర్ రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన షెడ్డును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఆర్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామరా వు, పావనీరెడ్డి, మహిపాల్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సామ శివారెడ్డి, జనరల్ సెక్రటరీ జగన్మోహన్‌రావు, మహిళా ప్రెసిడెంట్ శిరీషారెడ్డి, బాలరాజు, తిరుమలయ్య, మణెమ్మ, లక్ష్మీనారాయణ , తిరుమలయ్య, మణెమ్మ శీను, మురళీ పంతుల ఉన్నారు.

స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులకు కేస్ స్టడీగా హైదరాబాద్ మెట్రో

- ఇది అరుదైన గౌరవం : ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుల విజయగాథను ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ప్రాక్టీషనర్లకు ఒక కేస్ స్టడీగా ఆ సంస్థ ప్రచురించే స్టాన్‌ఫోర్డ్ సోషల్ ఇన్నోవేషన్ రివ్యూ(ఎస్ఎస్ఐఆర్) తాజా సంచికలో(స్ప్రింగ్ 2024) ప్రచురించింది. ఇది ఒక భారతీయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుకు దక్కిన అరుదైన గౌరవంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అభివర్ణిం చింది. ప్రపంచంలో చేపట్టిన పలు భారీ ప్రాజెక్టుల అమలు లో ఎదురయ్యే అనేక సమస్యలు, వాటిని అధిగమించడా నికి కావాల్సిన నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై తగిన సూచనలు, పరిష్కార మార్గాలను ఈ త్రైమాసిక జర్న ల్ అందజేస్తుంది. ప్రపంచం మొత్తంలో ఉన్న అనేక ప్రాజె క్టుల విస్తృత అధ్యయనాల పోటీ నడుమ ఐఎస్‌బీ మేనేజ్ మెంట్ ప్రొఫెసర్ రామ్ నిడుమోలు, ఆయన బృందం హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై క్షుణంగా జరిపిన అధ్యయనాన్ని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం కేస్‌స్టడీగా ఎన్నుకొని ప్రచురించింది. పీపీపీ విధానంలో చేపట్టిన మెట్రో రైల్ ప్రాజెక్టు విజయవంతం కావడంలో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బృందం అసాధారణ నాయకత్వ ప్రతిభను కనబర్చారని ఈ అధ్యయనంలో పేర్కొన్నారు. ప్రప్రథమంగా మేటాస్ కన్సార్టియం వైఫల్యం, అనేక ప్రజా ఆందోళనలు, సామాజిక, రాజకీయ, మతపరమైన సున్నిత అంశాలపై ఎన్నో సవాళ్లు, అనేక కోర్టు కేసులు ఈ ప్రాజెక్టు ఎదుర్కొన్నదని వారు వివరించారు. ఒక సందర్భంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యం అనుకున్నదాన్ని సుసాధ్యం చేసిన ఘనత ఈ సంస్థ ఎండీకి దక్కుతుందని వారు తమ అధ్యయనంలో పేర్కొన్నారు. ప్రాజెక్టుని వ్యతిరేకించిన వారే, ఆ దరిమిలా గొప్ప మద్దతుదారులుగా మారారని, చివరిగా వారు ప్రాజెక్టుని విజయపథంలో నడిపించారని, ఇది వీరి పటిమకు నిదర్శనమని ఈ కేస్ స్టడీ తెలియజేసిం ది. ప్రాజెక్ట్ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాయితీదారు, రుణాలిచ్చే బ్యాంకులు, పలు ప్రయివేట్ ఆస్తుల యజమానులు, వర్తక, వ్యాపార, హాకర్ల సంఘాలు, సామాజిక, మత పరమైన సంస్థలు-వారివారి వ్యక్తిగత ప్రయోజనాలు, ఆంకాంక్షలను పరిరక్షిస్తూన్.. మెట్రో ఎండీ ఈ ప్రాజెక్టు విజయానికి కారకులయ్యారని అధ్యయనంలో పేర్కొంది. ఎన్వీఎస్ రెడ్డి ఒక సాధారణ ప్రభుత్వ అధికారిలా వ్యవహరించలేదని, ప్రాజెక్టు విజయవంతమే తమ లక్ష్యంగా ఒక అంత్రప్రెన్యూర్‌గా పనిచేశారని పేర్కొన్నారు. అయన ఈ ప్రాజెక్ట్ పట్ల అభిరుచి, నిబద్ధతతో పాటు, కలుపుగోరుతనం, స్పష్టమైన సమాచారంతో గొప్ప ప్రతిభ కనబరిచాడని ఈ అధ్యయనం ప్రశంసించింది. ప్రయివేట్ రంగ మూలధనం, వనరుల వినియోగం ద్వారా ప్రజా ప్రయోజనాల కోసం భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల ఎలా నిర్మించాలో మేనేజ్‌మెంట్ ప్రాక్టీషనర్లు హైదరాబాద్ మెట్రో అనుభవం నుంచి ఎంతో నేర్చుకోవచ్చని సూచించింది. పత్రికా ప్రతినిధుల నుంచి సమాజంలోని అన్నివర్గాల వారి సహకారంతో సామాజిక ప్రగతి ఎలా సాధించవచ్చునో ఈ ప్రాజెక్టు తెలియజేస్తోందని తెలిపింది. హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందుతున్న తరుణంలో నగర విస్తరణలో మెట్రో రైలు కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదని, ప్రయివేట్ పెట్టుబడులతో ప్రజాప్రయోజన ప్రాజెక్టుల నిర్మాణం ఏవిధంగా సాధ్యమో ఈ ప్రాజెక్టు ద్వారా అవగతమవుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. పీపీపీ విధానంలో చేపట్టిన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దదని, స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులకు కేస్ స్టడీగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు విజయగాథ ఎంపిక కావడం చాలా సంతోషమని, ఇది తమకు మరో అరుదైన గౌరవమని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ డీమార్ట్ వద్ద పోచమ్మ గుడిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోచమ్మ తల్లి దీవెనలతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా అమ్మవారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా బన్నాల

- పులువురి అభినందనలు



నవతెలంగాణ-ఉప్పల్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను డివిజన్‌లోని హై కోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం శాలువాతో సత్కరించారు. కేక్ కట్ చేయించి శుభాకాంశాలు తెలిపారు. అనంతరం బన్నాల గీత మాట్లాడుతూ.. నేను నాయకురాలిని కాదు.. ప్రజా సేవకురాలిని అని పేర్కొన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదనీ, ప్రజా సేవే లక్ష్యమన్నారు. కార్పొరేటర్‌గా అవకాశం కల్పించిన డివిజన్ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి మూడేండ్లలో సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో హై కోర్టు కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కె. కేశవ్‌రావు, మధుసూదన్ రాజు, సభ్యులు అంజిరెడ్డి, సీతారాం, యోగేంద్రరెడ్డి, సద్గుణ, అరుణ, సరోజ, చంద్రిక, జోత్స్న, పుష్పలత, ముగ్ధ, నవీన, లావణ్య, తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇండ్లల్లో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలి



- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేందర్

నవతెలంగాణ-ఉప్పల్

ఇందిరమ్మ ఇండ్లల్లో రజకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేందర్ అన్నారు. ఆదివారం కల్యాణపురి, బీరప్పగడ్డ, పార్కులో జిల్లా అధ్యక్షురాలు సౌడారం సుభద్ర అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రజకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 50 ఏండ్లు నిండిన వారికి రూ.3వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. వృత్తి చేస్తూ అనారోగ్యంతో చనిపోతే రూ.10 లక్షల బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మి, ఉమా, కోశాధికారి, సట్టురవి, జిల్లా సహాయ కార్యదర్శి, పెద్దాపురం భాస్కర్, జిల్లా నాయకులు బాలరాజు, స్వామి, లింగం, ఎన్. రమేష్, ఈశ్వర్, సదానంద్, రమేష్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-కాప్రా

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వ సుజాత గుప్తా, కాంగ్రెస్ కొడంగల్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. అనంతరం కుషాయిగూడకు చెందిన మాలే వరమ్మకు ఈనెల పెన్షన్ రూ.1000 అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంపా కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గం సభ్యులు ఉన్నారు.

వసంతపురి కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వసంతపురి కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరి స్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం వసంతపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. వర్షాకాలం రాక ముందే బండ చెరువు నుంచి వసంతపురి కాలనీ వరకు ఉన్న ఓపెన్ నాలా యూజీడీలను క్లీన్ చేయించాలని కోరారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అసోసియేషన్ ఆఫీసును పునర్ నిర్మాణం చేసి చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. వీధి కుక్కల బెడదను నివారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు 6 గ్యారంటీలు అర్హులైన పేదలకు అందేలా కృషి చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు ఎం.ఎస్.ఆర్. ప్రసాద్, పి.నారాయణ రెడ్డి, బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మురళీధర్‌రావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృపాసాగర్, చైర్మెన్ మురళీ, అధ్యక్షులు ఆర్.రమేష్, కోశాధికారి లక్ష్మణ్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ వలీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు భిక్షపతి గౌడ్, మును స్వామి, బ్రహ్మచారి, ప్రచార కార్యదర్శులు ప్రసన్న కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు విశ్వనాథం, రాజేశ్వర్‌గౌడ్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి డివిజన్ అభివృద్ధే ధ్యేయం

- కార్పొరేటర్ శ్రవణ్ కుమార్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయమని కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని కృపా ఆనంద్ అపార్ట్‌మెంట్ వద్ద రూ.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అరుణ, శేఖర్, అశ్విన్ కుమార్, దీప, రవి, రమణ, జగదీశ్, గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



- సాయి శ్రీ నిలయ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని చెక్ పోస్ట్ పారిశ్రామిక వాడలోని సాయి శ్రీనిలయ వెల్ఫేర్ సొసైటీలో పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు కోరారు. ఆదివారం పార్కు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, సలహాదారు పీవీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. సాయి శ్రీ నిలయం పేరుతో 2013లో గ్రామ పంచాయతీ అనుమతులతో వెంచర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 256 ప్లాట్లు ఉండగా 120 మంది ప్లాట్ల కొనుగోలు దారులతో పాటు 30 మంది అద్దెదారులున్నారు. కాగా వెంచర్ నిర్వాకులు సర్వే నంబర్ 882, 873లో పార్కు కోసం 1970 గజాల స్థలాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇటీవల కొందరు భూ కబ్జాదారులు 400 గజాల పార్కుల స్థలంలో ప్రీకాస్ట్ వాల్ నిర్మించి కబ్జాకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనే మున్సిపల్ అధికారులకు పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. చిన్నారులు ఆడుకోవడానికి, వృద్ధులు, మహిళలు సేద తీరడానికి వీలుగా ఉండే పార్కును కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్కు స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేస్తాం
-వెంచర్ డెవలపర్స్

సాయి శ్రీ నిలయంలోని వెంచర్‌లో 1570 గజాల స్థలాన్ని మాత్రమే పార్కుకు కేటాయించామని వెంచర్ డెవలపర్స్ వారు తెలిపారు. త్వరలోనే అట్టి పార్కు స్థలాన్ని మున్సిపాలిటీకి గిఫ్ట్ డిడ్, రిజిస్ట్రేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం మున్సిపాలిటీకి అప్పగిస్తామని వివరణ ఇచ్చారు.

డీ.ఎస్.ఎల్ వర్చు మాల్‌లో 5కే రన్



నవతెలంగాణ-ఉప్పల్

రన్ ఫర్ షీ.. అనే పేరుతో డీ.ఎస్.ఎల్ వర్చు మాల్, ఉప్పల్ రన్నర్స్, ఉప్పల్ గేమ్ పాయింట్ మరో మూడు ప్రయివేట్ సంస్థలు కలిసి 5కే రన్ ఆదివారం నిర్వహించారు. 5కే రన్ నిర్వహించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ రన్నర్స్ ప్రతినిధి రవి, శ్రీనివాస్, డీఎస్ఎల్ మాల్ రిప్రజెంటిటీ రవీందర్ రెడ్డి, మెహమ్మూదా, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రన్నర్స్ పాల్గొన్నారు. డీఎస్ఎల్ మాల్ నుంచి ఉప్పల్ క్రికెట్ స్టేడియం జెన్ ప్యాక్ మీదుగా రన్ నిర్వహించారు.

ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్వామివారికి వేదపండితులు అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, వసంతోత్సవం, పుష్పాయాగం పూజలో ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలతో జాతర కళ కళ

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం గ్రామీణ ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో జాతర కళ సంతరించుకుంది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం చెట్ల కింద వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో గడిపారు.

స్వామివారిని దర్శించుకున్న డీఎల్‌పీవో

కీసరగుట్ట స్వామివారిని డివిజనల్ పంచాయతీ అధికారి సాంబిరెడ్డి, ఎంపీవో విన్యూత్నరెడ్డి దర్శించుకున్నారు. వారిని ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ సన్మానించారు.

'జాతీయ సమైక్యత సదస్సు'కు తరలిన విద్యార్థులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వివిధ కళాశాల చెందిన 10 మంది విద్యార్థులు బృందం హర్యానాలో జరగబోయే 'జాతీయ సమైక్యత సదస్సు'కు బయలుదేరారు. ఈ బృందానికి తెలంగాణ కాంటిజెంట్ లీడర్‌గా మల్కాజిగిరి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఎస్.జగన్ వ్యవహరిస్తారు. ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు ఈ జాతీయ సదస్సు నిర్వహించనున్నా రు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల్లోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులు పాల్గొననున్నారు. తెలంగాణ నుంచి వెళ్లిన 10 మంది బృందాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆఫీసర్ ప్రొఫెసర్ సవిన్ సౌద అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కళారూపంలో ఆటపాట, మాటలు ప్రదర్శించి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

బాటసారుల కోసం చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-కీసర

బాటసారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని నాగారం మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి అన్నారు. వేసవి కాలంలో పాదాచారుల దాహర్తి తీర్చడం కోసం నాగారం మున్సిపాలిటీ ఎస్వీ నగర్ ప్రధాన రహదారిలో శ్రీసాయి మినీ గ్రాండ్ కన్వెన్షన్ యజమాని ఎనిశెట్టి చంద్రమౌళి గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. బాటసారుల కోసం చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త గోపాల్ రెడ్డి, పైళ్ల మల్లారెడ్డి, కొమిరెల్లి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి సతీష్ రెడ్డి, సింగారం ఆంజనేయులు, వీరారెడ్డి, వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి, రమణనాయక్, బద్రినాథ్, నర్సింహ ముదిరాజ్, బాషా, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

యోగా మాస్టర్‌ను అభినందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని షాపూర్ నగర్‌కు చెందిన శివ శక్తి ధ్యాన యోగా మాస్టర్ పూర్ణ సాయి ఆదివారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జనవరిలో తమిళ నాడులో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ యోగాసన లీగ్ సౌత్‌జోన్ పోటీలకు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ నిర్ణేతగా తెలంగాణ నుండి వెళ్లారు. తక్కువ వయసులో వెళ్లిన పూర్ణ సాయిని ఎమ్మెల్సీ అభినందించారు.

ప్రయోగాత్మక చిత్రం గామికి విశేష స్పందన



నవతెలంగాణ-ముషీరాబాద్

గామి చిత్రం ఒక ప్రయోగాత్మక చిత్రమని ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంటుందని యువ హీరో విశ్వక్ సేన తెలిపారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని సంధ్య థియేటర్‌లో దర్శకుడు విద్యాధర్ కాగిత, నిర్మాత కార్తీక్ తో కలిసి ప్రేక్షకుల మధ్య హీరో విశ్వక్ సేన సినిమాలు చూశారు. ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన మాట్లాడుతూ గామీ చిత్రం ఒక ప్రయోగాత్మక చిత్రమని కొత్త జోనర్‌లో నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. థియేటర్‌లో ప్రతి ఒక్కరు సినిమాను చూస్తూ తనను అభినందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ఇంత మంచి సినిమాను అందించిన దర్శకుడు విద్యాధర్ కాగిత, నిర్మాత కార్తికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎనలేని ప్రేమను చూపిస్తున్న ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు ఎప్పుడు ప్రేక్షకులు నచ్చే విధంగా సినిమాలు తీస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మనందరి బాధ్యత



● కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ,ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ఎమ్ఎల్ఎన్ గార్డెన్స్‌లో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం రోజున నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలందరిని కార్పొరేటర్ సన్మానించి, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిగా లాలిస్తు, చెల్లిగా తోడుంటూ భార్యగా బాగోగులు చూస్తు, దాసిలా పనిచేస్తు కుటుంబ భారాన్ని మోస్తున్న మహిళలందరికీ పాదాభివందనాలు తెలియచేశారు. నేటి కాలంలోని మహిళలు విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, అంతరిక్షం, వంటి అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. మహిళలను గౌరవించడం ప్రతీఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ఇంత అభివృద్ధి చెందిన ఆధునిక సమాజంలో కూడా ఇంకా మహిళలను చిన్న చూపు చూస్తూ, కించపరుస్తూ, వారి మీద అఘాయిత్యాలు చేస్తున్న మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని అన్నారు. విధిరాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్నారు. వారందరిని స్మరించుకుంటూ స్త్రీ మూర్తులందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మా రెడ్డి,గౌరవాధ్యక్షుడు అనిల్ రెడ్డి,శివరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతి శీల హెూమ్ అపార్టుమెంట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్లు కాలేరు పద్మా వెంకటేష్, గరిగంటి శ్రీదేవి రమేష్, ఈ కార్యక్రమంలో అపార్మెంట్ వాసులు శివకుమారి, లంక సీత, శిరీష,రజిని, సరస్వతి, సరళ, సీత, వందన, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



కిషన్‌బాగ్‌లోని గురు నానక్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్వెల్ డేలో ప్రతిభను కనబరచిన విద్యార్థిని సత్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర గురుద్వారాల అధ్యక్షుడు గురు చరణ్ సింగ్ బగ్గా. సిక్ హెరిటేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు సర్దార్ ప్రీతం సింగ్, సిక్ హెరిటేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ నాయకులు బందర్ సింగ్, దర్శన్ సింగ్ ఇక్బాల్ సింగ్, డాక్టర్ సర్జన్‌సింగ్‌తో పాటు ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్, ఉపాధ్యాయ బృందం..

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సంక్షేమం కోసం అవసరమైతే నిరాహార దీక్షకు సిద్ధం



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజా సంక్షేమం కోసం అవసరమైతే నిరాహార దీక్ష చేయడానికైనా సిద్ధమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయం వద్ద కూకట్‌పల్లి డివిజన్ ప్రజలు, అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు అఖండ మెజార్టీ అందించి విజయం అందించిన సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ మూడవసారి భారీ మెజారిటీ అందించిన ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానని, గత 10 ఏళ్ల నుంచి ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల విషయంలో, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తానని అలాగే ఎప్పటికప్పుడు అధికా రులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వేసవి వచ్చిందం టే మంచినీటి కొరత రాకుండా చూసుకున్నామన్నారు. కానీ నేడు రాజకీయాలపై దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగేలా జరుగుతుందని, పదేళ్ల కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి కొరత లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లారని గుర్తు చేశారు. అయినా కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేను ముందు ఉంటానని దీనికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే నిరాహార దీక్షకు సిద్ధమని కూడా తెలిపారు. ఇప్పటికే ప్రారంభించిన పనులు పెండింగ్‌లో పడిపోయాయని రోడ్లు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు సంతోష్, మాజీ కార్పొరేటర్ వెంగళరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్ రెడ్డి నగర్ వాసులు వివేకానందనగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో ఆలయ నిర్మాణ నమూనను పరిశీలించారు. అనంతరం ఆలయ నిర్మాణ శైలి తదితర అంశాలపై చర్చించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయం అందించడానికి ముందుకు వచ్చిన కపిల్ గుప్తా దంపతులను శాలువాతో సత్కరించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ బాకీ, దత్తు, సాగర్, రాంరెడ్డి, విష్ణు, శ్రీనివాస్, రాంచందర్, లింగం, గోపాలకృష్ణ, శివ, శేషగిరి చారి, శ్రీనివాస్, రాజు చారి, విజయ భవాని, శిల్పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి..

● కుల్సుంపుర ఇన్‌స్పెక్టర్ రామస్వామి

నవతెలంగాణ-ధూల్‌పేట్

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని కుల్సుంపుర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ బి.రామస్వామి అన్నారు. ఇటీవల ఇక్కడ విధులు నిర్వహించిన అశోక్ కుమార్ బదిలీపై వెళ్లడంతో గద్వాల్‌లో ఇన్ స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి ఊరేగింపులు కొనసాగినా శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా చూస్తామన్నారు. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపడంతో పాటు వారి కదలికలను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తామన్నారు.

తూము వినయ్ కుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగామూసాపేట్, లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ ఎదురు సుజాత కాంప్లెక్స్ వద్ద తూము వినయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ చైర్మెన్ (ఓబీసీ) ఆధ్వర్యంలో, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులంచారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సమాజానికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు స్మరించుకోవడం జరిగింది. కూకట్ పల్లి మూసాపేట్ మాజీ సర్పంచ్ తూమ్ శ్రీనివాస్ రావు తనయుడు, తూమ్ వినయ్ కుమార్ రాజకీయ అరంగేట్రం చేసినందుకు అభినందనలు తెలియజేస్తూ, వారికి రాజకీయంగా భవిష్యత్తులో మంచి ఉన్నతమైన స్థాయిలో ఉండాలని, స్థానిక నాయకులు కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ వికాస్ సమితి రాష్ట్ర అధ్యక్షులు బాశెట్టి నర్సింగ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, ఎలారావు, కర్క పెంటయ్య, ఎల్లేష్, బానాల వెంకటేష్, బింగి రము, మహేష్, యాకయ్య అవినాష్, శ్రీకాంత్, కుమార్, సంతోష్, బాబు టింకు, జోరాపురి అశోక్, నియోజకవర్గంనికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు స్థానిక బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

త్రిమూర్తి శివ్ 88వ జయంతి



నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్ పల్లి జీహెచ్ఎంసీ సర్కిల్, వివేకానంద నగర్ కాలనీ డివిజన్ లోని, రాజయోగ మెడిటేషన్ సెంటర్ (ఓం శాంతి)లో ఆదివారం త్రిమూర్తి శివ్ 88వ జయంతి సందర్భంగా బికే సరోజినీ బహెన్ ఆధ్వరంలో ఓంశాంతి పతాకాన్ని ఆవిష్కరించి జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, శేరిలింగంపల్లి నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కూకట్‌పల్లి సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, సుదర్శన్ మేకల, కల్పన గౌడ్, బాషుపాక యాదగిరి, జ్యోతి బహెన్, కల్పన బహెన్, పద్మ బహెన్, విద్య బహెన్ పాల్గొన్నారు.

ట్రస్మా కూకట్ పల్లి మండలం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కూకట్ పల్లి

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ట్రస్మా) కూకట్ పల్లి మండలంకు శనివారం జరిగిన ఎన్నికల్లో, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు సూచించిన ఎన్నికల నియమావళి ప్రకారం జరగనందున 60 మంది సభ్యుల సమక్షంలో కూకట్‌పల్లి మండలానికి నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యవర్గంలో మండల చైర్మెన్, సలహాదారు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకోవడం జరిగిందనీ నూతన కార్యవర్గ సభ్యులు తెలియజేశారు. నూతన కార్యవర్గంలో కూకట్‌పల్లి మండల ట్రస్మా చైర్మెన్‌గా సురభి రవీందర్‌రావు, సలహాదారుగా గుందడి అశోక్, అధ్యక్షులుగా డొల్ల మల్లేష్ ప్రధాన కార్యదర్శి యాద నరేందర్, కోశాధికారి చింతలగారి వెంకటస్వామి ఎన్నుకోవడం జరిగిందన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకోలేనిదని వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఆది వారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానందని మర్యాద పూర్వకంగా కలిసి గత పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, కాలనీని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయాలని కోరగా... పలు శుభ కార్యాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలు, మరికొందరు కాలనీలలో నెలకొని ఉన్న సమస్యలపై వినతి పత్రాలు అంద జేశారు. దీంతో ఆయన ప్రతి ఒక్కరి సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో దాదాపు అన్ని కాలనీలలో పనులు పూర్తయ్యాయని, అసంపూర్తిగా మిగిలిపోయి న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులు చేపడతామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని వాటిని పరిష్కరిస్తానన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సావిత్రిబాయిపూలే చిత్రపటానికి కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని మహిళల హక్కులు, విద్య కోసం అంకితం చేసిందన్నారు. బాల్య వివాహాలు, కుల వివక్ష వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా కూడా ఆమె పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కోఆర్డినేటర్లు కొల్లా శంకర్ ,వేముల మహేష్ కలిగినిడి ,ప్రసాద్ ,అంజి సత్యసాయి, అన్నపురెడ్డి వెంకటస్వామి ,నా మన బుల్లి రాజు ,ఆవుల రంగబాబు, బండారు వెంకటేష్ ,వెంకటేశ్వంరావు , పులగం సుబ్బు , శేఖర్, కిరణ్ , తోట మురళి , సంపత్ కుమార్ , సిద్ధార్థ , బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా మేడ్చెల్ జిల్లా కమిటీ నియామకం



నవతెలంగాణ-కూకట్ పల్లి

ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి పర్యవేక్షణలో, ఆదివారం మేడ్చల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుంజడి అశోక్, కోశాధికారి కందునూరి పరశురామ్ గౌడ్ లు 2024-26 గాను ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ ఎన్నికలలో ఎలక్షన్ ఆఫీసర్గా ట్రస్మా స్టేట్ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావు , అబ్జర్వ్‌గా కే.ఇన్నారెడ్డి వ్యవహరించారు.

ఈ ఎన్నికలలో జిల్లా వ్యాప్తంగా సుమారు 268 మంది పాఠశాల కరస్పాండెంట్స్, అన్ని మండ లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ,కోశాధికా రులతో పాటుగా రాష్ట్ర సీనియర్ నాయకులు నల్లా భాస్కర్ రెడ్డి, భీష్మా రెడ్డి, రామకృష్ణ , సురభి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా

● కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే కేపీ వివేకానంద



నవతెలంగాణ దుండిగల్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఆదివారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మర్యాద పూర్వకంగా కలిసి గత పదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి జరిగిందని కాలనీని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయాలని కోరగా, మరికొందరు కాలనీలలో నెలకొని ఉన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అదేవిధంగా పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు.

మహిళాలు అన్ని రంగాల్లో రాణించాలి



● జగద్గిరిగుట్ట ఎస్‌హెచ్‌ఓ క్రాంతి కుమార్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీలో ఎస్వైకె కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం ఆల్విన్ కాలనీలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది, ఆశా వర్కర్‌లు, సమాజసేవ చేస్తున్న మహిళలను సన్మానం చేసి గౌరవించుకునే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జగద్గిరిగుట్ట సిఐ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) క్రాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ సర్వీస్ చేసే మహిళల్ని గౌరవించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కుమార్ యాదవ్ ను అభినందిస్తున్నానన్నారు. అలాగే మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించాలని, చదువుకునే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పిల్లల కోసం సమయం కేటాయించి పిల్లల నడవడికను గమనిస్తు, దురలవాట్ల దరికి చేరకుండా, సన్మార్గంలో నడిచే విధంగా క్రమశిక్షణ నేర్పుతూ, వారి భవిష్యత్తుకి పునాది వేయాలన్నారు. అడ్వకేట్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళ సాధించలేనిదంటు ఏమీ ఉండదని మహిళా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుం దన్నారు. చట్టసభలలో 33% మహిళలకు అవకాశాన్ని కల్పించి మహిళల గౌరవాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ మరింత పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో బాలమిత్ర స్కూల్ కరస్పాండెంట్ ప్రత్యూష, సెన్సార్ బోర్డు సభ్యురాలు స్రవంతి, మహిళా నాయకురాళ్లు ద్రాక్షాయిని, శ్యామల, స్రవంతి, జ్యోతి, అనూష, అనిత, మునిషా, సత్య మరియు జిహెచ్ఎంసి సిబ్బంది, ఆశ వర్కర్లు, కమలాకర్ రెడ్డి, ఆర్‌కే చారి, శ్రీకాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

బస్తీలలో మరింత అభివృద్ధి చేపడతా

● ఎమ్మెల్యే కేపీ.వివేకానందకి ధన్యవాదాలు తెలియజేసిన పాపిరెడ్డి నగర్, దేవమ్మ బస్తీ వాసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 126 - జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్ ఆధ్వర్యంలో డివిజన్ కు చెందిన పాపిరెడ్డి నగర్, దేవమ్మ బస్తీ వాసులు ఎమ్మెల్యే కేపీ.వివేకానందని కలిసి కాలనీలలో ఎప్పటి నుంచో ఉన్నటి వంటి భూగర్భ డ్రైనేజీ సమస్యను తీర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మౌలిక వసతులలో భాగంగా కాలనీలలో సీసీ రోడ్డు పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనీ అన్ని బస్తీలు, కాలనీలలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో పాపిరెడ్డి నగర్, దేవమ్మ బస్తీలలో మరింత అభివృద్ధి చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తేరాల శ్రీనివాస్, అంజయ్య, వీరాచారి, సతీష్, రాములు గౌడ్, కుమార్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లాక్రోజ్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



తెలంగాణ లాక్రోజ్ అసోషియేషన్ రాష్ట్రస్థాయి మొదటి వర్క్ షాప్ సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా ప్రవేశపెట్టిన లాక్రోజ్ రాష్ట్ర స్థాయి పోటీలలో షాపూర్ నగర్‌కు చెందిన క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు లాక్రోజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనపరిచారు. రాష్ట్రంలోనే మొదట లాక్రోజ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులుగా క్యాపిటల్ విద్యార్థులు నిలిచారు. రానున్న 2028 లో జరగనున్న ఒలంపిక్స్ గేమ్స్ లో లాక్రోజ్ ఆట ఉండటం పట్ల, రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులకు లాక్రోజ్ ఆటోలో ప్రావీణ్యం ఇస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని లాక్రోజ్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ డా.పి. భువన ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీమతి కె. మాధవీ లత, చైర్‌పర్సన్ లాథమ్ ఫౌండేషన్ పాల్గొనగా ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా క్యాలిటన్ డిగ్రీ,పీజీకళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ శ్రీమతి. తాటిచెర్ల హేమలత పాల్గొని మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన క్రీడల పట్ల తమ విద్యార్థులకు ఉన్నటువంటి ప్రతిభను గుర్తించి రాబోయే రోజుల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులను జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే వారిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందినటువంటి ప్రముఖులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అనంతరం తెలంగాణ ఒలంపిక్స్ ప్రెసిడెంట్ సముద్రాల వేణుగోపాల్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుంది

● కార్పొరేటర్ పి విజయరెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద బడుగు వర్గాల ప్రజలకు కార్మికులకు అండగా ఉండే ప్రభుత్వమని ఇచ్చిన ప్రతి హమీనీ తూచా తప్పకుండా అమలు చేసే ప్రభుత్వమని కార్పొరేటర్ పి.విజయ రెడ్డి అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గం లోని సోమాజిగూడ డివిజన్ పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ బస్టాండ్ వద్ద రేవంత్ రెడ్డి,ఆర్టీసీ కార్మికులకు 21 శాతం ఫిట్మెంట్ ప్రకటించినందుకూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆర్టీసీ కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు బి శ్రీనివాస్ యాదవ్,సోమాజిగూడ డివిజన్ అధ్యక్షులు నరేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్ప డిన కఠిన చర్యలు తీసుకుంటామని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధు సూదన్ రెడ్డి తెలిపారు. జరగబోయే ఎంపి పార్లమెంట్ ఎలక్షన్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా చూసు కుంటామని, ఎవరైన అటువంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసు కుం టామ న్నారు. ఆదివారం సిఐఎస్ఎఫ్ ప్రత్యేక పోలీస్ అధికారులు , సిబ్బ ంది మధుర నగర్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి స్థానిక వీధులలో తిరుగుతూ, ప్రజలకు, పోలీసులకు ఎన్నికల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో 'భారత్ జోడో న్యాయ్ మారథాన్'



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం భారత్ జోడో న్యాయ్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు మొహమ్మద్ అజారుద్దిన్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడు న్యాయ మారథాన్ యాత్ర, దేశంలో మార్పు తీసుకుని వస్తుందని మహిళలు యువకులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారని, భారత దేశ ప్రధానిగా రాహుల్‌ని కావాలని కోరుకుం టు న్నా రన్నారు. ఈరోజు నిర్వహించిన కార్యక్రమానికి కాం గ్రెస్ యూత్ నాయకులు, మహిళలు ,విద్యార్థులు భారీగా తరలి వచ్చినందుకు, యాత్రను జయప్రదం చేసినందుకు నవీన్ యాదవ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కృష్ణకాంత్ పార్క్ నుండి కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం వరకు, మొహ మ్మద్ అసదుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాం గ్రెస్ అధ్యక్షులు శివ సేన రెడ్డి , జిల్లా మహిళా అధ్యక్షురాలు కవిత, జూబ్లీహిల్స్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కీర్తి, రహ్మత్ నగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అం డాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

గ్లాకోమా ప్రభావంపై అవగాహన సదస్సు

● గ్లాకోమా అవేర్‌నెస్ వాక్‌ను ప్రారంభించిన సినీ నటి నిహారిక కొణిదెల,

● ప్రపంచ గ్లాకోమా వీక్ మార్చి 10 నుంచి 16వ తేదీ వరకు నిర్వాహణ





ముందస్తు గుర్తింపుతో దృష్టి నష్టాన్ని అరికట్టవచ్చునీ బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు, వైద్య నిపుణులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ గ్లాకోమా వీక్ మార్చి 10 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాన్ని సినీ నటి నిహారిక కొణిదెల, వైద్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు నుంచి తిరిగి రెయిన్ బో ఆస్పత్రి మీదుగాఈ వాక్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లాకోమాపై ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు, వైద్య నిపుణులు చేస్తున్న కృషిని అభినందించారు. కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ సిద్దార్థ దీక్షిత్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ గ్లాకోమా వీక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్టెరాయిడ్ నిశ్శబ్దంగా కంటి దృష్టిపై ప్రభావం చూపుతుందన్నారు. గ్లాకోమా అనేది కంటి పీడనం పెరగడంతో కలిగే కంటి సమస్య అన్నారు. ఇది ఆప్టిక్ నరాలు దెబ్బతినడం ద్వారా అంధత్వానికి దారితీస్తుందన్నారు. దృష్టిని నష్టపోవడానికి అత్యంత సాధారణ కారణమన్నారు. వరల్డ్ గ్లాకోమా వీక్ (డబ్ల్యూజీడబ్ల్యు) అనేది వరల్డ్ గ్లాకోమా అసోసియేషన్ (డబ్ల్యుజీఏ), వరల్డ్ గ్లాకోమా పేషెంట్స్ అసోసియేషన్ (డబ్ల్యుజీపీఏ) ఉమ్మడిగా చేస్తున్నాయన్నారు. ఈ ఏడాది స్టెరాయిడ్ ప్రేరిత గ్లాకోమాపై దృష్టి పెట్టిం దన్నారు. ఉబ్బసం, కీళ్లనొప్పులు, కంటి అలెర్జీలు తదితర వాపు సంబంధిత పరిస్థితులకు చికిత్స చేయడానికి స్టెరాయిడ్లు ఉపయోగిస్తారన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ప్రచురించిన ఒక అధ్యయనంలో కంటి అలెర్జీ ఉన్న 4062 మంది పిల్లలలో 2.2 శాతం మందికి స్టెరాయిడ్ ప్రేరిత గ్లాకోమా ఉందన్నారు. ఈ పిల్లలలో 30 శాతం కంటే ఎక్కువ మంది మాకు చేరే సమయానికి అంధులుగా ఉన్నారని, ఎక్కువమంది ఎలాంటి ప్రిస్క్రిప్షన్లు లేకుండా లేదా అసలు ప్రిస్క్రిప్షన్ జారీ చేసిన సమ యానికి మించి స్టెరాయిడ్లను ఉపయోగించారని తెలిపారు. కం టి లోపల ఒత్తిడిని పెంచడం ద్వారా కూడా గ్లాకోమాకు కారణ మవుతాయని తెలిపారు.ఇది నియంత్రణలో లేనప్పుడు విజన్ కు నష్టం కలిగిస్తుందన్నారు.కంటిఅలెర్జీ ఉన్న పిల్లలు ఎక్కు వగా గురవుతారని తెలిపారు. కళ్ళు ఎరుపు, దురద నుంచి త్వరగా ఉపశమనం పొందడానికి ఈ స్టెరాయిడ్‌లను వాడుతున్నారని పేర్కొన్నారు. ఎవరైనా స్టెరాయిడ్స్ కారణంగా గ్లాకోమాను అభి వృద్ధి చేస్తే వైద్యులు గ్లాకోమాకు అవసరమైన చికిత్సతో పాటు స్టెరాయిడ్స్ స్థానంలో ప్రత్యామ్నాయ మందులను సూచించాలని తెలిపారు. ప్రిస్క్రిప్షన్‌లో స్టెరా యిడ్లు ఉన్నాయా? అని వైద్యులను తప్పక అడగాలన్నారు. మందులు జాగ్రత్తగా వైద్యుల పర్యవే క్షణలో మాత్రమే వాడాలన్నారు. కంటి చుక్కలు, ఇన్‌హేలర్‌లు, ఆయింట్‌మెంట్లు, మాత్రలు వంటి సూచించిన స్టెరాయిడ్‌లను తీసుకునే వ్యక్తులు వారి కళ్ళను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని తెలిపారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

● సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఆశావహ అభ్యర్థి వేణుగోపాల స్వామి ధీమా



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వేణుగోపాల స్వామికే అన్ని వర్గాల ప్రజల నుండి మద్దతు లభిస్తుండడంతో ప్రకటన రావడమే ఆలస్యం అని కాంగ్రెస్ నాయకులే చెబుతుండటం గమనార్హం. కాంగ్రెస్ పార్టీని వదలకుండా ఉండడమే కాకుండా అనేక సేవా స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా వేణుగోపాల స్వామికి ప్రజల్లో మంచి ఆదరణ లభించడంతో పాటు పార్టీలో అతనికి దీటుగా అర్థబలం, అంగబలం ఉన్న మరొక్క నాయకుడు లేకపోవడం ఆయనకు కలసి వస్తున్న అంశాలుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తనను అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించక ముందే మహిళలకు చీరల పంపిణీ, పార్టీని బలోపేతం చేయడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతూ వేణుగోపాల స్వామి దూసుకు పోతున్నారు. వేణుగోపాల స్వామికి చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా నియోజక వర్గంలో గణనీయంగా ఉన్న మై నార్టీలు, రైల్వే కార్మికులు, ఆర్టీసి కార్మికులు, కేంద్రప్రభుత్వ సంస్థల్లోని ఉద్యోగులు సైతం ఏకగ్రీవంగా తమ మద్దతు వేణుగోపాల స్వామి ఇస్తామని చెప్పడమే కాకుండా నిరభ్యంతరంగా అతనికే టికెట్ ఇవ్వాలని పార్టీ ముందు ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో ముందుగా పార్టీలో ఆశావాహులను సము దాయించడానికి, ఇతర వర్గాల నాయకులను పార్టీలోకి ఆకర్షించడం లాంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రచారాన్ని ఉధృతం చేసే అవకాశం ఉంటుందని పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు తమ అభి ప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా సికింద్రాబాద్ పార్లమెంట్ నుండి ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే అదేపార్టీ కేం ద్రంలో అధికారంలోకి వస్తుందనేది ప్రజల నమ్మకమన్నారు. ఆ నానుడిని నిజం చేస్తూ వేణుగోపాల స్వామి విజయం సాధించడంతో పాటు కేంద్రప్రభుత్వంలో ప్రముఖ పాత్ర పోషిస్తారనే ఆశాభావాన్ని ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు.

భారత త్రివిధ దళాలకు సైఫాబాద్ ఎన్సీసీ క్యాండెట్లు

● రాణిస్తున్న ఎన్సీసీ క్యాండెట్లు.. పలువురు ప్రశంసలు





నవతెలంగాణ-ఓయు

ఉస్మానియా యూనివర్శిటీలోని సైఫాబాద్ సైన్స్ కాలేజీ ఎన్సీసీ క్యాండెట్లు త్రివిధ దళాలలో ఆఫీసర్లుగా ఎంపికే ప్రధాన లక్ష్యంగా దూసుకుపోతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దానికి నిదర్శనమే ఇటీవలే విడుదలైన నౌకాదళం ఫలితాలలో ఈ కళాశాలకు చెందిన సాయివీర్, రాజ్‌కుమార్‌లు అందుకు ఉదాహరణ అని అన్నారు. వారు నేవీ ఎస్ఎస్ఆర్ అధికారులుగా ఎంపికయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేశ్ మాట్లాడుతూ విద్యార్థుల శ్రమ ను వారిలో టాలెంట్‌ను కొనియాడారు.తమ వద్ద శిక్షణ పొందిన వారికి దేశ రక్షణ ప్రాథమిక బాధ్యత అనే నినాదాన్ని నింపుతూ శారీరకంగా, మానసికంగా తీర్చి దిద్దుతామన్నారు.

నిరుపేద కుటుంబంలో పుట్టిన ఈ విద్యార్థులు దేశ సేవలో చాలా మంది ధనికులని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవలే ఈ క్యాండెట్లు అనేక జాతీయ స్థాయి క్యాంపులో ఎంపిక కావడంతో పాటుగా దేశ రక్షణ విభాగాల్లో ఉద్యోగాలు పొందారని డా.నరేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ. లక్ష్మణ్ నాయక్ విద్యార్థులను ప్రశంసించారు.

వంజరికుల ఆధ్వర్యంలో మహిళా సదస్సు

పాల్గొన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు



నవతెలంగాణ-ఓయూ

మహిళా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు కార్యక్రమాన్ని ఆదివారం తార్నాక వంజరి సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా సమానంగా ఉన్నారని, ఓర్పు సహనానికి మారుపేరు స్త్రీ మూర్తి, స్త్రీ తల్లిగా, చెల్లిగా, కూతురుగా భార్యగా, స్నేహితురాలుగా అన్ని పాత్రలలో జీవించి అన్నింటికీ న్యాయం చేస్తున్నారు. నేడు మహిళలు అన్ని రంగాలలో తమ ప్రత్యేకతను చాటుకుంటూ విజయభేరి మోగిస్తున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాల ఎదిగేందుకు ప్రభుత్వాం చేయుతనిచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ కార్మిక విభాగ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి, వంజరి సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కంధారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, పవన్ కళ్యాణ్, వంజరి సంఘం సభ్యులు సునీత, అనురాధ, దేవిక, ఆలే గీత, శోభ,రాజు విజయలక్ష్మి, సంఘం సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా వంజరి మహిళలు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ఈటెల పర్యటన



నవతెలంగాణ-కంటోన్మెంట్

మల్కాజగిరి బీజేపీ పార్లమెంటరీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఆదివారం కంటోన్మెంట్ పలు ప్రాంతాలలో పర్యటించి ప్రజ లను కలిశారు. ఉదయం అంబేద్కర్‌నగర్‌లో కార్పొరేటర్ దీపిక నరేష్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం బస్తీ వాసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు మహేం ద్రహిల్స్ కాలనీలో పలు కాలనీల సంక్షేమ సంఘాలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని సమస్యలపై చర్చించారు. కార్యక్రమానికి నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సీనియర్ నాయకుడు, ఎం.శ్రీ గణేష్ మల్లికార్జున తదితరులు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కంటోన్మెంట్ బోర్డ్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున్, కంటోన్మెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి బిఎన్ శ్రీనివాస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి లాక్రోజ్ క్రీడలో పాల్గొన్న క్యాపిటల్ కళశాలాల విద్యార్థులు

● లాక్రోజ్ క్రీడలో శిక్షణ ఇస్తాం. డెరైక్టర్ అండ్ ప్రిన్సిపాల్ టి.హేమలత



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రస్థాయి మొదటి లాక్రోజ్ క్రీడల్లో షాపూర్ నగంకు చెందిన క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళాశాలాల విద్యార్థులు యాజ మాన్యం చురుగ్గా పాల్గొన్నారు. ఆదివారం నగరంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించిన మైదానంలో తెలంగాణ లాక్రోజ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి రాష్ట్రస్థాయి మెదటి వర్క్ షాప్ లో షాపూర్ చెందిన క్యాపిటల్ డిగ్రీ మరియు పీజీ విద్యార్థిని విద్యార్థులు యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు. లాక్రోజ్ క్రీడను మొదటిసారిగా నిర్వహిం చటం విశేషం. ఈ క్రీడల్లో పాల్గొన్న క్యాపిటల్ విద్యార్థులు మొదటి తరం విద్యార్థులుగా రికార్డ్ నమోదు చేసుకున్నారు. రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలతో పాటుగా రానున్న ఒలంపిక్స్ క్రీడల్లో ఈ లాక్రోజ్ క్రీడ ఉండడం పట్ల విద్యార్థులు ఆసక్తిగా ఈ ఆటల్లో పాల్గొన్నారు. ఈ క్రీడలో మరింతగా రాణించడానికి నైపుణ్యం గలవారితో శిక్షణ ఇప్పించుకున్నట్లు క్యాపిటల్ డిగ్రీ, పీజీ కళా శాల యజ మాన్యం పేర్కొన్నారు. తెలంగాణ లాక్రోజ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ భువన ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా లాధాము ఫౌండేషన్ చైర్మెన్ కె.మాధవిలత పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథిగా క్యాపిటల్ డిగ్రీ, కేజీ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ శ్రీమతి తాటచెర్ల హేమలత పాల్గొని మాట్లాడుతూ తమ విద్యా ర్థులు ఈ లాక్రోజ్ క్రీడలో పాల్గొనడం అభినందనీ యమ న్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రము ఖులతో పాటుగా తెలంగాణ ఒలంపిక్ అధ్యక్షుడు సము ద్రాల వేణు గోపాల్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

రంజాన్‌న సంతోషంగా జరుపుకోవాలి



● రేషన్ పంపిణీ చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్

రంజాన్ పండుగను ప్రతి ఒక్క ముస్లిం కుటుంబీకులు సంతోషంగా జరుపుకోవాలని, ఎర్రగడ్డ డివిజన్‌లో పవిత్ర రంజాన్ సందర్భంగా షరీఫ్, ఖురేషి ఆధ్వర్యంలో, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే హైదరాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో డివిజన్ అధ్యక్షులు డి. సంజీవ్, షేక్ జావీద్, జానీ మియా, సయిూద్ ఖాన్ సాహబ్, మహమ్మద్ అజీమ్, సయ్యద్‌రసూల్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరబండ డివిజన్ మధుర నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

బోరబండ డివిజన్ మధుర నగర్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకొని అన్ని సమస్యలను అధికారులను ఆదేశించి వెంటనే పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, ఆనంద్ కుమార్, సాయి చరణ్, వసీం, యూసుఫ్, బాబు రావు, రమేష్, కలీల్, దేవమణి, రమేష్ నాయక్, రామకృష్ణ, జీవన్, ధర్మ చంద్రకళ, రజియా, కృష్ణవేణి, శ్రీ లక్ష్మి మరియూ డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు దాతలు ముందుకు రావాలి : జంపన ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

అమావాస్య సందర్భంగా న్యూబోయినపల్లి బాపూజీనగర్ శ్రీ దేవి నల్ల పోచమ్మ ఆలయము వద్ద ప్రసాద వితరణ కార్య క్రమం జరిగింది. స్థానికులు సుమిత్రానాథ్ 74వ జయంతి వేడుకల్లో భాగంగా ఆమె జ్ఞాపకార్థం వారి కుమారులు అనిల్ సునీ ల్‌లు ప్రత్యేక పూజలు నిర్వ హించి అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మెన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల యంలో గత 30 సంవత్సరాలుగా ప్రతి అమావాస్యకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు దాతలు విరిగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు అజిత్ కుమా ర్, పుట్టి నరసింహ రామారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయం వద్ద జం పన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జాజుల విట్టల్ రావు, విజయలక్ష్మి, సాయి క్రాంతి, హరిహంత్, జనపాల శేఖర్, నర్సింగ్‌రావు, వినీత్, శివ పాల్గొన్నారు.



వైద్య సేవల్లో పారామెడికల్ విద్యార్థులు సేవలు అభినందనీయం



● నిమ్స్ డైరెక్టర్ డా"నగరి బీరప్ప



నవతెలంగాణ-బంజారాహిల్స్

వైద్య అనుబంధ విద్యార్థులు విషయ పరిజ్ఞానంలో, సాంకేతిక పరిజ్ఞానంలో వైద్య విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని, వారితో సమానంగా సేవలు అందిస్తారని నిమ్స్ డైరెక్టర్ డా"నగరి బీరప్ప వారి సేవలను కొని యాడారు. ఈ సందర్భంగా ఆదివారం నిమ్స్‌లో జరిగిన ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య అనుబంధ వృత్తి నిపుణులకు ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉందని, నిపుణులైన సాంకేతిక నిపుణుల కొరత చాలా ఉం దని తెలిపారు. ముమ్ముందు ఈ విభాగాల్లో డిగ్రీ, పీజీ చేసిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్య అనుబంధ వృత్తి నిపుణుల మండలి చైర్మెన్ డా: విజయ కుమార్ కుతాల, నిమ్స్ రేడియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డా: వై జ్యోత్స్న రాణి పాల్గొని ప్రసంగించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ నిర్వహిస్తున్న నిరంతర బోధన కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సదస్సులో ఎంఎన్‌జే ఆసుపత్రి డైరెక్టర్ డా" జయలత నేతగాని, నిమ్స్ ప్రొఫెసర్ డా"సుజాత పట్నాయిక్,నిమ్స్ రేడియాలజిస్ట్ డా"టి.గణేష్, తదితరులు వివిధ అంశాలలో అతిథి ఉపన్యాసాలు చేశారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడి యోగ్రాఫర్స్ అధ్యక్షులు విలాస్ కే భదానే,సెక్రెటరీ జనరల్ జగదీశ్ ఎన్ జగ్తప్, ఉపాధ్యక్షులు సింగరేణి ఆసుపత్రి కి చెందిన శ్రీ ఎస్. యాదవ రెడ్డి తెలంగాణ చాప్టర్ నిరంతర విద్యా కార్యక్రమాలను అభినందించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జీవిత సాఫల్య అవార్డు నిమ్స్‌కు చెందిన రిటైర్డ్ సీనియర్ రేడియోగ్రాఫర్ కె. శ్రీశైలంకి ప్రధానం చేయగా,ఉత్తమ పరిశోధనా పత్రం అవార్డ్ చెన్నై కీల్ పాక్ మెడికల్ కాలేజ్ విద్యార్థిని రావి రేవతి గెలుపొందారు. ఈ సదస్సులో తెలంగాణ అధ్యక్షులు దామోదర్ నాయుడు స్వాగత ఉపన్యాసం చేయగా,సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ సిఇవో, నిమ్స్ కాలేజ్ ఆఫ్ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్ మాట్లాడారు.

ఈస్ట్ మారేడ్‌పల్లి శ్రీచైతన్య స్కూల్‌లో ఘనంగా' సైన్స్ ఎక్స్ పో'



నవతెలంగాణ-బేగంపేట్

ఈస్ట్‌మారేడ్‌పల్లి శ్రీచైతన్య స్కూల్లో సైన్స్ ఎక్స్‌పోను 23-24 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎక్స్‌పో వల్ల విద్యార్థుల అంతర ంగిక ప్రతిభను వెలికితీస్తుందని, తద్వా రా శాస్త్ర సాంకేతిక నైపుణ్యం, వారి ప్రతిభను వెలికి తీయ వచ్చున్నారు. ఎక్స్‌పోలో విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న వారి ప్రతిభ పాటవాలను వెలికి తీసి వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండే విధంగా తాము కృషి చేస్తున్నామని శ్రీచైతన్య స్కూల్ మెహదిపట్నం జోన్ ఏజీఎ కృష్ణ, రీజినల్ ఇన్‌చార్జి హరికృష్ణ, ప్రిన్సిపల్ రమ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

జోనల్‌అకాడమిక్ కోఆర్డి నేట రవికు మార్, డీన్ భిక్షపతి, సీ.బ్యాచ్ ఇన్‌చార్జి స్వప్న, ప్రై మరీ ఇన్‌చార్జి ఉమాదేవి, సైన్స్‌టీచర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచితంగా మెగా మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్ బీ ఐ కాలనీ) ఓల్డ్ బోయినపల్లిలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఏపీన్ టీం ఫ్రీ మెగా మెడికల్ క్యాంపు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా డాక్టర్ మినాల్ చంద్ర (పెయిన్ స్పెషలిస్ట్, ఎపిన్ పెయిన్ సెంటర్) హాజరయ్యారు. ఈ క్యాంపులో 280 మందికి పైగా ప్రజలు తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఏపీన్ సెంటర్ పెయిన్ రిలీఫ్ వారి ద్వారా పాల్గొన్న ప్రజలందరికీ ఉచిత పరీక్షలు-బీఎండీ, బీపీ, షుగర్ హైట్ అండ్ వెయిట్ అండ్ ఫ్రీ కన్సల్టెషన్ ఏపీన్ సెంటర్ ఫర్ పెయిన్ స్లయిడ్ షో ద్వారా హెల్త్ అవేర్నెస్ ఆరోగ్య సేవలు అందించారు.

ఘనంగా యూనిస్ పాష జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

బీఆర్ఎస్ మేడ్చల్ మండల నాయకుడు యూనిస్ పాషా తన జన్మదినం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను వారి నివాసంలో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనిస్ పాషాకు పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జీవన్, భాస్కర్, నారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, వడ్లకుమార్‌చారి, విప్లవ్, చాంద్ పాషా, నరేష్, ప్రభాకర్, నవీన్, మహేందర్, సురేష్, అనీల్, బాబు, సురేష్ ఉన్నారు.

కిడ్నీల ఆరోగ్యంపై అవగాహనకు 'కిడ్నీ రన్'

- ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా కిడ్నీల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ఉదయం కిడ్నీ రన్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో పలువురు కిడ్నీ రోగులు, వైద్యరంగ నిపుణులు, సాధారణ ప్రజలు అందరూ కలిపి 1500 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సీకేడీ) గురించి అవగాహన పెంచడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను ఎదుర్కోవడంలో ప్రజలందరి భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇదో మంచి ముందడుగని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఐఎన్‌యూకు చెందిన నెఫ్రాలజిస్టు డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ "ఏఐఎన్‌యూ కిడ్నీ రన్‌కు లభించిన ఈ అపార ఆదరణ చూస్తుంటే మన సమాజంలో కిడ్నీల ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో, గుర్తింపు ఎంతగా పెరుగుతోందో అర్థమవుతుంది. ఈ సమిష్టి కార్యక్రమానికి అందరూ కలిసి రావడం ద్వారా దీనిపై అవగాహన పెంచడమే కాక, సీకేడీ బాధితులకు మంచి ఫలితాలు రాబట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు" ఈ కార్యక్రమంలో ఆస్పత్రికి చెందిన వైద్యులు డాక్టర్ సి.మల్లికార్జున, డాక్టర్ పీసీ రెడ్డి, డాక్టర్ దీపక్ రాగూరి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ వరుణ్, డాక్టర్ తైఫ్, డాక్టర్ లీలాకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బైక్ రైడ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ కిడ్నీ దినోత్సవం, ప్రపంచ మహిళా దినోత్సవం మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బైక్ రైడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏడీజీ అనిల్ కుమార్, సీఐఐ ఐడబ్ల్యూఎన్ తెలంగాణ అండ్ ఏవీపీ-హెచ్ఆర్ అనుపమ పండూరు, సెనేకా గ్లోబల్ ఐటీ సర్వీసెస్ ప్రయివేటు లిమిటెడ్ పాల్గొని జెండా ఊపి రైడ్‌ని ప్రారంభించారు. కిడ్నీ వ్యాధుల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి, కిడ్నీ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయరాదనే ఉద్దేశ్యంతో, కిడ్నీల రక్షణే అందరి ప్రథమ ధ్యేయం అనే నినాదంతో మెడికవర్ హాస్పిటల్స్‌చ హార్లీ డేవిడ్సన్ బైకర్స్ సంయుక్తంగా ఈ బైక్ రైడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ సెంటర్ నుంచి ప్రారంభమై మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ మీదుగా బేగంపేట మెడికవర్ హాస్పిటల్స్‌కి వెళ్లి, తిరిగి మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది బైక్ రైడర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అనిల్ కుమారు మాట్లాడుతూ ప్రజలకు కిడ్నీ వ్యాధులపై ఇలాంటి అవగాహనా కార్యక్రమం నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్స్ వారిని అభినందిస్తున్నాను అని తెలిపారు. డాక్టర్ అనుపమ పండూరు మాట్లాడుతూ మారిన జీవన శైలి, సరైన పోషకాల్లేని ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, వ్యాయామం చేయకపోవడం కిడ్నీ సమస్యలకు కారణాలవుతున్నాయన్నారు. ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల వ్యాధులను ముందుగానే అరికట్టవచ్చు అని తెలిపారు. డాక్టర్ కమల్ కిరణ్ (నెఫ్రోలజీ అండ్ కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ విభాగపు డైరెక్టర్-మెడికవర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ) మాట్లాడుతూ కిడ్నీలు మానవ శరీరంలోని ప్రధాన అవయవాల్లో ఒకటి అని, రక్తాన్ని శుద్ధి చేసి అందులో నుంచి హానికరమైన మలినాలను తొలగించి, తిరిగి శుద్ధమైన రక్తాన్ని శరీరానికి అందించే కీలక పాత్రను కిడ్నీలు పోషిస్తాయి. కిడ్నీ వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల తొలి దశలో వ్యాధిని గుర్తించడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కిడ్నీ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే అది కిడ్నీ ఫెయిల్యూర్‌గా మారే అవకాశం చాలా ఎక్కువ అన్నారు. కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ చేయడం ద్వారా కిడ్నీ ఫెయిల్యూర్ అయినా వారికీ నూతన జీవితాన్ని ఇవ్వొచ్చు అన్నారు. కిడ్నీ వ్యాధుల మీద చైతన్యం పెంచుకోవాలన్నారు. 30 ఏండ్లు పై బడిన వారు, బీపీ, షుగర్ ఉన్నవారు ప్రతి ఏడాదీ కనీసం ఒక్కసారి కిడ్నీ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్-మహేష్ దెగ్లూర్కర్ మాట్లాడుతూ "కిడ్నీ సేవలకు ప్రత్యేక విభాగం, ప్రత్యేక స్క్రీనింగ్ ప్యాకేజీలు, అనుభవజ్ఞులైన డాక్టర్లు, అత్యుత్తమ సాంకేతికత గల వ్యాధి నిర్ధారణ పరికరాలు మెడికవర్ హాస్పిటల్స్‌లో ఉన్నాయి. లక్షలాది మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నాం. విశ్వసనీయ కిడ్నీ సేవలకు మెడికవర్ పెట్టింది పేరు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెఫ్రోలోజిస్ట్ డాక్టర్ అరుణ్ కుమార్, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్, హెర్లీ ఓనర్స్ గ్రూప్, బంజారా చాప్టర్ సుధీర్ రెడ్డి, సెంటర్ హెడ్ అనూష, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మెదడు గాయాలతో ఏటా 1.5 లక్షల మంది మృతి



- మరో 5 లక్షల మందికి తీవ్ర గాయాలు
- రహదారి భద్రతపై అవగాహన అవసరం
- పలువురు వైద్య ప్రముఖులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రోడ్డు ప్రమాదాల్లో మెదడుకు గాయాలు కావడం వల్ల ప్రతియేటా లక్షన్నర మరణాలు సంభవిస్తుండగా, కనీసం మరో 5 లక్షల మందికి పైగా తీవ్రంగా గాయపడి జీవితాంతం ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. తలకు అయ్యే గాయాలపై అవగాహన కోసం ఆదివారం నగరంలోని నెక్లెస్ రోడ్డులో గల సంజీవయ్య పార్కు నుంచి అవగాహనా పరుగు నిర్వహించారు. నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్. బీరప్ప, ట్రాఫిక్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్, బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ కేవీఆర్ శాస్త్రి, కార్యదర్శి ప్రొఫెసర్ మానస్ పాణిగ్రాహి, నిమ్స్ ఆస్పత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుచంద భట్టాచార్జీ, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత బి.సాయిప్రణీత్, ఇంకా పలువురు న్యూరోసర్జన్లు, న్యూరోసైన్స్ నిపుణులు తదితరులు ఈ పరుగులో పాల్గొని మెదడుకు అయ్యే గాయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ " దేశవ్యాప్తంగా తలకు అయ్యే గాయాల్లో 60శాతం వాటికి రోడ్డు ప్రమాదాలే కారణం, అందులోనూ ద్విచక్ర వాహనాల మీద వెళ్లేటప్పుడు అయ్యేవే ఎక్కువ. దీనివల్ల ఉత్పాదక వయసులో ఉన్నవారు మరణించి, ఆ కుటుంబాలపై పెనుభారం పడుతోంది. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన లేకపోవడం, హెల్మెట్లు సరిగా వాడకపోవడం, రహదారులు సరిగా లేకపోవడం, చట్టాలను పట్టించుకోకపోవడం, ఆస్పత్రికి రావడానికి ముందు ప్రాథమిక చికిత్సలు అందకపోవడం, ఆస్పత్రులలోనూ న్యూరోసర్జరీ విభాగాలు పటిష్ఠంగా ఉండకపోవడం లాంటివి ఎక్కువశాతం మెదడు గాయాల వల్ల సంభవించే మరణాలకు కారణమవుతున్నాయి" అని తెలిపారు. కోరారు.

10 మంది మహిళలకు సత్కారం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వీ ఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ వారు రవీంద్ర భారతిలో ఇన్స్పైరింగ్ ఉమెన్-2024 పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో రాణిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న మహిళలను ఎంచుకుని, వారిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మ శ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని విచ్చేయగా, గౌరవ అతిథిగా శారదా లింగరాజు, ప్రత్యేక అతిథిగా సింగింగ్ స్టార్ విజయలక్ష్మి విచ్చేశారు. అతిథులందరూ మహిళలు ఎందురుకొంటున్న వివక్ష గురించి, వాటిని అధిగమించి, ప్రతి మహిళ తనకు నచ్చిన విధంగా తను జీవించడం ప్రాముఖ్యత గురించి వివరించారు. అవార్డు గ్రహీతల్లో పారిశ్రామిక వేత్తగా ఎన్నికైన వసంతి గోగినేని మాట్లాడుతూ పదేండ్ల క్రితం తాను కన్న ఈ కళ నేడు నెరవేరిందన్నారు. తన ఇన్నేండ్ల కష్టం వల్ల 50 మందికి పైగా ఉపాధి కలిగించగలిగాను అని తెలిపారు. రాజకీయ నాయకురాలిగా, గోషామహల్ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్‌ని సన్మానించారు. ఉపాధ్యాయురాలిగా సన్మానం పొందిన జయంతి, తన వత్తిలో తాను పాతికేండ్లుగా చూపుతున్న నిబద్ధత వల్ల, ఎందరో విద్యార్థినులకు మెరుగైన జీవితాన్ని అందించగలిగాను అని చెప్పారు. జర్నలిస్ట్ విభాగంలో రాధిక పురస్కారాన్ని పొందారు. అన్ని రంగాల్లో లాగే, జర్నలిజంలో కూడా మహిళలు వివక్షను ఎదుర్కొంటారు అనీ, వత్తిలో రాణించడానికి కుటుంబ సభ్యుల సహకారం చాలా ముఖ్యం అని రాధిక తెలిపారు. ట్రాన్స్ ఉమెన్ విభాగంలో సుబ్బ లక్ష్మి రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. చిన్న తనం నుంచి తాను అనేక రకాలుగా వివక్షను ఎదురు కొన్నాను అనీ, గౌరవం లభించాలంటే ఏదైనా సాధించి చూపించాలి అనే పట్టుదల వల్లనే తాను ఇప్పుడు 50 మందికి ఉద్యోగ అవకాశాలు కలిగించే స్థాయికి చేరుకున్నాను అని తెలిపారు. ఆటో డ్రైవర్‌గా అరిగె అరుణ పురస్కారాన్ని పొందారు. తన భర్త అనారోగ్య సమస్యల వల్ల మరణించారనీ, మరణానికి ముందే తనకు ఆటో నడిపించడం నేర్పించారు అనీ, ఇప్పుడు ఆటో డ్రైవింగ్ తనకు జీవనోపాధిగా మారి, తన పిల్లలకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించగలుగుతున్నాను అని తెలిపారు. లైఫ్ కోచ్ విభాగంలో మల్లిక, స్కూల్ ఆయాగా పార్వతి, సామాజిక కార్యకర్తగా సీతామహాలక్ష్మి పురస్కారాలు పొందారు. ఈ కార్యక్రమంలో వీ ఫర్ ఉమెన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతిభాలక్ష్మి, కార్య నిర్వాహకులు డాక్టర్ అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు డాక్టర్ సుదక్షిన, సంధ్య, జాయింట్ సెక్రెటరీ అశ్విని, కోశాధికారి డాక్టర్ విజయలక్ష్మి సభ్యులు అభిరామ్, భవాని, శ్రావణ్, నిఖత్ సుల్తానా, కరుణ, నీశ పాల్గొన్నారు.

నిద్ర తగ్గితే పెను ప్రమాదం

- పిల్లలు, మహిళల్లోనూ నిద్రలేమి సమస్య
- చాలా వరకు గుర్తించకుండా వదిలేస్తున్నారు
- కిమ్స్ ఆస్పత్రిలో నిద్రపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

"మంచి నిద్ర అనేది మన భౌతిక, శారీరక ఆరోగ్యానికి చాలా ముఖ్యం. అది ఏమాత్రం తగ్గినా చాలా ప్రమాదాలు పొంచి ఉంటాయి. మన మొత్తం జీవిత కాలంలో మూడోవంతు భాగం నిద్రలోనే గడిపేస్తామన్న విషయం చాలా మందికి తెలియదు. మన జ్ఞాపకశక్తికి, మూడ్ బాగుండటానికి, జీవక్రియలు సరిగా సాగడానికి, జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉండేందుకు, రోగనిరోధక శక్తి తగినంతగా ఉండేలా చూడటానికి కూడా నిద్రే కీలకం. ఇలాంటి నిద్ర గురించి ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, అందరికీ అవగాహన కల్పించడం ఎంతో ముదావహం" అని కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అన్నారు. సికింద్రాబాద్‌లోని ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించి మాట్లాడారు. కిమ్స్ ఆస్పత్రి పల్మనాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు స్లీప్ స్పెషలిస్టు, ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ వి.వి. రమణ ప్రసాద్ నేతత్వం వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడుతూ " ఓఎస్ఏ ప్రభావం రోజువారీ జీవితంతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. దీనివల్ల సడన్ కార్డియాక్ అరెస్టులు, పక్షవాతం, గుండె లయ తప్పడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు కునుకు పట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు.. ఇలాంటి తీవ్రమైన ముప్పులు ఉంటాయి. ఎవరికైనా ఉదయం లేచిన తర్వాత కూడా మూడ్ సరిగా లేకపోవడం, పని చేయాలని అనిపించకపోవడం, బద్ధకంగా ఉండటం లాంటివి ఉంటే కేవలం నిద్ర సరిగ్గా పట్టలేదని వదిలేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి, తమ నిద్ర నాణ్యత ఎంత ఉందో పరీక్షించుకోవాలి. దీనికి కూడా కొన్ని చికిత్సలు ఉన్నాయన్న విషయం చాలా మందికి తెలియడం లేదు. ఈ విషయం గురించి అందరికీ అవగాహన కల్పించేందుకు కిమ్స్ ఆస్పత్రిలో ఓఎస్ఏ మాస్టర్‌క్లాస్ పేరుతో శిక్షణ నిర్వహిస్తున్నాం. దీనివల్ల ఓఎస్ఏ గురించి అందరిలో అవగాహన వచ్చి, దీనికి ప్రభావితం అయినవారి జీవితాల్లో మంచి మార్పు తేవడానికి వీలు కలుగుతుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి నిర్వాహక కమిటీ సభ్యులుగా డాక్టర్ లతాశర్మ, డాక్టర్ మన్మథరావు, విశాల్, మహేష్, డాక్టర్ జీవీ లక్ష్మి డాక్టర్ చిరాలీ షా, క్రాంతికుమార్ వ్యవహరించారు.

మహిళల భద్రతను గాలికొదిలేసిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ-అంబర్‌పేట



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ పార్కులో న్యారీ న్యాయ సమ్మేళన్, సమరోహన్ కార్యక్రమాన్ని ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు, ఆశా వర్కర్లకు శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం కలిసి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ పాలనలో మహిళలకు ఎలాంటి రక్షణ లేదన్నారు. నారీ న్యాయ హే హం తయ్యార్ అనే నినాదంతో మహిళా కాంగ్రెస్ మహిళలు అందరు కలిసి పాదయాత్రను నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దేవయా, జనరల్ సెక్రటరీ షైనాస్ బేగం, బ్లాక్ ప్రెసిడెంట్ ప్రసన్న, డివిజన్ ప్రెసిడెంట్ సంగీత, పద్మ, వార్డ్ మెంబర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయ సహాయం అభినందనీయం

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వరరావు

నవతెలంగాణ-ధూల్‌పేట్



బడుగు, బలహీన బాధితులకు అండగా నిలిచేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వరరావు అన్నారు. అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీసీఆర్) ఆధ్వర్యంలో ఆదివారం మెహదీపట్నంలో లీగల్ ఎయిడ్ క్లినిక్, లా లైబ్రరీని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలందరికీ న్యాయ సహాయం అందించేందుకు కృషి చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా తమ సంస్థ ఉచిత న్యాయసేవలను అందిస్తోందని ఏపీసీఆర్ వైస్ ప్రెసిడెంట్ అఫ్సర్ జహాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సుమైరా నాసర్ రసూల్ ఖాన్, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిమ్మనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలందరూ పోరాడాలి

- బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేదు
- సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఓంకార్ భవన్‌లో ఎఐఎఫ్‌డిడబ్ల్యూ ఘన నివాళి

నవతెలంగాణ-ముషీరాబాద్



దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, యావత్ మహిళా హక్కుల కోసం జీవితాన్ని దారబోసిన సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలందరూ తమ హక్కుల సాధన కోసం సమరశీల పోరాటం నిర్వహించాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి అంగడి పుష్ప పిలుపునిచ్చారు. ఆదివారం సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా ఎంసీపీఐయు రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ పుష్ప మాట్లాడుతూ దేశంలో అనేక సామాజిక ఉద్యమాల స్ఫూర్తితో సామాజిక వేత్తల పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించబడినాయని వాటి రక్షణ కోసం నేటికీ పోరాటం చేయాల్సిన పరిస్థితి రావడం దానికి కేంద్రంలో అధికారం ఉన్న బీజేపీ కారణం కావటం శోచనీయమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రంగంలోనూ మతంను చొప్పిస్తున్న విధానానికి వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించటమే ఏకైక మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీడబ్ల్యు నాయకురాలు శివాని, ఎంసీ పీఐయు నాయకులు మార్టిన్, రవీందర్ గౌడ్ ,పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ వినతి

నవతెలంగాణ-హిమాయత్ నగర్



తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఆయన వినతిపత్రం అందజేసి వివరించారు. ఈ సందర్భంగా పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అదే కాకుండా దాదాపు 25 వేల టీచర్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయవలసి ఉండగా కేవలం 11 వేల ఉద్యోగాలను మాత్రమే నోటిఫికేషన్‌లో ప్రకటించడం శోచనీయమన్నారు. 2023లో ప్రకటించిన టెట్ పరీక్షలో అత్యధికంగా ఎస్టీ, బీసీలు అర్హత సాధించ లేదని కావున టెట్ పరీక్ష లేకుండా ఈ వర్గాలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకు లాలకు శాశ్వత భవనాలు, లైబ్రరీలు, ప్రయోగ శాలలు, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపా యాలు కల్పించిన తర్వాత ప్రభుత్వం కామన్ గురుకుల గురించి మాట్లాడాలని కోరారు. ఇప్పటికే గురుకు లాల్లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను వెంటనే బదిలీ చేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలను పెంచాలని, అన్ని మహిళా గురుకుల పాఠశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అభివృద్ధి చెందిన దేశాలలో సైతం మహిళలకు రక్షణ కరువైంది

- తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలలో సైతం మహిళలకు రక్షణ కరువైందని, డెన్మార్క్ దేశం 55వ స్థానంలో ఉంటే భారతదేశం 133వ స్థానంలో ఉందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సామ్రాట్ కాంప్లెక్స్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.ఆడ పిల్లలను చదివించాలని, మహిళలను ఇంటి, వంట పనులకే పరిమితం చేయకుండా అన్ని రంగాలలో రాణించేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. స్త్రీ, పురుషుల సంబంధాలు ప్రేమానురాగాలతో ఉండాలని అర్థం చేసుకుని జీవించాలని, మహిళలను గౌరవించాలని ఆమె సూచించారు. అనంతరం మాజీ మంత్రి కె.పుష్పలీల మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు టి.లక్ష్మీదేవి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు సామా హేమలత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు టి.హేమలత, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేస్తుంది

- ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ-ముషీరాబాద్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ మాయమాటలతో దేశ ప్రజలను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. కాంగ్రెస్‌పై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చేసిన వాఖ్యాల కు గాను పత్రికా ప్రకటన ద్వారా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక జాతీయ పార్టీలో ప్రధా న కార్యదర్శిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మూసీ లో వేసినట్టని బండి సంజయ్ మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ఎదురుకో లేనటువంటి స్థితిలో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయ కులు ఒక పార్టీ ఓటు వేస్తే ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని దుష్ప్రచారం చేయడం హేయమైన చర్యగా అభి మానించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా యువకులను దేశ ప్రజలను మోసం చేసిందన్నారు. నల్లధనాన్ని తీసుకువచ్చే ప్రతి ఒకరి ఖాతాలో రూ. 15 లక్షల రూపాయలు ఇస్తామని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని తీవ్రంగా మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం హామీల అమలు విషయంలో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. దేశం ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేసి బ్యాంకు ఉద్యోగస్తులను మానసిక శోభకు గురి చేస్తున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు నిరాశ మిగులుస్తుంది

- గురుకుల టీచర్ పోస్టులలో బ్యాక్‌లాగ్ లేకుండా భర్తీ చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గురుకుల టీచర్ పోస్టుల భర్తీలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తుందని గురుకుల టీచర్ పోస్టులో బ్యాక్ లాక్ లేకుండా భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యానగర్ బీసీ భవన్ లో నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో గురుకుల టీచర్ అభ్యర్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్కంఠగా మారిన గురుకుల నియామకాల్లో తీవ్ర గందరగోళం అక్రమాలు జరిగాయన్నారు. పోస్టులను అవరోహణ క్రమంలో నింపకుండా బోర్డు వారు ఇష్టానుసారంగా, ఉద్దేపూర్వకంగా బ్యాక్ లాక్ పోస్టులు మిగిలే విధంగా భర్తీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియలలో 3000 పైగా చిలుకు పోస్టులను ఉద్దేశ్య పూర్వకంగా మిగిల్చి గందరగోళం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. నోటిఫికేషన్ ప్రకటించేటప్పుడు అప్పటి గురుకుల బోర్డు కార్యదర్శి అవరోహణ క్రమంలో పోస్టులను నింపుతామని ప్రకటించడం జరిగింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా భర్తీ ప్రక్రియను చేపట్టడం జరుగుతుంది. అత్యున్నత స్థాయి నుండి పోస్టులను కింది స్థాయి వరకు భర్తీ చేసినట్లయితే 9210 పోస్టులను బ్యాక్‌లాగ్ లేకుండా భర్తీ చేయవచ్చు. అత్యున్నత పోస్టులకు ఎంపికైన వ్యక్తి నుండి రిలింక్యాష్ ఆప్షన్ తీసుకొని తర్వాత మెరిట్ ఉన్న అభ్యర్థికి క్రింది స్థాయి పోస్టు గతంలో కూడా ఇవ్వడం జరిగింది. ఇప్పుడు రిలింక్యాష్ విధానాన్ని పునరోదించి ఒక్క పోస్టు కూడా బ్యాక్ లాక్ లేకుండా నింపాలని డిమాండ్ చేశారు. గురుకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులలో 40 సంవత్సరాలు దాటిన అభ్యర్థులు ఎక్కువమంది ఉన్నారు. వారికి వయసు పరిమితి కూడా దాటపోయింది. కావున అందరికీ న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్, నాయకులు సైదులు, అస్మా, రమేష్, మనోహర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కింగ్‌కోఠి కామినేని ఆసుపత్రిలో మహిళలు ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని కామినేని ఆసుపత్రి చైర్మెన్ కామినేని సూర్యనారాయణ అన్నారు. ఇప్పటివరకు మూడు వందలకుపైగా మహిళలు ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేసామని తెలిపారు. ఈ ఉచిత వైద్య పరీక్షలు మహిళలకు15వ తేది వరకు మహిళలకు అన్ని రకాల టెస్టులు స్కానింగ్‌లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని చైర్మెన్ కోరారు. కంప్లీట్ బ్లెడ్ పిక్చర్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, థైరాయిడ్ ఫంక్షన్ టెస్ట్, గైనకాలజీ కన్సల్టేషన్, అల్ట్రాసౌండ్ అబ్డోమెన్ స్కానింగ్‌లు కింగ్ కోఠి కామినేని ఆసుపత్రిలో ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఆరోగ్య పరీక్షల కోసం 7815978159 ను సంప్రదించి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని చైర్మెన్ అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం కామినేని ఆసుపత్రి ముందుంటుందని స్పష్టం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

దివ్యాంగస్ డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో డిడిఈఏ మహిళా ఉద్యోగుల కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి మహిళా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సాధారణ ఉద్యోగులతో సమానంగా కాకుండా ప్రత్యేకంగా దివ్యాంగస్ ఉద్యో గులను చూడాలన్నారు. ఈ కార్యకమంలో మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరా, ఉపాధ్యక్షురాలు బి.స్వర్ణమని, సంయుక్త కార్యదర్శి కె కుమారి, కార్యనిర్వాహక సభ్యులు అశోక్ లక్ష్మి, పర్వీన్ బేగం, ఎగ్జిక్యూటివ్ నెంబర్ సాయి మౌనిక మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



విశ్వకర్మ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలని గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చ పీఎంవీకే ఉపాధ్యక్షులు ముఖేష్ సాగర్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ రామచంద్రయ్య కమ్యూనిటీ హాల్‌లో గోల్కొండ జిల్లా కల్చరల్ సెల్ జాయింట్ కన్వీనర్ సందుగారు శ్రీనివాస్, బీజేవైఎం సెక్రటరీ జాన్నకంటి మధుసూధన్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజన పథకం అప్లికేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, చేతివృత్తి దారులకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు అందిస్తుందన్నారు. నైపుణ్యత శిక్షణ కల్పిస్తూ నమో దీవెనతో కులవృత్తులు మహర్దశ కల్పిస్తుందని తెలిపారు. అర్హత గల ప్రతీ ఒక్కరూ ఈ యోజన పథకాన్ని నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని పొందాలని కోరారు.

మెపా రాష్ట్ర స్థాయి సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక..

- రాష్ట్ర అధ్యక్షులుగా పులి దేవేందర్ ఎన్నిక..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



మేప రాష్ట్ర కార్యవర్గ కార్యవర్గ సమావేశాన్ని కోఠిలోని హనుమాన్ టెక్డి లోని బీసీ సాధికారత భవన్ ఆదివారం నిర్వహించారు . ఈ సందర్భంగా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం) నాల్గొవ రాష్ట్ర స్థాయి సమావేశం మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను, సన్మానించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పులి దేవేందర్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులుగా బోయిని జగన్ మోహన్ ముదిరాజ్, ఆర్థిక కార్యదర్శిగా కోల కరుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 50 మందినీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. జాతి బిడ్డలు అనేక దశాబ్దాలుగా కొట్లాడుతూ ఎదురుచూస్తున్న రిజర్వేషన్ బీసీ డీ నుండి బీసీ ఏ సమస్యను ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల విద్య, ఉద్యోగ, సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్న మెపాపై ఎంతమంది ఎన్ని నిందలు వేసిన.. జాతి అభివృద్ధి కోసం వెనుకడుగు వేసే ఆలోచించనే లేదన్నారు. గౌరవ అధ్యక్షులు జగన్ మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ.. జాతి అభివృద్ధి ఐక్యత కోసం నా వంతు కృషి చేస్తానని అందుకు అందరికీ కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మెపా నాయకులు సభ్యులు దాసరి వీరన్న, నర్సింహులు, వెంకటయ్య, విజయ్ కుమార్, వేణుగోపాల్, చిరంజీవి, రామాంజ నేయులు, కృష్ణ, దాసరి వీరన్న, రామ, కృష్ణ, మదు, కుమార్, స్వామి, వెంకన్న, జ్యోతి, స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

స్త్రీల పట్ల సావిత్రిబాయి పూలే కృషి ఎనలేనిది



నవతెలంగాణ-ధూల్‌పేట్

స్త్రీల పట్ల సావిత్రి బాయి పూలే కృషి ఎనలేనిదని మాదిగ బంధు మిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి సుమన్ కుమార్ అన్నారు. సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా చుడి బజార్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, ఉద్యమకారిణి సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

షాహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువ జన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైద రాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18, 19, 20వ తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ, కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. మాట్లాడుతూ భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యంలో కీలక భూమిక పోషించారని, అలాంటి మహనీయుడి నిస్మరిస్తూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ కు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలనే యువత ఈ క్రింది ఫోన్ నంబర్లు కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ 73866 90103, ఆర్గనైజర్స్ బాలకృష్ణ 8885173 361, మహమూద్ 8121347855 సంప్ర దించవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక మంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కళ్యాణ్ పాల్గొన్నారు.

'నాలుగో తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలి'

- తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకు వచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు చెందిన 850 మంది నాలుగో తరగతి ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారని గుర్తు చేశారు.ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనేక మార్లు విన్నవించగా విడతల వారీగా 689 మందిని తీసుకురాగా మరో 161 మంది ఉద్యోగులు అక్కడే ఉండి పోయారని గుర్తు చేశారు. రెండేళ్ల క్రితమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్కడ మిగిలిపోయిన వారిని రిలీవ్ చేసిందని, తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని విన్నవించారు. ఏపీలో పని చేస్తున్న ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఆర్థిక ఇబ్బందులతో అనేక బాధలు పడుతున్నారని, వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చిన తెలంగాణ ఉద్యోగులలో సచివాలయం ఉద్యోగులను హెచ్ఓడీలకు, హెచ్ఓడీ ఉద్యోగులను జిల్లాలకు పంపించారని తెలిపారు.గత ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించగా సచివాలయం ఉద్యోగులను తిరిగి సచివాలయానికి పంపించి హెచ్ఓడీ ఉద్యోగులను మాత్రం జిల్లాలోనే ఉంచారని తెలిపారు. దీంతో ఆంధ్రప్రదేశ్ నుంచి స్వరాష్ట్రానికి వచ్చినప్పటికీ దూర ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఏపీలో పని చేస్తున్న ఉద్యోగులను, తెలంగాణ జిల్లాలకు బదిలీ చేసిన హెచ్ఓడీ ఉద్యోగులను తిరిగి హెచ్ఓడీలకు తీసుకురావాలని విన్నవించారు. ఈ విషయమై రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేస్తారని సంపూర్ణ విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తూ మాట నిలుపుకున్న సీఎం ఎ.రేవంత్ రెడ్డి నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

సమాజంలో హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి

- ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నందిని సుందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

సమాజంలో హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నందిని సుందర్ అన్నారు. పౌర హక్కుల సంఘం యాభై వసంతాల ముగింపు సభ రెండవ రోజు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సభలో ప్రొఫెసర్ నందిని సుందర్ హాజరై మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆదివాసి చట్టాలను ఏమాత్రం అమలు చేయడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు నివాస ప్రాంతాల్లో ఉన్న ప్రకృతి సంపదను దోచుకోవడం కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఉద్యమాలను ప్రతిఘటించే వారిపై కఠినంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆమె మండిపడ్డారు. ప్రకృతి సంపదను దోచుకోవడం వల్ల ఆదివాసులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ప్రత్యక్షంగా పరోక్షంగా వారిపై దాడులు కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని ఆమె విచారణ వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పౌర హక్కులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. పౌర హక్కుల సమన్వయ కమిటీ కన్వీనర్ క్రాంతి చైతన్య మాట్లాడుతూ ఫాసిస్టు విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య హక్కులను పోరాడుదామని నినాదంతో ముందుకు సాగాలన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సాధించకుండా రామాలయ నిర్మాణానికి హిందూ రాజ్య స్థాపన కోసం ప్రయత్నాలు సంఘం ఖండిస్తోందన్నారు. దేశం ఎదుర్కొంటున్న మౌలికమైన సమస్యలను తీర్చి ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలన్నారు. ప్రజల నిత్యవసరాలు సమస్యలనుకు మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సత్తన్న గల్లి శ్రీ శంకర్ జీ హనుమాన్ జీ. దేవాలయ కమిటీ ప్రతినిధులు జీ నరేష్ గౌడ్ , బి.రాజు ముదిరాజ్, కే.మోహన్ గౌడ్ తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలి

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దేశ ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఓడించాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు సూచించారు.ఆదివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మెదక్, జహీరాబాద్, నిజామాబాద్ కు చెందిన శరత్ చందర్ రెడ్డి, నర్సింగ్ మాదిగ, గోవర్ధన్ ముదిరాజ్ నాయకత్వంలో అనేక మంది లోక్ దళ్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తామే అధికారంలోకి వస్తామని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇతర పార్టీలతో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నాయని ప్రశ్నించారు.శుష్క వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి, కార్పొరేట్, ప్రైవేటు సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గృహిణి అదృశ్యం..

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఇంట్లో నుండి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ జాఫర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ శివలాల్ ప్రాంతానికి చెందిన అనూప్ సింగ్, వర్షా భాయి(23) భార్య, భర్తలు. అనూప్ సింగ్ ఇండియన్ గ్యాస్‌లో డెలివరీలో పని చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9గంటల ప్రాంతంలో జిన్సి చౌరాహి ప్రాంతంలో గ్యాస్ డెలివరీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంట్లో భార్య లేదు. పక్కల ఉన్న వారికి అడిగితే ఉదయం కొడుకు ఆధార్ అప్ డేట్ చేసుకువస్తానని పురానపూల్‌కు వెళ్లిందన్నారు. స్థానికంగా, రక్త సంబంధాలుతో వకాబూ చేసిన ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 8712569217, 8712661279లకు సమాచారం అందించాలని కోరారు.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com
హైదరాబాద్
సోమవారం 11 మార్చి 2024



ఖాళీ సమయం దొరికితే చాలు సీరియళ్లు, షాపింగ్‌లు లేదా ఇరుగింటి పొరుగింటి వారితో ముచ్చట్లు. సాధారణంగా సగటు మహిళల జీవితాల్లో మనం చూస్తున్నది ఇదే. సెల్ ఫోన్లు చేతికొచ్చిన తర్వాత మానవ సంబంధాలకు పూర్తిగా దూరమయ్యాము. ఇంట్లో కూర్చునే కావలసినవి ఆర్డర్ ఇచ్చి తెప్పించుకుని సరదా తీర్చుకుంటున్నాం. అయితే వీటన్నింటికి భిన్నంగా పదిమందికి ఉపాధి కల్పిస్తూ, ఇంట్లో కూర్చునే ఆర్థికంగా ఎదగవచ్చు అనే ఆలోచన వచ్చింది ఆమెకు. అంతే తనకు తెలిసిన టెక్నాలజీని కాలక్షేపానికి కాకుండా ఉపాధి కోసం మలుచుకుంది. ఫేస్‌బుక్‌లో ఒక గ్రూప్ క్రియేట్ చేసి వందల మందికి క్రోచెట్ వర్క్ నేర్పిస్తున్నారు మాధవి సూరి భట్ల. 'రికార్డ్సుల్లో మన పేరు ఉండటం కాదు మన పేరు మీదే రికార్డ్స్ ఉండాలి' అంటున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ఆమె కళ పదిమందికి ఉపాధి



తండ్రి టీచర్‌గా చేసి రిటైర్ అయ్యారు. తల్లి గృహిణి. అక్కా, అన్నయ్యలు అందరూ ప్రభుత్వ ఉద్యోగులే. మాధవి ఎం.ఎ పర్సనల్ మేనేజ్మెంట్, ఎం.బి.ఎ. మార్కెటింగ్ చేసి అంతటితో ఆగిపోకుండా ఎల్ఎల్‌బీ కూడా పూర్తి చేశారు. కొన్నేండ్లు హెచ్.ఆర్ మేనేజర్‌గా ఒక ప్రైవేట్ సంస్థలో పని చేసారు. భర్త ఒక ప్రైవేట్ కంపెనీలో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. పిల్లలు సెటిల్ అయ్యాక జాబ్ మానేసి తనకు వచ్చిన క్రాఫ్ట్ వర్క్, సంగీతం నలుగురికి నేర్పించాలి అని మధు క్రాఫ్ట్ ఎన్ క్రియేషన్స్ పేరుతో ఫేస్‌బుక్‌లో ఒక పేజ్ క్రియేట్ చేశారు. తను తయారు చేసిన వస్తువులను అందులో పోస్ట్ చేసేవారు.

మహిళా మనోవికాస్‌గా...

కోవిడ్ టైంలో ఆమె చేసిన క్రాఫ్ట్ వర్క్స్ చూసి కొంత మంది నేర్పించమని అడిగారు. దాంతో ఆన్‌లైన్ క్లాసులు పెట్టి నేర్పించడం మొదలుపెట్టారు. అలా మొదలైన ఆ శిక్షణలో ఇప్పటి వరకు 1100 మందికి ట్రెనింగ్ ఇచ్చారు. ఆన్‌లైన్ క్లాసులు కావడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల వాళ్ళు మాధవి వద్ద క్రాఫ్ట్ వర్క్ నేర్చుకుంటున్నారు. తనతోపాటు ఆమె వద్ద నేర్చుకున్న స్టూడెంట్స్ కూడా వారు తయారు చేసినవి ఆ ఫేస్ బుక్ గ్రూప్‌లో పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. అందుకే పేజ్ పేరును మహిళా మనోవికాస్‌గా మార్చేశారు. ఈ గ్రూప్ సభ్యులు ఇప్పటివరకు రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. 3వ రికార్డు కోసం ఈ సెప్టెంబర్‌లో ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా ఇంట్లో ఉంటూనే ఖాళీ సమయంలో క్రోచెట్ వర్క్ చేసుకుంటూ ఉపాధి పొందుతూ రికార్డ్స్ కూడా సాధించవచ్చు అని మాధవి నిరూపించుకున్నారు. 'ఒక సాధారణ గృహిణి కూడా రికర్డ్స్ బద్దలు కొట్టవచ్చు' అంటారు ఆమె.

నిరాశ చెందకుండా...

మాధవి దగ్గర క్రోచెట్ వర్క్ నేర్చుకున్న వాళ్లలో వైద్యులు, ఐటీ ఉద్యోగులు,హెచ్ ఆర్ మేనేజర్లతో పాటు వివిధ ప్రముఖ రంగాలలో పని చేస్తున్న మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు తనకు వచ్చిన కళలతో ఏడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్సను ఆమె సాధించారు. 'మనకి వచ్చిన విద్య నలుగురికి ఉపయోగపడడం అనేది చాలా సంతోషాన్ని ఇస్తుంది. గత 35 ఏండ్లుగా ఈ క్రోచెట్ వర్క్ చేస్తున్నాను. కోవిడ్ సమయంలో ఆన్లైన్ తరగతులు మొదలుపెట్టాను. గిన్నిస్ రికార్డ్ కోసం చేసినవన్నీ డబ్బులు పెట్టి కొనుక్కోలేని వారికి, అవసరమైన వారికి ఉచితంగా ఇచ్చేశాను. ప్రతి ఏడాది మన దేశ సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్న జవాన్లకు క్యాప్స్, కౌల్స్ బహుమతిగా ఇస్తుంటాను. ఇంటికే పరిమితమై ఏమీ చేయలేకపోతున్నాం అని నిరాశ పడకుండా ఇంట్లో ఉండి కూడా ప్రపంచ రికార్డులు సాధించి, జీవితంలో గుర్తింపుని, ఖాళీ సమయాన్ని ఆదాయ మార్గంగా మలుచుకోవచ్చు అని ఈ వర్క్ ప్రారంభించిన తర్వాతే తెలిసింది. అందుకే సాధ్యమైనంత ఎక్కువ మందికి ఈ కళను నేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాను' అంటున్నారు ఆమె.

ఒత్తిడి తగ్గుతుంది

'ఉద్యోగాలు చేసే మహిళలే ఒత్తిడికి గురవుతారనుకుంటే పొరపాటు. ఇంట్లో ఉండే మహిళలైనా ఇంటి పని, పిల్లల పనితో అనేక రకాలుగా ఒత్తిడికి గురవుతుంటారు. ఈ క్రోచెట్ వర్క్ వలన మానసిక ఒత్తిడి తగ్గుతుంది. అంతేకాదు ఇంటి అలంకరణకు అవసరమైనవి స్వయంగా తయారు చేసుకోవచ్చు. అలాగే ఆర్డర్స్ మీద కూడా చేసి ఆదాయం పొందవచ్చు' అంటారు మాధవి.

ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి

నేటి సమాజంలో చాలా మంది దిశా నిర్దేశం లేకుండా జీవిస్తున్నారు. ఎటువంటి కళా నైపుణ్యం మీద ఆసక్తి చూపకుండా కేవలం సెల్‌ఫోన్‌కి అలవాటుపడిపోతున్నారు. సోషల్ మీడియాకు బానిసలైపోతున్నారు. అటువంటి మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడే ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి ఉండాలంటారు మాధవి. మున్ముందు ఆమె మరెన్నో ప్రపంచ రికార్డులు సాధించాలని, తాను కోరుకున్నట్టు ఎంతో మందికి ఈ కళను పరిచయం చేయాలని కోరుకుందాం.

- పాలపర్తి సంధ్యారాణి





భానుడి ప్రతాపం పెరుగుతోంది. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏ కాలం ఎలా ఉన్నా ఈ వేసవిలో మాత్రం నీరు బాగా తాగితేనే శరీరం వాతావరణ ప్రభావాన్ని కాస్త తట్టుకోగలుగుతుంది. అలా చేయకపోతే డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంది. అయితే సరిపోనూ నీరు తాగుతున్నామా లేదా అని శరీరంలో ఏర్పడే కొన్ని లక్షణాలు చెబుతాయి. అవేంటంటే...

ఈ లక్షణాలుంటే జాగ్రత్త...!

శరీరం 75 శాతం నీటితో నిండి ఉంటుంది. కాలాలతో సంబంధం లేకుండా ఏ కాలంలో అయినా నీరు బాగా తాగాలి. లేదంటే శరీరంలో కొన్ని పనులు నియంత్రించబడతాయి. కొన్ని అనారోగ్య సమస్యలూ ఉత్పన్నమవుతాయి. అందులో యూరిన్ ఇన్ఫెక్షన్, మలబద్ధకం, అజీర్తి సమస్యలు ముఖ్యంగా చెప్పుకోదగినవి. ఇవి శరీరం లోపల ఏర్పడేవి. ఇక బయటికి కనిపించే వాటిలో ముఖంపై మొటిమలను చెప్పుకోవచ్చు. అంతేకాదు నీటి కొరత వల్ల కిడ్నీలపై ఒత్తిడి ఏర్పడి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల నీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి.

డీ హైడ్రేషన్ లక్షణాలు

- శరీరంలో నీటి కొరత కారణంగా మూత్రం ముదురు పసుపు రంగులోకి మారుతుంది. దీనిని వెంటనే గుర్తించి నీటిని తాగాలి. లేదంటే సమస్య మరింత తీవ్రమవుతుంది.
- శరీరంలో సరిపోను నీరు లేకపోవడం వల్ల విషపదార్థాలు పెరిగి ముఖంపై మొటిమలు ఏర్పడతాయి. ఈ సమస్య ఏర్పడితే సరిపడా నీరు తాగడంలేదని అర్థం.
- ప్రైవేట్ పార్ట్స్‌లో దురద లేదా మంట వంటి సమస్యలు ఎదురవుతాయి.
- యూరిన్ ఇన్‌ఫెక్షన్ ప్రమాదమూ పెరుగుతుంది. దీని వల్ల మూత్ర విసర్జన సమయంలో మంట మొదలవుతుంది.
- నీటి కొరత కారణంగా చర్మం పొడిగా, నిర్జీవంగా కనిపిస్తుంది.
- చిన్న వయసులోనే ముడతలు కనిపించి ఏజ్ బార్‌గా కనిపిస్తారు.
- కండ్ల కింద నల్లటి వలయాలు నిద్రలేమి వల్ల మాత్రమే కాకుండా శరీరంలో నీటి కొరత వల్ల కూడా ఏర్పడతాయి.
- తలనొప్పి సమస్య వేధిస్తుంది.
- శరీరంలోని కండరాలలో నొప్పి, తిమ్మిర్లు వంటి సమస్యలు మొదలవుతాయి.
- విపరీతమైన అలసట, ఒత్తిడి, గందరగోళం, ఏకాగ్రత లోపించడం వంటి మానసిక ఇబ్బందులు కూడా శరీరంలో నీటి కొరత వల్ల ఏర్పడతాయి.

బిల్ కలెక్టర్లకు 'గృహజ్యోతి' కష్టాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్‌శాఖలో బిల్ కలెక్టర్లకు గృహజ్యోతి కష్టాలొచ్చిపడ్డాయి. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ప్రకటించడంతో బిల్లులు చెల్లించేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దాదాపు 30 ఏండ్లుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో 600 మంది బిల్ కలెక్టర్లు కమిషన్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇప్పుడు వీరి కొలువులకే ఎసరు వచ్చింది. బిల్ కలెక్షన్ తగ్గడంతో సిబ్బందిని తగ్గించుకోవాలని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి. బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్న 600 మంది ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎస్ఈబీ ఉన్నప్పటి నుంచి, ఇప్పటి డిస్కంల వరకూ పనిచేస్తున్నారు. 1987లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో విద్యుత్ సంస్థల్లో స్లాబ్ సిస్టం అమల్లో ఉండేది. అప్పుడు వీరందరూ శాశ్వత పనివిధానంలో ఏజెన్సీల ద్వారా నియమితులయ్యారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో క్యాషియర్స్ చేయాల్సిన పనిని కాంట్రాక్ట్ పద్ధతిలో బిల్ కలెక్టర్ల ద్వారా చేయిస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ పేరుతో ప్రజలు విద్యుత్ బిల్ కలెక్షన్ సెంటర్ల వద్దకు వచ్చి డబ్బులు చెల్లించడం తగ్గిపోయింది. విద్యుత్ సంస్థలు కూడా ఆన్‌లైన్‌లోనే డబ్బులు కట్టండంటూ ప్రచారం చేయడంతో బిల్ కలెక్టర్లకు వచ్చే కమిషన్ మొత్తం గణనీయంగా పడిపోయింది. గృహజ్యోతి పథకం అమల్లోకి రాకముందు వీరికి నెలకు కమిషన్ పద్ధతిలో నెలకు రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు వచ్చేది. ఇప్పుడు ఆ సొమ్ము కూడా వచ్చే పరిస్థితి కనిపించట్లేదని బిల్ కలెక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన 18 ఏండ్లుగా యాజమాన్యాలు వీరికిచ్చే పీస్‌రేట్ చార్జీలను కూడా పెంచలేదు. 2005లో సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తే పెరిగిన కమిషనే వీరికి ఇప్పటికీ వర్తిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో వీరు కూడా సకల జనుల సమ్మెలో పాల్గొన్నారు. 36 రోజులు విధులకు దూరంగా ఉండి, ఆర్థికంగా నష్టపోయారు. విద్యుత్ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 23 వేల మంది కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించారు. కానీ అప్పటికే 25 ఏండ్లుగా రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లను ఈపీఎఫ్, ఈఎస్ఐ లేవనే సాకుతో 2016లో ఆర్టిజన్స్‌గా గుర్తించలేదు. శాశ్వత పని విధానంలో ఏండ్ల తరబడి పని చేస్తున్న కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వకుండా పని చేయించుకోవడం ముమ్మాటికీ యాజమాన్య నిర్లక్ష్యమే! దీనికి ఆయా విద్యుత్ సంస్థలే జవాబుదారీ వహించాల్సి ఉంటుంది. కానీ దాన్ని ఒప్పుకొనేందుకు ప్రభుత్వం, యాజమాన్యం సిద్ధంగా లేకపోవడం గమనార్హం. కరోనా సమయంలోనూ బిల్ కలెక్టర్లు విధులు నిర్వహించారు. అయినా ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోలేదు. విద్యుత్ సంస్థల్లో పర్మినెంట్ కార్మికులకు నాలుగు సార్లు వేతన ఒప్పందాలు జరిగినా, వీరికి మాత్రం కమీషన్ చార్జీలు పైసా పెరగలేదు. ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపు, గ్రామాల్లో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది కూడా విద్యుత్ బిల్లులు వసూలు చేస్తుండటంతో బిల్ కలెక్టర్ల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈనెల 1వ తేదీ నుంచి విద్యుత్ సంస్థలు వినియోగదారులకు గృహజ్యోతి స్కీం ద్వారా జీరో బిల్లులు ఇస్తున్నాయి. దీనితో ఉన్న కొద్ది ఆర్థిక ఉపాధిని కూడా కోల్పోతున్నారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు మానవతా కోణంలో తమకు ప్రత్యామ్నాయ పని చూపాలనీ, ఆర్టిజన్లుగా గుర్తించి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. మూడు దశాబ్దాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఏదో ఒక రోజు సంస్థలో పర్మినెంట్ అవుతామనే ఆశతో పనిచేస్తున్నామని బిల్ కలెక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ ఆఫీసుల్లో ఉద్యోగాలు ఇవ్వాలి



ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసుల్లో బిల్ కలెక్టర్ల సేవల్ని వినియోగించుకోవాలి. మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న వారిని వీధులపాలు చేయడం సరికాదు. బిల్ కలెక్షన్లు ఆన్‌లైన్ అయ్యాక వారి పీస్‌రేట్ కమిషన్ తగ్గిపోయింది. గృహజ్యోతితో వచ్చే ఆదాయం పూర్తిగా పోయింది. అందువల్ల వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి. ఆర్టిజన్లుగా గుర్తించాలి. వారికి అన్యాయం చేస్తే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తాం.

- కే ఈశ్వరరావు, అధ్యక్షులు, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

30 ఏండ్లుగా చేస్తున్నా...పీస్ రేటే...



ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో 30 మంది బిల్ కలెక్టర్లు 20 ఏండ్లుగా పనిచేస్తున్నారు. ఇప్పటికీ మాకు పీస్‌రేట్ జీతాలే చెల్లిస్తున్నారు. సంస్థను నమ్ముకొని, మమ్మల్ని ఉద్యోగులుగా గుర్తిస్తారనే ఆశతో ఇన్నేండ్లుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వరంగ సంస్థలే ఇలా వ్యవహరిస్తే...మా సమస్యల్ని ఎవరికి చెప్పుకోవాలి. తక్షణం ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించి, మమ్మల్ని ఆర్టిజన్లుగా గుర్తించేలా ఆదేశాలు ఇవ్వాలి.

- పీ గంగాప్రసాద్, బిల్ కలెక్టర్, నిర్మల్ ఈఆర్ఓ

జీవితాలు కోల్పోయాం



బిల్ కలెక్టర్లుగా పీస్ రేట్ జీతాలతో విద్యుత్ సంస్థల్లో మూడు దశాబ్దాలుగా పనిచేస్తూ జీవితాలు కోల్పోయాం. ఏదో ఒకరోజు మా సేవల్ని గుర్తించి, పర్మినెంట్ చేస్తారనే ఆశతో ఉన్నాం. గృహజ్యోతితో ఇప్పుడున్న ఉపాధే కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి.

- కే రమేష్, బిల్ కలెక్టర్, భద్రాచలం ఈఆర్ఓ

బీఆర్ఎస్ సర్కారు ఏకపక్ష నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలు, నిధుల కోసం ప్రత్యేక రాష్ట్రమంటూ సాగిన ఉద్యమంలో పాల్గొన్న నేతలు, మేధావులతోనూ మాజీ సీఎం కేసీఆర్ చర్చించలేదని విమర్శించారు. డిజైన్ మార్పు చేసి చేపట్టే నిర్మాణంతో నిర్వహణ, విద్యుత్ ఖర్చులు ఎక్కువవుతాయని నిపుణులు చెప్పిన సూచనలనూ పెడచెవిన పెట్టారని తెలిపారు. నిపుణుల కమిటీ వేయడం, నిర్దిష్ట సమయంలోపు నివేదిక తెప్పించుకోవడం, అఖిలపక్షం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తీసుకోవడం, సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నివేదికను నెలరోజుల్లో ఇచ్చేలా ఒత్తిడి చేయడం వంటి చర్యలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరిగిన నష్టానికి బాధ్యులెవరో గుర్తించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కోదండరాం నేతృత్వంలో మేడిగడ్డను సందర్శించి సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమవుదామని సమావేశంలోని భాగస్వాములకు ఆయన సూచించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ మేడిగడ్డలో 3 పిల్లర్లు కాదు... 3 వ్యవస్థలు కుప్పకూలిపోయాయని ధ్వజమెత్తారు. ఐక్యరాజ్య సమితి కోసం పని చేసిన అనుభవజ్ఞుడు హనుమంతరావు సైతం ప్రాజెక్ట్ కట్టవద్దని చెప్పినా వినలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం డిజైన్లు కూడా కాంట్రాక్టర్లకే అప్పగించారు. ప్రాజెక్టు మెయింటెనెన్స్‌ను కాగ్ తప్పుబట్టిందని గుర్తుచేశారు. భూకంపాలు వచ్చే చోట మల్లన్న సాగర్ కట్టారని తెలిపారు. రూ.లక్షకు 87వేల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా కుప్పకూల్చారు. అంతర్జాతీయ నిపుణుల సర్వే చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ముందుకు సాగితేనే ప్రజలకు, రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కాగ్ నివేదికలను నమ్మమంటూ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్వహణ ఖర్చు, అప్పులకు వడ్డీ ప్రతి ఏటా పెరుగుతుందని చెప్పారు. ప్రాణహిత పూర్తి చేస్తే ఇంత ఖర్చయ్యేది కాదు. కేసీఆర్ స్వయం ప్రకటిత ఇంజినీర్ అని ఎద్దేవా చేశారు. కుక్క పని కుక్క చేయాలి. గాడిద పని గాడిద చేయాలి. ఒకరి పని మరొకరు చేస్తే ఇలాగే ఉంటుందని విమర్శించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ రీడిజైన్ పేరుతో నిధులు దుబారా చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను అరెస్ట్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పని చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం ఉందా? లేదా అనేది ప్రజలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని మురళి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ కన్నెగంటి రవి, సీపీఐ నాయకురాలు పశ్య పద్మ, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, బైరి రమేష్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్ పాల్గొన్నారు.

కాసులుంటే చాలు..

(మొదటిపేజీ తరువాయి)

కాపాడుతామని చెప్పింది. అందుకు రెవెన్యూ అధికారుల నుంచి మండలాల వారీగా పాత రికార్డు, సేత్వారు ప్రకారం వివరాలు సేకరించే పనిలో పడింది. కానీ పక్కాగా ఆ భూములు ప్రభుత్వ భూములని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిసింది. ఫిర్యాదులు చేసిన ఒకట్రెండు రోజుల్లోనే బాధితులకు ఫోన్ కాల్స్ రావడంతో తేరుకోలేకపోతున్నారు.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేదారిలో మహేశ్వరం మండలం కొంగరకుర్దు(ఏ) రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 2 నుంచి 400 వరకు దర్గా సయ్యద్ శరాజ్ ఖత్తాల్ హుస్సేన్ ఖిబ్లా పేరిట రికార్డుల ప్రకారం సుమారు 500 ఎకరాలకు పైగా వక్ఫ్ భూమి ఉంది. 1954 నుంచి రికార్డుల్లో పట్టాదారు కాలంలో దర్గా పేరు నమోదైంది. ఇందులో సర్వే నెంబర్ 86, 87, 88, 89లో సుమారు 52.25 ఎకరాలు భూమిని చెట్యారి వారసులు సాగు చేసుకుంటున్నారు. 2010లో రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం వక్ఫ్‌బోర్డుకు నష్ట పరిహారం కూడా చెల్లించింది. అయితే ఈ భూమి ఓఆర్‌ఆర్‌కు ఆనుకొని ఉండటంతో ఆనాటి ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు పత్రాలతో ఓఆర్సీలు సృష్టించి 52.25 ఎకరాల భూమిని కాజేశారు. అయితే ఈ భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినదిగా రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. అయినా ఆ భూములను కాపాడటంలో గత ప్రభుత్వ వైఫల్యం చెందింది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న ఫిర్యాదుదారులు నిరాశే ఎదురవుతోందంటున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇదే మండలం నాగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 181, 182లో 50 ఎకరాల భూదాన్ భూమిని పట్టా భూములుగా మార్చి ప్రభుత్వ పెద్ద అండతో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీకి అప్పగించారు. స్థానికులు కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఈ భూములు భూదాన్ భూములని తేల్చింది.అయినా ఇంకా ప్రభుత్వ స్వాధీనం కాలేదని తెలిసింది. ఇలాంటివి జిల్లాలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు గత ప్రభుత్వంలో కబ్జాకు గురయ్యాయి. ఆ భూములపై అధికార పార్టీ నాయకులు పెద్దల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆ పార్టీ నేతలు మాట్లాడుకోవడం గమనార్హం.

రియల్ వ్యాపారుల ఎరలో పెద్దలు

గత ప్రభుత్వంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూములు పెద్దల కనుసన్నల్లోనే కబ్జాకు గురయ్యాయని, వారిపై చర్యలు తప్పవని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కానీ ప్రభుత్వంలో ఉన్న కొంత మంది పెద్దలు.. గత ప్రభుత్వంలో మాదిరిగానే రియల్ వ్యాపారుల ఎరలో పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేసిన వెంటనే రియల్ వ్యాపారులతో మంతనాలు జరిపి సమస్యలు బయటికి రాకుండా కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని అధికార పార్టీ నాయకులే చెప్పుకుంటున్న పరిస్థితి ఉంది. ఫిర్యాదులపై ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణయాలు ఎంత గొప్పగా ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు చేయకపోతే ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించి ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గతం వద్దు.. భవిష్యత్తు గురించి ఆలోచిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఏ కార్యకర్త కూడా దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గంప గోవర్ధన్ మీకు అండగా ఉన్నారని, ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో తాము ఎంత ఇబ్బంది పడుతున్నారో రైతులకు తెలుసని, పంటలు ఎండిపోయి పెట్టుబడి రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గొర్రె కసాయి వాడిని నమ్మినట్టు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోయారన్నారు. రైతుబంధు మూడెకరాలకు మించి ఇప్పటికీ పడలేదని, కేసీఆర్ కామారెడ్డిలో గెలిస్తే రైతుల పొలాలు గుంజుకుంటాడని కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని తెలిపారు. రాష్ట్రంలో 119 ఎమ్మెల్యే సీట్లలో 39 సీట్లు గెలవడం చిన్న విషయం కాదని, ప్రజలు ఏ తీర్పు ఇచ్చినా వారి పక్షాన ఉండి వారికి న్యాయం చేయడానికి బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని చెప్పారు. తండ్రి పేరు చెప్పుకొని నేను పదవులు పొందుతున్నానని రేవంత్ అంటున్నారని, బరాబర్ మా తండ్రి పేరు చెప్పుకుంటానని, ఆయన తెలంగాణ కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన వ్యక్తి అని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డికి రైతులపై ప్రేమ ఉంటే పార్లమెంట్ కోడ్ అమల్లోకి వచ్చేలోపు రైతులకు ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తానన్న దానికి జీవో తేవాలని తెలిపారు. ప్రస్తుతం కరెంటు సరిగ్గా లేక నీరందక ఎండుతున్న వరి పంట పొలాలకు ఎకరానికి రూ.10వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో తాము ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీకి మార్చి 17 నాటికి వంద రోజులు నిండుతాయని, ఆ తర్వాత మనమంతా జనాల్లోకి వెళ్లి ఇచ్చిన హామీలు ఎందుకు అమలుకాలేదో నిలదీద్దామన్నారు. అనంతరం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ విప్ గంప గోవర్ధన్ మాట్లాడారు. సమావేశంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ముజీబొద్దీన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ పరికి ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ వైస్‌చైర్మెన్ ఇంద్రసేనారెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, తిరుమల్‌రెడ్డి, సుమిత్రానంద్, రమేష్‌గుప్తా, లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ముందే డిష్యూం డిష్యూం

గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైన సమావేశం అప్పటివరకు ఎదురుచూసిన కార్యకర్తల్లో నిరాశను నింపింది. దీనికి తోడు స్టేజీపై నిలబడిన వ్యక్తులను అక్కడి నుంచి వెళ్ళమనడంతో విసిగిపోయిన కార్యకర్తలు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. సీనియర్ నాయకులు తిరుమల్‌రెడ్డి మాట్లాడుతుండగా.. గంప పేరును చెప్పలేదని కార్యకర్తలు సమావేశంలో గలాటా సృష్టించారు. దాంతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మైకు తీసుకొని కార్యకర్తలకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ సమావేశానికి కామారెడ్డికి చెందిన రాష్ట్ర నాయకులు నిట్టు వేణు దూరంగా ఉండటం గమనార్హం.

రాముడ్ని కూడా ఈడీతో వెంటాడేవారు..

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ సమన్లు జారీ చేసిన నేపథ్యంలో ఆయన పై విధంగా వ్యాఖ్యలు చేశారు. ఈడీ సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోని విషయం తెలిసిందే. ఆప్ సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తే బీజేపీ ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విపక్ష ప్రభుత్వాలను వేధించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు.

బీజేపీని మట్టికరిపించడమే ఇండియా లక్ష్యం : స్టాలిన్

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ శ్రేణులు లోక్‌సభ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాషాయ పార్టీని మట్టికరిపించేందుకు విపక్ష ఇండియా కూటమితో కలిసి సమిష్టిగా ముందుకు సాగుతామని చెప్పారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండేందుకు వివిధ రాష్ట్రాల్లో పలు పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నాయని, సీట్ల సర్దుబాటు వివిధ రాష్ట్రాల్లో తుది దశకు చేరుకుందని స్టాలిన్ వివరించారు. ఇక తమిళనాడులో పాలక డీఎంకే విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో కలిసి సీట్ల సర్దుబాటును ఖరారు చేసింది. కాంగ్రెస్ 9 స్థానాల్లో పోటీ చేయనుండగా, పాలక డీఎంకే 21 స్థానాల్లో బరిలో నిలవనుంది.

ఎండీఎంకే, ఐయూఎంఎల్, కేఎండీకే ఒక్కో స్థానంలో పోటీ చేయనుండగా, వీసీకే, సీపీఐ(ఎం), సీపీఐకి రెండేసి లోక్‌సభ స్థానాలను కేటాయించారు. పుదుచ్చేరిలోని ఒక లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ బరిలో నిలుస్తుంది. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమి 38 స్థానాలను గెలుచుకుని ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ తాను పోటీ చేసిన 9 స్థానాల్లో ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించింది.

బజ్‌బాల్‌కు బడితపూజ

బజ్‌బాల్.. టెస్టు క్రికెట్‌లో ఇంగ్లాండ్ ఆవిష్కరించిన సరికొత్త దూకుడు మంత్ర. ఇంటా, బయటా బజ్‌బాల్ మేనియాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. బలమైన భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు సైతం బజ్‌బాల్ అండతో సిద్ధమైంది.

టెస్టు స్పెషలిస్ట్‌లు పుజారా, రహానె సహా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి దూరమయ్యారు. కెఎల్ రాహుల్ సైతం గాయంతో అందుబాటులో లేడు. తొలి టెస్టులో అనూహ్య విజయం ఇచ్చిన ఉత్సాహంలో ప్రత్యర్థి కాలు దువ్వుతున్న తరుణం. ఇక్కడే భారత్ యువ మంత్ర జపించింది. యశస్వి, గిల్, సర్ఫరాజ్, జురెల్, ఆకాశ్ దీప్ వంటి యువ ఆటగాళ్లకు దన్నుగా నిలిచింది. ఆ ఫలాలను మెరుపువేగంతో అందుకుంది.

టీమ్ ఇండియాకు బజ్‌బాల్ రూపంలో పొంచి ఉన్న ప్రమాదం తెలుసు. ప్రత్యర్థి బలాన్ని గౌరవించింది. సహజశైలి నుంచి వేగంగా బయట పడింది. బజ్‌బాల్‌ను ఢీకొట్టేందుకు సరికొత్త పంథా అన్వేషణలో సఫలం అయ్యింది. ఆంటోనీ డీ మెల్లో ట్రోఫీని 4-1తో సొంతం చేసుకుంది.

- సరికొత్త పంథాలో మెప్పించిన భారత్
- వేగంగా పాఠాలు నేర్చుకున్న రోహిత్‌సేన

నవతెలంగాణ క్రీడావిభాగం



భారత్, ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ అనగానే.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కోసం పోటీ మాత్రమే కాదు. అంతకుమించి.. ఎంతో ఉంది. బజ్‌బాల్ మంత్రతో భారత్‌కు వచ్చిన ఇంగ్లాండ్ ఇక్కడి పిచ్‌లపై ఆతిథ్య జట్టును నిలువరిస్తుందా? బజ్‌బాల్ మేనియాను టీమ్ ఇండియా ఎదుర్కొగలదా? వేగంగా పరుగులు చేయగల బ్యాటింగ్ లైనప్‌పై నాణ్యమైన స్పిన్ దళం మాయ ఏ మేరకు పని చేస్తుంది? జీవం లేని పిచ్‌లపై ఇంగ్లాండ్ బ్యాటర్ల దూకుడుకు ముకుతాడు వేసేందుకు భారత బౌలర్ల వద్ద సరైన అస్త్రాలు ఉన్నాయా? ఇలా.. ప్రపంచ క్రికెట్ విశ్లేషకులు ఈ సిరీస్ ఆరంభానికి ముందు ఎన్నో సందేహాలు లేవనెత్తారు. బజ్‌బాల్, స్పిన్‌బాల్ ఢీ అభిమానుల్లో ఆసక్తి, విశ్లేషకుల్లో ఉత్కంఠ రేపగా టెస్టు క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రత్యర్థి దూకుడు అస్త్రంతో సవాల్ విసరటం, కీలక ఆటగాళ్లు జట్టుకు దూరం కావటం ఆతిథ్య భారత్‌ను బలహీన పరచలేదు, సమరానికి సై అనేందుకు రెట్టింపు ఉత్సాహం అందించింది. బజ్‌బాల్‌ను ఓడించేందుకు టీమ్ ఇండియా స్పిన్‌బాల్ అస్త్రం అద్భుతంగా ప్రయోగించింది. ప్రత్యర్థి బలం, బలహీనతలను గౌరవించిన రోహిత్‌సేన.. ఆ తర్వాత ప్రత్యర్థిని ఎలా పడగొట్టాలనే వ్యూహం రచించింది. ఆ దిశగా భారత జట్టు వందకు వంద శాతం విజయవంతమైంది.

సంప్రదాయ పిచ్‌లు

గత ఏడాది ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ సందర్భంగా పిచ్‌లపై పెద్ద రాద్ధాంతమే నడిచింది. తొలి రోజు ఉదయం సెషన్లోనే బంతి గిరగిరా తిరిగే పిచ్‌లను సిద్ధం చేయటం చర్చనీయాంశమైంది. స్వదేశంలో ఫలితాలు రాబట్టే పిచ్‌ల వైపు అన్ని జట్లు మొగ్గు చూపుతున్నాయని, భారత్ సైతం అదే బాటలో నడుస్తుందని కోచ్ రాహుల్ ద్రవిడ్ సెలవిచ్చాడు. గత ఏడాది ఆసీస్‌తో సిరీస్‌కు సిద్ధం చేసినట్టు ఇంగ్లాండ్‌కు ర్యాంక్ టర్నర్‌లతో స్వాగతం పలుకలేదు. అందుకు భిన్నంగా సంప్రదాయ భారత పిచ్‌లను సిద్ధం చేశారు. ఇక్కడే, ఇంగ్లాండ్ కోసం భారత్ ఏ విధంగా సిద్ధమైందో అవగతం అవుతుంది. ఆసీస్‌తో టెస్టులకు భారత్ సూర్యకుమార్ యాదవ్‌ను బరిలోకి దింపింది. స్వల్ప స్కోర్లు నమోదయ్యే స్పిన్ పిచ్‌లపై ధనాధన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపం మార్చగలిగే సత్తా సూర్యకుమార్‌కు ఉంది. మరి, ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌లో ప్రతి ఆటగాడు ఓ సూర్యకుమార్ యాదవే!. అందుకే, భారత్ ర్యాంక్ టర్నర్‌ల జోలికి వెళ్లలేదు. అందుకు భిన్నంగా సంప్రదాయ పిచ్‌లను ఎంచుకుంది. దీంతో మ్యాచ్ రెండు, మూడు రోజుల్లో ముగియకుండా ఉంటుంది. విజయం కోసం ప్రత్యర్థి ఎక్కువ సమయం పాటు రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. బ్యాటింగ్‌కు కష్టసాధ్యమైన హైదరాబాద్ టెస్టులో ఇంగ్లాండ్ విజయం, రాంచి టెస్టులో గట్టి పోటీ ఇవ్వటం ఈ కోవలోకే వస్తుంది. మ్యాచ్ వేగంగా ముగిస్తే అది ఇంగ్లాండ్‌కు అనుకూలంగా మారుతుందని టీమ్ ఇండియా ముందే గ్రహించింది. అందుకు పరిష్కారంగా సంప్రదాయ పిచ్‌లను ఎంచుకుంది.

సింగిల్స్ ఆపటం

బజ్‌బాల్‌కు భారత్ పూర్తిగా కొత్త. బజ్‌బాల్ మంత్రతో ఇంగ్లాండ్ బ్యాటర్ల ఎదురుదాడి, ప్రత్యర్థిని నిలువరించేందుకు ఎంచుకోవాల్సిన లెంగ్త్, లైన్‌పై మన బౌలర్లకు పెద్దగా స్పష్టత లేదు. స్పిన్‌బాల్‌కు ఇంగ్లాండ్ స్వీప్, రివర్స్ స్వీప్‌తో సమాధానం ఇచ్చింది. ఆ స్వీప్ షాట్‌కు షాక్‌కు ఇచ్చే వ్యూహం ఏంటి? హైదరాబాద్ టెస్టు అనంతరం భారత బౌలర్ల పరిస్థితి ఇది. కానీ భారత బౌలర్లు వేగంగా నేర్చుకున్నారు. అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్‌లు ఒలీ పోప్‌కు కాస్త భిన్నంగా బౌలింగ్ చేశారు. బౌల్డ్, ఎల్బీడబ్ల్యూ కోసం ప్రయత్నించే క్రమంలో పోప్‌కు పరుగుల వేటకు సులువైన బంతులు సంధించారు. హైదరాబాద్ టెస్టు ఓటమికి పలు కారణాలు ఉండగా, అందులో ప్రధానమైనది సింగిల్స్. ఉప్పల్‌లో ఇంగ్లాండ్ స్కోరులో సింగిల్స్ వాటా 36.61 శాతం కాగా, అదే భారత స్కోరులో సింగిల్స్ వాటా 35.99. తొలి టెస్టులో భారత్ 28 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. స్వల్ప వ్యత్యాసంతో చేజారిన టెస్టు మ్యాచ్‌లో ఈ గణాంకాలు కీలక భూమిక పోషించాయి. విశాఖపట్నం, రాజ్‌కోట్ టెస్టులో భారత్ గణాంకాలను మార్చివేసింది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ తీరులో మార్పులు రాగా.. భారత్ మాత్రం సింగిల్స్‌పై ఫోకస్ పెట్టింది. రాంచి, ధర్మశాల టెస్టుల్లోనూ ఇది కొనసాగింది. సింగిల్స్ ఆగటంతో సహజంగానే బ్యాటర్లపై ఒత్తిడి ఎక్కువైంది.

వ్యూహం మార్చుతూ..

మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహం మార్చటం టీమ్ ఇండియా విజయ రహస్యంలో ఒకటి. స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న బ్యాటర్‌పై ఒత్తిడి కొనసాగించేందుకు భారత్ సింగిల్స్‌ను సమర్థవంతంగా నిలువరించింది. ఈ క్రమంలో కొన్ని బౌండరీలు కోల్పోయేందుకు వెనుకాడలేదు. రాజ్‌కోట్ టెస్టులో బెన్ డకెట్ ఇన్నింగ్స్ అందులో ఒకటి. ఓ వైపు బెన్ డకెట్ స్లాగ్ స్వీప్ షాట్లు ఆడుతుండగా అశ్విన్, కుల్దీప్‌లు డీప్ మిడ్ వికెట్ ఫీల్డర్ లేకుండా సుదీర్ఘ స్పెల్స్ బౌలింగ్ చేశారు. ఎడమ చేతి వాటం బ్యాటర్‌కు స్టాక్ బాల్‌ను వేయలేదు. ఈ వ్యూహం మూడో రోజు ఉదయం ఫలించింది. డకెట్‌ను ఎల్బీ, బౌల్డ్ చేసే అవకాశాలు తగ్గినా మిడ్ వికెట్ ఫీల్డర్ లేకుండా బౌలింగ్ చేసిన కుల్దీప్.. బ్యాటర్‌ను భిన్నంగా ఆడేందుకు ఉసిగొల్పాడు. ఇక ధర్మశాల టెస్టులో కుల్దీప్ యాదవ్ 12 ఓవర్ల స్పెల్‌లో అద్భుతమే చేశాడు. అప్పటికే ఫలించిన వ్యూహం చివరి టెస్టులోనూ అమలు చేశాడు. బ్యాటర్ల స్కోరింగ్ అవకాశాలను తగ్గిస్తూ, మరోవైపు ఎటాకింగ్ షాట్ ఆడేందుకు ఫీల్డింగ్ ఓపెన్‌గా ఉంచుతూ సరికొత్త తరహాలో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఊరించారు. బజ్‌బాల్‌కు ఎదురుదాడి మంత్ర భారత బౌలర్లు ఇలా భిన్నమైన వ్యూహంతో కనిపెట్టారు. తొలి రెండు టెస్టుల్లో ఇంగ్లాండ్ స్పిన్నర్లు మెరుగైన గణాంకాలు నమోదు చేసినా.. సిరీస్ ముగిసేసరికి భారత స్పిన్నర్లు ఆధిపత్యం చూపించారు. భారత స్పిన్నర్లు 24.86 సగటుతో 69 వికెట్లు పడగొట్టగా.. ఇంగ్లాండ్ స్పిన్నర్లు 39.16 సగటుతో 60 వికెట్లు తీశారు.

యువ మంత్ర

కోహ్లి, రహానె, పుజారా లేకుండా ఓ దశాబ్ద కాలం తర్వాత భారత్ ఆడుతున్న తొలి సిరీస్. కానీ యువ ఆటగాళ్లతో భారత్ సత్ఫలితాలు రాబట్టింది. కుర్రాళ్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పించింది. స్వల్ప స్కోర్లు తుది జట్టులో చోటుపై ప్రభావం చూపవనే భరోసా కల్పించింది. ఫలితమే, యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్ సహా ఆకాశ్ దీప్‌లు ఆకాశమే హద్దుగా రాణించారు. జైస్వాల్ 712 పరుగులు చేయగా, గిల్ 452 పరుగులు బాదాడు. సర్ఫరాజ్ మూడు ఇన్నింగ్స్‌ల్లోనే 200 పరుగులు సాధించాడు. ధ్రువ్ జురెల్ సైతం మూడు ఇన్నింగ్స్‌ల్లో 190 పరుగులు చేశాడు. పేసర్ ఆకాశ్ దీప్ రాంచి టెస్టులో మూడు వికెట్లతో మ్యాచ్‌ను మలుపుతిప్పాడు.

ఐదుగురు బౌలర్లతో..

భారత బ్యాటింగ్ లైనప్ బలహీనంగా ఉంది. గణాంకాల్లో ఇది మరింత స్పష్టంగా తెలుస్తుంది. మిడిల్ ఆర్డర్‌లో పూర్తిగా కొత్తవారే ఉన్నారు. విరాట్ కోహ్లి వంటి బ్యాటర్ సేవలు అందుబాటులో లేని వేళ బ్యాట్‌తో మెరిసే మరో ఆల్‌రౌండర్‌ను తుది జట్టులో చేర్చుకోవటం సహజం. కానీ రోహిత్, ద్రవిడ్‌లు ఆ పని చేయలేదు. బ్యాటింగ్ విభాగంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయిలో ఐదుగురు బౌలర్లను ఎంచుకున్నారు. ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచటం సాధ్యపడింది. సాధారణంగా బ్యాటర్లు ఓ బౌలర్‌ను ఎంచుకుని అతడి ఓవర్లోనే ఎక్కువ పరుగులు చేసేందుకు సిద్ధమవుతారు. ఇతర బౌలర్లను గౌరవిస్తూ రిస్క్ తీసుకోరు. మన బౌలర్లలో అందరూ ప్రత్యర్థి బ్యాటర్‌పై ఒత్తిడి పెంచుతూనే ఉన్నారు. దీంతో ఇంగ్లాండ్ బ్యాటర్లపై ఒత్తిడి కొనసాగింది. ఫలితమే, ఎక్కువ సార్లు వరుసగా వికెట్లు కోల్పోయారు. తక్కువ పరుగుల వ్యవధిలో ఎక్కువ వికెట్లు చేజార్చుకున్నారు. బౌలింగ్ దళంలో బలహీనత లేకపోవటంతోనే ఇది సాధ్యపడింది.

మన స్టయిల్‌లో...

బజ్‌బాల్.. బజ్‌బాల్.. టెస్టు సిరీస్‌లో ఎక్కువగా చర్చకు వచ్చిన అంశం. దీంతో సహజంగానే క్రికెటర్లలోనూ బజ్‌బాల్ మేనియా ఉంటుంది. తొలి రెండు టెస్టుల అనంతరం టీమ్ ఇండియా.. బజ్‌బాల్‌ను బజ్‌బాల్‌తోనే ఎదుర్కొంటుందా? అనే అనుమానం కలిగింది. అందుకు కారణం లేకపోలేదు. భారత బ్యాటర్లలో ఎక్కువ శాతం దూకుడుగా ఆడుతూ వికెట్లు చేజార్చుకున్నారు. హైదరాబాద్ టెస్టులో భారత బ్యాటర్లు ఎదురుదాడి చేస్తూ 56 శాతం వికెట్లు కోల్పోయారు. కానీ ఇంగ్లాండ్ 25 శాతం వికెట్లే కోల్పోయింది. బౌల్డ్, ఎల్బీ, వికెట్ కీపర్ క్యాచ్, స్లిప్స్, బ్యాట్-ప్యాడ్ నిష్క్రమణలు భారత ఇన్నింగ్స్‌లో తక్కువయ్యాయి. భారత్ ఈ పొరపాటును మార్చుకుంది. వరుసగా రాజ్‌కోట్, రాంచి, ధర్మశాలలో అవసరం లేని రిస్క్ తీసుకోలేదు. ధర్మశాల టెస్టులో దూకుడుగా ఆడుతూ భారత్ 20 శాతం వికెట్లు..ఇంగ్లాండ్ 45 శాతం కోల్పోయింది.

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ మనదే

మరోసారి సాత్విక్-చిరాగ్ జోడీదే టైటిల్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ సత్తా చాటింది. బ్యాడ్మింటన్ డబుల్స్ టైటిల్‌ను సాత్విక్-చిరాగ్ శెట్టి జంట గెలుచుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో చైనీస్ తైపీకి చెందిన లీజే హువే - యాంగ్ పో హ్సువాన్‌ను 39 నిమిషాల్లో 21-11 21-17తో భారత టాప్ సీడ్ ఓడించింది. తొలి గేమ్‌లో అలవోకగా గెలుపొందిన వీరు.. రెండో గేమ్‌లో గట్టిపోటీని ఎదుర్కొన్నారు. అయినప్పటికీ దూకుడుగా ఆడి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి ఈ టైటిల్‌ను గెలవడం ఇది రెండోసారి. ఈ ప్రపంచ నం.1 జోడీ ఫ్రెంచ్ ఓపెన్-2019లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత 2022లో టైటిల్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్ జంట 21-13, 21-16తో కాంగ్ మిన్, సుయెూ సుయంగ్ (కొరియా) జోడీని ఓడించింది.

ఏబీబీతో ఎఫ్ఐఎం దోస్తీ!



హైదరాబాద్ : ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్, ఏబీబీ ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ ఒక వేదికపైకి రానున్నాయి!. ఏప్రిల్ 13-14న మిసానోలో జరుగనున్న అరంగ్రేట ఫార్ములా ఈ రేసులో భాగంగా ఎఫ్ఐఎం, ఏబీబీ కలిసి సాంకేతికత పరిజ్ఞానం పంచుకోనున్నాయి. ఈ మేరకు ఎఫ్ఐఎం, ఏబీబీ ఓ సంయక్త ప్రకటనలో తెలిపాయి. ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్‌లో భారత జట్టు ఇండీ రేసింగ్ సైతం మిసానో ఈ ప్రిక్స్‌లో మెరువనుంది. ఈ మేరకు ఇండీ రేసింగ్ సీఈవో అభిషేక్ రెడ్డి తెలిపారు. 'ఏబీబీతో ఎఫ్ఐఎం భాగస్వామ్యం భారత్‌లో మోటార్ రేసింగ్‌కు ఊతం కానుంది. ఇండీ రేసింగ్ జట్టు యజమానిగా ఆధునాతన సస్టెయినబుల్ రేసింగ్ విధానాలకు కట్టుబడి ఉన్నాను' అని అభిషేక్ అన్నారు. మిసానోలో ఏబీబీ, ఎఫ్ఐఎం సంయుక్తంగా వర్క్‌షాప్‌లు, మ్యూచువల్ లెర్నింగ్, నాలెడ్జ్ షేరింగ్, ఈవీ వెహికల్స్ అభివృద్ధిలో సహకారం కొనసాగింపు వంటి అంశాల్లో వ్యూహాత్మక సంయుక్త చర్చలో ఇండీ రేసింగ్ జట్టు పాల్గొంటుందని అభిషేక్ రెడ్డి వెల్లడించారు.

లైన్ మ్యాన్ల జీవితాలకు ప్రతిబింబం



తెలుగు, తమిళ సినిమాల్లో విభిన్నమైన సినిమాలు చేస్తూ తనదైన ప్రత్యేకతను సంపాదించుకున్న హీరో త్రిగుణ్. ఆయన 'లైన్ మ్యాన్' చిత్రంతో కన్నడ సినీ ఇండస్ట్రీలోనూ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వటానికి సిద్ధమయ్యారు. వి.రఘుశాస్త్రి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కన్నడ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతుండటం విశేషం. పర్పల్ రాక్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి ప్రచూర.పి, కాద్రి మణికాంత్, జ్యోతి రఘుశాస్త్రి, భళా స్టూడియో సహ నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. ఈనెల 15న 'లైన్ మ్యాన్' చిత్రం తెలుగు, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో శనివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు శివ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేసి బిగ్ టికెట్ లాంచ్ చేశారు.

త్రిగుణ్ మాట్లాడుతూ, 'లేడీస్ లైన్ ఉమెన్‌గా రావడం చూసి.. ఈ సినిమాను చేయాలని అనుకున్నా. కథ సరిగ్గా ఆడలేదు.. చీకటి గదిలో చితక్కొట్టుడు సినిమాలో అన్నీ బూతులే. డబ్బులు బాగా వచ్చాయి. కారు, ఇళ్లు కొనుక్కుని సెటిల్ అయ్యా. కానీ లైన్ మెన్ లాంటి సినిమాలు తీసినప్పుడు రాత్రి పూట ప్రశాంతంగా పడుకుంటాం. ఇప్పుడు సినిమాలకు భాషా సరిహద్దుల్లేవు. లైన్ మెన్‌లు చేస్తున్న సేవలను ఎవ్వరూ గుర్తించడం లేదు. తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేశాను. ప్రకాష్ రాజ్ నా మొదటి సినిమాను నిర్మించారు. ఆయనలా అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఉంటుంది. నా కోరిక తీర్చిన నా నిర్మాతలకు థ్యాంక్స్. వంశీ అన్న నన్ను ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటారు. బి. జయశ్రీ ప్రముఖ థియేటర్ ఆర్టిస్ట్. ఆమెకు పద్మ శ్రీ అవార్డు వచ్చింది. అలాంటి వారు మా సినిమాలో నటించడం ఆనందంగా ఉంది. మనం ఇప్పుడు ఫోన్, టీవీ వంటి వాటికి బానిసల్లా మారాం. ఓ గంట కరెంట్ లేకపోతే ఉండలేని పరిస్థితికి వచ్చాం. ఓ ఊర్లో పది రోజులు కరెంట్ లేకపోతే ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమా కథ. లేనప్పుడు దాని విలువ తెలుస్తుంది. జీవితం చాలా చిన్నది.. చాలా విలువైనది. ఇలా ప్రతీది విలువైందే అని సందేశం ఇచ్చే చిత్రమిది. ఓపెనింగ్స్ తెప్పించేంత బలం, బలగం లేదు. కానీ మా కథే మా బలగం. ప్రతీ ఒక్కరూ మా సినిమాకు కనెక్ట్ అవుతారు' అని అన్నారు.

'ప్రస్తుతం సినిమా కంటెంట్ మారుతోంది. కథే హీరోగా మారింది. ఈ చిత్రం కూడా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తీశారు. పూర్తిగా పల్లెటూరిలోనే చిత్రీకరణ చేశారు. త్రిగుణ్ ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా ప్రయత్నిస్తూనే ఉంటారు. ఇలాంటి సినిమాను తీసిన దర్శక, నిర్మాతలకు ఆల్ ది బెస్ట్' అని దర్శకురాలు నందినీ రెడ్డి చెప్పారు.

పాతబస్తీలో వినూత్నంగా రిలీజైన హే.. హలో పాట



ఇప్పటి వరకు భారతీయ సినిమాలో ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారు. కాని తొలిసారిగా పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు.

నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు.

చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రంలోని 'హే హలో.. నమస్తే' అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను హైదరాబాద్‌లోని పాతబస్తీలో వినూత్నంగా విడుదల చేశారు. ఈ పాటను పాటల రచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ కేవీ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా విచ్చేసి విడుదల చేశారు.

నిర్మాతల్లో ఒకరైన సంపత్ మక మాట్లాడుతూ,'నేను ఈసినిమా చేయడానికి ఒకే ఒక్క కారణం నాని. కేవలం అతని మీద నమ్మకంతో సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో ఉన్న నేను ఈ సినిమాతో నిర్మాతగా మారాను. ఈ పాట విని సినిమా చేయడానికి ఓకే అన్నాను. ఈ పాటతోనే మా జర్నీ ప్రారంభం అయింది. హైదరాబాద్ బ్యూటీని చాటి చెప్పే ఈ పాట హైదరాబాద్ యాంథమ్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు.

నవచిత్రం

మహిళాశక్తిని చాటే రుక్మిణి దేవి



రీతూ వర్మ

శ్రీవిష్ణు పుట్టినరోజు సందర్భంగా, దర్శకుడు హసిత్ గోలీతో చేస్తున్న కొత్త సినిమాకి 'శ్వాగ్' అనే టైటిల్‌ని హిలేరియస్ వీడియో ద్వారా మేకర్స్ అనౌన్స్ చేశారు. టైటిల్, కాన్సెప్ట్ వీడియో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. శ్రీవిష్ణు, హసిత్ గోలి రీయూనియన్‌గా వస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న రీతూ వర్మ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా శ్వాగ్ మేకర్స్ ఆమె పాత్రను వింజమర వంశంలోని మహారాణి రుక్మిణి దేవిగా పరిచయం చేశారు. క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలో రీతూ వర్మ శ్రీవిష్ణు వ్యాఖ్యలను పరిహాసం చేస్తూ కనిపించారు. మగవారి కంటే స్త్రీలు గొప్పవారు, శక్తివంతులు అని చెప్పారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన శ్రీవిష్ణు, 'శ్వాగ్' అనేది మగవారి కథ, శ్వాగనికి వంశం కథ అని స్పష్టం చేశారు.

వీడియో హిలేరియస్‌గా ఉంది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న శ్వాగ్- శ్రీ విష్ణు, హసిత్ గోలీల నుండి మరొక యూనిక్ మూవీ. శ్రీవిష్ణు, రీతూ వర్మ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత : టి.జి. విశ్వ ప్రసాద్, రచన -దర్శకత్వం: హసిత్ గోలి, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్, ఎడిటర్: విప్లవ్ నిషాదం, ఆర్ట్ డైరెక్టర్: శేఖర్, స్టైలిస్ట్: రజనీ, కొరియోగ్రఫీ: శిరీష్ కుమార్, స్టంట్స్: నందు మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనునాగవీర, సాహిత్యం: భువన చంద్ర, రామజోగయ్య శాస్త్రి, జొన్నవిత్తుల, నిఖిలేష్ సుంకోజీ, స్వరూప్ గోలి సౌండ్ డిజైన్: వరుణ్ వేణుగోపాల్,

అంతకుమించి వినోదం



సూపర్ హిట్ వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్' సీజన్ 2 ఈ నెల 15వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.

మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం ఈ వెబ్ సిరీస్‌ను క్రియేట్ చేశారు. అరుణ్ కొత్తపల్లి దర్శకుడు. ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, శ్రీకాంత్ అయ్యంగార్, గంగవ్వ, వేణు యెల్దండి, సీరత్ కపూర్, పావని గంగిరెడ్డి, దేవయాని, దర్శన బానిక్, హర్ష వర్ధన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది.

ఈ కార్యక్రమంలో దర్శక, నిర్మాత మహీ వి రాఘవ్ మాట్లాడుతూ, 'సేవ్ ద టైగర్స్' వెబ్ సిరీస్ విషయంలో ముందుగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ వాళ్లకు థ్యాంక్స్ చెప్పాలి. ముందుగానే సీజన్ 2 కూడా అనుకుని ఓకే చేయించుకున్న ఫస్ట్ సిరీస్ ఇదే అనుకుంటా. ఇలాంటి ఫన్ ఎంటర్‌టైనింగ్ షోస్‌లో రైటింగ్ కంటే ఆర్టిస్టుల పర్‌ఫార్మెన్స్ చాలా ముఖ్యం. ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత వంటి యాక్టర్స్ అంతా ఈ కథని ఓన్ చేసుకుని నటించారు. మన జీవితాల్లో జరిగే సరదా సందర్భాలను, క్యారెక్టర్ బేస్డ్‌గా ఓ మంచి కామెడీ షో చేయాలనే ఆలోచన నుంచి సేవ్ ద టైగర్స్ మొదలైంది. సీజన్ 1 చేసిన ప్రదీప్‌కు, ఇప్పుడు సీజన్ 2కు డైరెక్షన్ చేసిన అరుణ్‌కు థ్యాంక్స్. ఈ సెకండ్ సీజన్ కూడా మీకు బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాం. సేవ్ ద టైగర్స్‌లో మరిన్ని సీజన్స్ చేయాలనే ఆలోచన ఉంది. నాలుగైదు సీజన్స్ తర్వాత ఇందులో బాగా వర్కవుట్ అయిన క్యారెక్టర్స్‌ను తీసుకుని సినిమా కూడా చేసుకోవచ్చు' అని అన్నారు.

'ఈ సిరీస్ ఫస్ట్ సీజన్ సూపర్ హిట్ అయిన తర్వాత సెకండ్ సీజన్ కోసం హాట్ స్టార్‌ను అప్రోచ్ అయ్యాం. అయితే ఫస్ట్ సీజన్‌ను మరిపించేలా సెకండ్ సీజన్ చేయగలమా లేదా అనే టెన్షన్ ఆ టైమ్‌లో మాలో ఉండేది. క్రియేటివ్ ఫ్రీడమ్ మొత్తం హాట్ స్టార్ వాళ్లు మాకే వదిలిపెట్టారు. మేము మా శక్తిమేరకు ప్రయత్నించి, మంచి సిరీస్ చేశామనే భావిస్తున్నాం. మీ అందరికీ 'సేవ్ ద టైగర్స్ 2' నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని దర్శకుడు ప్రదీప్ అద్వైతం అన్నారు.

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సినిమా



నవీన్ రెడ్డి

సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో సాయి తేజ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించిన చిత్రం 'వెయ్ దరువెయ్'. ఈనెల 15న సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు.

- మాది కృష్ణాజిల్లా దగ్గర నూజివీడు. మా బంధువులు కృష్ణాజిల్లా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంటారు. అలా నాకు సినిమా ఇండస్ట్రీతో అనుబంధం ఉంది. పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్స్ చేసిన తర్వాత సతీష్ వేగేశ్న దగ్గర దర్శకత్వ శాఖలో వర్క్ స్టార్ట్ చేశాను. ఇప్పుడు ఈ చిత్రంతో దర్శకుడిగా మారాను.
- నిర్మాత దేవరాజ్ పోతూరు కథ వినగానే ఆయనకు నచ్చటంతో సినిమా చేయటానికి అంగీకరించారు. దర్శకుడిగా ఇది తొలి చిత్రమే అయినప్పటికీ ఎలాంటి ప్రెషర్ ఫీల్ కాలేదు. అందుకు కారణం నిర్మాత దేవరాజ్, హీరో సాయిరామ్ శంకర్ సహా ఎంటైర్ టీమ్ అందించిన సపోర్ట్.
- కామారెడ్డి ప్రాంతంలో ఉండే హీరోకి ఓ సమస్య వస్తుంది. దాని పరిష్కారానికి హీరో ఏం చేశాడు?, ఎందుకు హైదరా బాద్ వచ్చాడు.. సమస్యను ఎలా పరిష్కరించు కున్నాడనేదే మా సినిమా మెయిన్ కథాంశం. సినిమా చిన్న సెంటిమెంట్‌తో ప్రారంభం అవుతుంది. అందరికీ కనెక్ట్ అయ్యే కొన్ని నిజ జీవిత ఘటనలను ఆధారంగా చేసుకుని సినిమాను తెరకెక్కించాం.
- అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గానే కాకుండా యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. అలాగే మంచి సీనియర్ ఆర్టిస్టులు నటించారు. హీరోయిన్స్ యషా శివకుమార్, హెబ్బా పటేల్‌కు మంచి ప్రాధాన్యత ఉంటుంది. కథలో భాగంగా వారి పాత్రలు ట్రావెల్ అవుతాయి.
- ఈ సినిమా దర్శకుడిగా నాకు మంచి ఎక్స్‌పీరియెన్స్ నిచ్చింది. సినిమా ఫస్ట్ కాపీ చూసి నిర్మాత చాలా హ్యాపీగా ఫీలయ్యారు. రెండున్నర గంటల పక్కా ఎంటర్‌టైనర్ ఇది. నెక్ట్స్ సినిమా ఇంకా కన్‌ఫర్మ్ కాలేదు. డిస్కషన్స్ జరుగుతున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.